# తానా పత్రిక

Telugu Association of North America

❖ Volume - 31 ❖ Issue - 4 ❖ July 2024




TANA
Our Youth are Our Heritage
Est. 1977
www.tana.org
పాఠశాల
మన తెలుగు... మన పిల్లల కోసం
FEE ONLY
$ 125
PER YEAR
మీరు అమెరికాలో సెటిల్ అయిన తెలుగు వారా ?
మీ పిల్లలకి తెలుగు మాట్లాడడం కష్టంగా ఉందా ?
అయితే మా పాఠశాలలో చేర్పించండి
Admissions Open
2024 - 2025
CLASSES STARTING SOON
వివరములకు :
paatasala@tana.org
For Registraions please use the link below
https://paatasala.tana.org/registration
(732) 688-8634 / (408) 499-6530 / (781) 298-1569 / (610) 620-4135
TV5 NEWS
mana INTERNATIONAL

Volume-31 Issue-6
July 2024

*Editor*
**Sai Brahmanandam Gorti**
gorthib@gmail.com

*Associate Editor*
**Naveen Vasireddy** (India)
kathanaveen@gmail.com

The opinions expressed in TANA Patrika belong to the individual authors and do not necessarily reflect those of TANA or the Editorial Board.

# TELUGU ASSOCIATION OF NORTH AMERICA

**A 501(c)(3) Certified Nonprofit Organization - Tax ID - 36-3060732**
**26233 Taft RD, Novi, MI 48374**

# ఉత్తర అమెరికా తెలుగు సంఘము

*Our Mission*

**"To identify and address social, cultural and educational needs of North American Telugu Community in particular and Telugu people in general"**

*President*
**Niranjan Srungavarapu**
(248) 342-6872; president@tana.org

*Executive Vice President*
**Naren Kodali**
703-371-5029; evp@tana.org

*Immediate Past President*
**Anjaiah Chowdary Lavu**
(770) 235-2709; lachowdary@yahoo.com

*Secretary*
**Venkata (Raja) Kasukurthi**
(201) 270-8648; vkasukurthi@gmail.com

*Treasurer*
**Bharath Maddineni**
(678) 772-1681; bmaddine@gmail.com

*Joint Secretary*
**Venkat Koganti**
(848) 203-2118; venkatkoganti@yahoo.com

*Joint Treasurer*
**Sunil Pantra**
(248) 469-2349; pantrasunil@gmail.com

*Community Services Coordinator*
**Lokesh Konidala**
(469) 585-9064; K.lokesh@outlook.com

*Cultural Services Coordinator*
**Dr. Uma Aramandla Katiki**
630 776 9394; umakatiki2@gmail.com

*Women Services Coordinator*
**Sohini Ayinala**
678-361-7574; sayinala@gmail.com

*International Coordinator*
**Tagore Mallineni**
314 435 5584; tagore.mallineni@gmail.com

*Sports Coordinator*
**Nagamalleswara Panchumarthy**
6037241437; npanchumarthi@gmail.com

*Councilor-at-large*
**Sateesh Kommana**
214-554-2355; sateesh@gmail.com

*Chairman, Board of Directors*
**Dr. Nagendra Srinivas Kodali**
(404) 290-2076; srinikodali@hotmail.com

*Chairman, Foundation*
**Sasikanth Vallepalli**
(508)329-2217; kant2@outlook.com

*Regional Coordinators*

**Rajesh Yarlagadda**
Appalachian
**Sateesh Chinta**
Capital
**Paramesh Devineni**
DFW
**Venkateswara Rao Singu**
Mid-Atlantic
**Sriharsha Garikapati**
Midwest
**Krishnaprasad Sompally**
New England
**Ramakrishna Vasireddy**
New Jersey
**Deepika Sammeta**
New York
**Neelima Manne**
North
**Sriman N Yarlagadda**
North Central
**Suresh Patibandla**
North West
**Venkat Adusumilli**
Northern California
**Sivalingaprasad Chava**
Ohio Valley
**Sekhar Kolla**
Rocky Mountains
**Imesh Chandra Gutta**
South Central
**Madhukara B. Yarlagadda**
South East
**Sumanth Pusuluri**
South West
**Hemakumar Gotti**
Southern California




ముఖచిత్రం,
శకుంతల
చిత్రకారులు: కొండపల్లి శేషగిరిరావు

మిడ్ వెస్ట్‌లో తానా
కల్చరల్ కాంపిటీషన్స్
14





వాషింగ్టన్ డీసీలో
తానా పాఠశాల నమోదు
16

న్యూ ఇంగ్లండ్‌లో
సీతారామ కళ్యాణం
కూచిపూడి నృత్య ప్రదర్శన
19



నివాళి



రామోజీరావు
32

శత జయంతి
కొండపల్లి శేషగిరిరావు
36



## ఇంకా...

Editorial ... 05
TANA President's Message ... 07
TANA Executive Committee ... 08
TANA Board of Directors ... 10
TANA Foundation ... 11
TANA Foundation Donation Form ... 12
Invitation for TANA
Cyltural Competitions ... 15
పోలెండ్‌లో టెన్నిస్‌లో విజేత అనూష ... 18
బోస్టన్‌లో తానా ఫాదర్స్ డే వేడుకలు ... 20
TANA Chess Tournament ... 22
TANA Mega Cricket Tournament ... 23
Workshop on Writing Articles for Media ... 24
తానా రిఫ్రెష్ వర్క్ షాప్ ... 25
తానా ప్రపంచ సాహిత్యవేదిక సదస్సు ... 30
సీరియల్ - వెన్నెల్లో ఆడపిల్ల
- యండమూరి వీరేంద్రనాథ్ ... 38
గుర్తుకొస్తున్నాయి - చెట్టుకింద ప్లీడర్-2
- వంశీ ... 48
జ్ఞాపకాలు - ముపాసాతో ఓ మిట్టమధ్యాహ్నం
- ఎ. జగన్నాథ శర్మ ... 56
కథ - మోహనవంశీ
- విజయ కర్రా ... 60
ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు సినిమాకి కొత్త కళ
- జలపతి & శ్రీ అట్లూరి ... 66
మళ్లీ నిరూపించిన ప్రభాస్
- జలపతి & శ్రీ అట్లూరి ... 70



## సంపాదకీయం

తానాపత్రిక పాఠకులకీ, అందరికీ ఇండిపెండెన్స్ డే శుభాకాంక్షలు!

భారతదేశంలో ప్రధాన ఎన్నికలు ముగిసి ముచ్చటగా మూడోసారి నరేంద్ర మోదీ ప్రధాన మంత్రి అయ్యారు.

ప్రతీసారిలా కాకుండా ఈసారి ప్రతిపక్షానిక్కూడా మరిన్ని విజయాలు లభించాయి. ప్రజాస్వామ్య సమతుల్యత వచ్చి ఏకపక్ష నిర్ణయాలు కాకుండా దేశానికి మంచి జరిగాలని ఆశిద్దాం.

ఏ ప్రభుత్వం వచ్చినా ప్రజలకి, ముఖ్యంగా పేదలకి మేలు జరిగాలని ఆశిద్దాం.

ఎంత వద్దనుకున్నా, ఈసారి కూడా పత్రిక ఆలస్యంగా వచ్చింది.

ఈ సంచికలో ఎప్పటిలాగే తానా కార్యక్రమ విశేషాలూ, కథలూ, వ్యాసాలూ, సినిమా విశేషాలతో పాటు ప్రముఖ చిత్రకారులు కొండపల్లి శేషగిరిరావుగారి శతజయంతి సందర్భంగా వారి గురించి ప్రత్యేక వ్యాసం వున్నాయి.

అభినందనలతో...

అభినందనలతో...
సాయి బ్రహ్మానందం

ఉత్తర అమెరికా తెలుగు సంఘము

**Telugu Association of North America**

A 501(c)(3) Certified Nonprofit Organization - Tax ID: 36-3060732

Our Youth are Our Heritage
Est. 1977
www.tana.org

# TANA Member Benefits








## Car Rentals

**Enterprise and National Car Rental**
Account # OSMBAQT| Discount upto 10% |Prioirty car rental

**Budget Car Rental:** CDP# V124932 | Discount upto 30% | Unlimited mileage | Free Add on Driver

**Avis Car Rental:** CDP# T326011 | Discount upto 30% | Unlimited mileage | Free Add on Driver

**Dollar Car Rental:** CDP# 3075644 | Discount 7% off Base rates | Free Additional Driver | Unlimited Mileage

**Thrifty Car Rental:** CDP# 3075647 | Discount 7% off Base rates | Free Additional Driver | Unlimited Mileage

## Hotel and Hospitality

**Hyatt Group:** Corporate Code 225686 | 15% Discount on all participating Hyatt Group Hotels

Enter you're the corporate code under Special Rates-Corporate or Group code.

**IHG Group:** Corporate Code 787101128 | 7% Discount on all participating IHG Hotels

**Choice Group:** Corporate Code 00746710 5% Discount on all participating Choice Hotels Group

## Residential Services

**Sherwin Williams:**
Corporate Account# 7901-4243-4
Upto 60% off

**Mattress Firm:**Corporate Account#13081634
Upto 65% off
Please reach out to Ashok Kolla to place order

## Automobile

**Discount Tires:** Corporate Account 63928
10% Discount on All tires
Price match guaranteed.

**Mavis Tires:** Corporate Account 12956
15% Discount on Tires, Brakes & Other Services | Price match guaranteed.

**Jiffy Lube:** Corporate Account 13081634
15% off oil changes

**Valvoline:** Corporate Account P4083246
15% off oil changes, and car services | Tax Exempt

**Take 5:** Corporate Account 172285
25% off on all services | Extra 5% off before 9 AM and afer 5PM
Additional 5% off Ancillary items

**NAPA Autoparts:** Corporate Account 18776
Upto 30% off car parts and accessories
Tax Exempt



# President's Message

**NIRANJAN SRUNGAVARAPU**
***President***

తానా పత్రిక పాఠకులకీ, తానా కార్యకర్తలకీ, అందరికీ జులై 4 అమెరికన్ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు!

అమెరికాలో వేసవి వచ్చిందంటే తానా ద్వారా ఎన్నో కార్యక్రమాలు ప్రారంభం అవుతాయి.

ఈసారి తానా సమ్మర్ క్యాంప్స్, యూనివర్శిటీ రిజిస్ట్రేషన్స్ ముమ్మరంగా సాగుతున్నాయి. అలాగే తానా పాఠశాలకు 2024-2025 సంవత్సరానికిగాను ప్రవేశాలకి సన్నాహాలు జరుగుతున్నాయి.

క్రితం నెలలో ఇండియా వెళ్లినప్పుడు అనేక ఆసుపత్రులను సందర్శించాను. ఆ సందర్భంలో ఆయా ఆసుపత్రి యాజమాన్యం వారితో జరిపిన సంప్రదింపులలో తానా సభ్యులకు ప్రత్యేక వైద్య సాయం అందించడానికి వారు సుముఖత వ్యక్తం చేసారు. వాటి వివరాలు త్వరలోనే ప్రకటిస్తాము.

అలాగే తానా ఫౌండేషన్ ద్వారా హెల్త్ క్యాంప్స్, కేన్సర్ స్క్రీన్ టెస్ట్ క్యాంప్స్ వంటివి నిర్వహిస్తున్నాము.

ఈ వేసవిలో మరిన్ని కార్యక్రమాలు జరపడానికి ప్రయత్నిస్తున్నాము. ఆ వివరాలు వచ్చే నెల సంచికలో ప్రకటిస్తాము.

అభినందనలతో...

మీ
నిరంజన్ శృంగవరపు

# TANA EXECUTIVE COMMITTEE - 2023-2025



**Niranjan Srungavarapu**
*President*



**Naren Kodali**
*Executive Vice President*



**Anjaiah Chowdary Lavu**
*Past President*



**Venkata (Raja) Kasukurthi**
*Secretary*



**Bharath Maddineni**
*Treasurer*



**Venkat Koganti**
*Joint Secretary*



**Sunil Pantra**
*Joint Treasurer*



**Lokesh Konidala**
*Community Service Coordinator*



**Dr. Uma Aramandla Katiki**
*Cultural Service Coordinator*



**Sohini Ayinala**
*Women Services Coordinator*



**Sateesh Kommana**
*Councilor-at-Large*



**Tagore Mallineni**
*International Coordinator*



**Nagamalleswara Panchumarthy**
*Sports Coordinator*



**Dr. Nagendra Srinivas Kodali**
*BOD Chair (Ex Officio)*



**Sasikanth Vallepalli**
*Foundation Chair (Ex Officio)*

# REGIONAL COORDINATORS



**Rajesh Yarlagadda**
*Appalachian*



**Sateesh Chinta**
*Capital*



**Paramesh Devineni**
*DFW*



**Venkateswara Rao Singu**
*Mid-Atlantic*



**Sriharsha Garikapati**
*Midwest*



**Krishna Prasad Sompally**
*New England*



**Ramakrishna Vasireddy**
*New Jersey*



**Deepika Sammeta**
*New York*



**Neelima Manne**
*North*



**Sriman N Yarlagadda**
*North Central*



**Suresh Patibandla**
*North West*



**Venkat Adusumalli**
*Northern California*



**Sivalinga Prasad Chava**
*Ohio Valley*



**Sekhar Kolla**
*Rocky Mountains*



**Madhukara B Yarlagadda**
*South East*



**Emesh Gutta**
*South Central*



**Sumanth Pusuluri**
*South West*



**Hemakumar Gotti**
*Southern California*

# TANA BOARD OF DIRECTORS - 2023-2025



**Dr. Nagendra Srinivas Kodali**
*Chairman*



**Lakshmi Devineni**
*Secretary*



**Janardhan Nimmalapudi**
*Treasurer*



**Srinivas Lavu**
*Director*



**Ravi Potluri**
*Director*



**Malli Vemana**
*Director*



**Hema C Kanuru**
*Director*



**Niranjan Srungavarapu**
*Ex Officio Member*
*President, EC*



**Naren Kodali**
*Ex Officio Member*
*Executive Vice President, EC*



**Anjaiah Chowdary Lavu**
*Ex Officio Member*
*Past President*



**Venkata (Raja) Kasukurthi**
*Ex-Officio Member*
*Secretary, EC*



**Bharath Maddineni**
*Ex-Officio Member*
*Treasurer, EC*



**Sasikanth Vallepalli**
*Ex Officio Member*
*Chairman, TANA Foundation*



**Vidyadhar Garapati**
*Ex Officio Member*
*Secretary, TANA Foundation*



**Vinay Maddineni**
*Ex-Officio Member*
*Treasurer, TANA Foundation*

# TANA FOUNDATION 2023-2025



**Sasikanth Vallepalli**
*Chairman*



**Vidyadhar Garapati**
*Secretary*



**Vinay Maddineni**
*Treasurer*



**Kiran Gogineni**
*Joint Treasurer*



**Ramakrishna Chowdary Allu**
*Trustee*



**Bhakta Balla**
*Trustee*



**Srinivasa Kukatla**
*Trustee*



**Raja Surapaneni**
*Trustee*



**Srinivas Yenduri**
*Trustee*



**Srinivas Oruganti**
*Trustee*



**Purushotham C Gude**
*Trustee*



**Srikanth Polavarapu**
*Trustee*



**Suresh Puttagunta**
*Trustee*



**Sridhar Gottipati**
*Trustee*



**Niranjan Srungavarapu**
*Ex-Officio Member*
*President*

# TANA FOUNDATION

*Division of Telugu Association of North America (TANA)*
*A not-for profit organization, Tax ID 36-3060732*

***To Donate or pledge please visit www.tana.org/donate or www.tanafoundation.org/donation or mail this form***

***We make a living by what we get; we make a life by what we give.***

## TANA FOUNDATION DONATION FORM

Name (First, Last): ______________________________________________

Address: ______________________________________________

Email Address:________________________ Phone:________________

I would like to sponsor the following:

- Orphanages: US$__________
- Vaaradhi US$__________
- Scholarships ($250 each): US$__________
- Eye Camp ($600)
  (Requires filling the sponsorship form on the web): US$__________
- Cancer Camp ($1500 each): US$__________
- Cleft Lip Surgeries ($250 each): US$__________
- Libraries ($500 each): US$__________
- Other (Specify) ________________ US$__________

Frequency (Check one) : ☐ One time ☐ Monthly ☐ Yearly

Check Number: ______________ (Payable to TANA Foundation)

Credit Card Number: ______________________________________

Billing Address: ______________________________________

CV Code: ____________

*Please mail the completed form to:*

**TANA Foundation**
**Treasurer**
26233 Taft Road,
Novi, MI 48374.

***For any questions or comments, please send an email to jaytalluri@gmail.com***

# *College admissions in the USA: FREE Awareness seminar by GrowME*

***AI powered college preparation!!!***

***New norm of college readiness!***

***Highlights***

- What is the right career choice for you
- What are colleges looking for in students?
- How can AI help you to navigate the process?
- How do you identify the right colleges for you?
- How can you make your essays standout?
- What are the scholarships that you can apply for?

***Panel***

College admission experts from GrowME

Venue: Zoom - https://tinyurl.com/growtana

Date: August 10, 2024

Time: 11.00 AM PST

Don't miss this chance to learn from the best!

We look forward to seeing you online on Aug 10th.

**VENKAT ADUSUMALLI**
TANA Regional Coordinator
Northern California

email: northerncaliforniarc@tana.org

phone: 6504402670



# మిడ్ వెస్ట్ చికాగోలో తానా కల్చరల్ కాంపిటీషన్స్...

తెలుగువారి వారసత్వ సంస్కృతిని సంరక్షించడం ధ్యేయంగా అనునిత్యం పాటుపడుతున్న తానా సంస్థ మరొకసారి తన కల్చరల్ కాంపిటీషన్స్‌ను నిర్వహించబోతోంది. ఆగస్టు 3న నేపర్ విల్లేలోని 1120 E డెల్హీ రోడ్, NIU ఆడిటోరియంలో కల్చరల్ కాంపిటీషన్స్ నిర్వహిస్తారు. డా. ఉమా ఆర్ కటికి (అరమండ్ల) ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతాయి.

ఎంతో ప్రతిష్టాత్మకమైన ఈ పోటీలకు తప్పకుండా హాజరుకండి. ఈ అద్భుతమైన అవకాశాన్ని ఉపయోగించుకొని మీలోని ప్రతిభను చాటి చెప్పి టైటిల్స్‌ను గెలుచుకోండి.

ఈ పోటీలు మూడు కేటగిరీస్‌లో నిర్వహించబడతాయి. క్లాసికల్, సినిమా, ఫోక్ విభాగాలలో పాటల పోటీతోపాటు డాన్స్ కాంపిటీషన్ కూడా నిర్వహిస్తాము. మీరు అద్భుతమైన డాన్స్ చేయగలిగే జోడి అయితే మీకు కూడా ఈ కాంపిటీషన్స్ =లో బంపర్ ఆఫర్ ఉంటుంది. అయితే ఈ పోటీలలో పాల్గొనడానికి ఏజ్ రెస్ట్రిక్షన్స్ కూడా కంపల్సరిగా ఫాలో అవ్వాల్సిందే.

సోలో సింగింగ్, గ్రూప్ డ్యాన్స్ విభాగంలో జూనియర్స్ కేటగిరీలో 9 సంవత్సరాలకంటే తక్కువ వయసు పిల్లలు పాల్గొనవచ్చు. జూనియర్స్ క్యాటగిరీలో 9 నుంచి 14 సంవత్సరాల మధ్య వయసు పిల్లలు పాల్గొనవచ్చు.

సీనియర్ విభాగంలో పాల్గొనే వారి వయసు 15 సంవత్సరాల నుంచి 25 సంవత్సరాల లోపు ఉండాలి.

డాన్స్ జోడిలో పాల్గొనే జంట వయసు 25 సంవత్సరాల కంటే ఎక్కువ ఉండాలి.

పోటీలలో పాల్గొనదలుచుకున్న వాళ్లు రిజిస్ట్రేషన్ తప్పకుండా చేయించుకోవాలి. కింద ఇచ్చినటువంటి లింకులను ఉపయోగించుకొని తప్పనిసరిగా మీరు రిజిస్ట్రేషన్‌ను 27 జూలైలోగా పూర్తి చేసుకోండి. ఆ తర్వాత రిజిస్ట్రేషన్ క్లోజ్ అవుతాయి కాబట్టి వీలైనంత త్వరగా మీ పేర్లు రిజిస్టర్ చేసుకోండి.

https://tinyurl.com/TANA-Participants
https://tinyurl.com/TANA-Attendees



# *Invitation for TANA's Cultural Competitions*

TANA's cultural competitions to be conducted in the Midwest (Chicago) on August 3rd at the NIU auditorium ,1120 E Diehl Rd, Naperville on Aug 3rd , 2024

Program starts at 9:30 am .

For the first time under the leadership of Dr. Uma.R.Katiki (Aramandla), TANA Cultural Services is bringing these competitions to be conducted in all TANA regions.

Chief Guest for this event is Mary Alexander-Basta, Bolingbrook Mayor.

These competitions are prestigious for the participants and at the same time fantastic celebrations for the attendees. So don't miss this wonderful opportunity, come and participate to showcase your talent and win the titles!!!

There will be 3 categories, Classical , Cinema and Folk in Singing and Dance, and an exciting Dance Jodi competition.
FREE REGISTRATION!!
Registration is mandatory for participants and attendees. Please register through the link provided.
Deadline for the registrations is July 27th.

Thank you Laxmi Naag garu for the beautiful video.

https://tinyurl.com/TANA-Participants
https://tinyurl.com/TANA-Attendees
https://youtu.be/x6Vci067SNU?si=h6spcG-2Feyut6X2



# వాషింగ్టన్ డీసీలో తానా పాఠశాల నమోదు






తానా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో 'తానా పాఠశాల' విద్యార్థుల నమోదు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బాలబాలికల తల్లిదండ్రులకు అమెరికావ్యాప్తంగా పాఠశాల నిర్వహణ, పాఠ్యాంశాల మీద అవగాహన కల్పిస్తూ, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దలు, ప్రవాసాంధ్రులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా తానా పాఠశాల ఛైర్మన్ భానుప్రకాష్ మాగులూరి మాట్లాడుతూ భాష సాంస్కృతిక వారధి అని, మాతృభాషను విస్మరించిన ఏ జాతి మనుగడ సాగించలేదని అన్నారు. మన పిల్లలు ఏ భాషలో చదువుకున్నా చక్కటి తెలుగును వారికి నేర్పించాల్సిన బాధ్యత మనపై ఉంది. భాష మారిపోతోంది, సమాజం మారుతోంది, మన సంస్కృతి, సాంప్రదాయాలు మారుతున్నాయి. కానీ అమెరికాలో మాత్రం వాటిని మనం సజీవంగా ఉంచుతున్నాం. భాష, ఆచార వ్యవహారాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది.



సామాజికంగా ఎంతో ప్రభావితమైన స్థానంలో ఉన్న మనం మాతృభాషను బ్రతికించాలని కోరారు భాను మాగులూరి.

మన్నవ సుబ్బారావు మాట్లాడుతూ, అన్ని భాషల్లో గొప్ప భాష తెలుగు. అలాంటి తెలుగు భాషను భావి తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. తెలుగుభాషను చంపే తరంగా మనం మిగలకూడదు. ఏ భాష ప్రజలైనా వారి మాతృభాషలోనే మాట్లాడతారు. అందుకు వారు గర్వపడతారు. ప్రపంచ తెలుగు దనాన్ని ఒక గొడుగు కిందకు చేర్చిన తానా తెలుగుజాతికి అమెరికాలో గుర్తింపు, గౌరవం తెచ్చారని కొనియాడారు. మానవ నాగరికత, వికాసంలో మనం అత్యంత




కీలకపాత్ర పోషిస్తున్నాం. మన సాంస్కృతిక వారసత్వ సంపదను కాపాడాలన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రవాసాంధ్రుల తల్లి దండ్రులు పాల్గొని భానుప్రకాష్ మాగులూరిని సత్కరించారు. యెండూరి సీతా రామారావు, అవిర్నేని రమేష్, ఆలంపల్లి రవికుమార్, రమాదేవి (డిప్యూటీ డైరెక్టర్, ఖాదీ ఇండస్ట్రీస్), పొత్తూరి నాగ సత్యనారాయణ రాజు, బిక్కిన వీర్రాజు, బాలచందర్, దయాకర్, శంకర్ ప్రసాద్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# పోలెండ్ టెన్నిస్‌లో సత్తా చాటిన అనూషకు తానా అభినందన

పోలండ్‌లో జరిగిన 17వ పోలండ్ కప్ ఇంటర్నేషనల్ సాఫ్ట్ టెన్నిస్ టోర్నమెంట్‌లో తానా స్పాన్సర్ చేసిన క్రీడాకారిణి అనూష నేలకుడిటి మూడు ఈవెంట్స్ ల్లోనూ విజయం సాధించి మెడల్స్‌ను అందుకుంది. సింగిల్స్ పోటీల్లో బ్రాంజ్ మెడల్‌ను, డబుల్స్‌లో బ్రాంజ్ మెడల్‌ను, మిక్స్‌డ్ డబుల్స్‌లో కూడా బ్రాంజ్ మెడల్‌ను అందుకుని తన సత్తాను ప్రదర్శించింది. జూలై 5 నుంచి 7వ తేదీ వరకు ఈ పోటీలు పోలండ్‌లో జరిగాయి.

తానా స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ నాగ పంచుమర్తి ఆమె ప్రతిభను గుర్తించి వివిధ టోర్నమెంట్‌లలో ఆమె పాల్గొనేందుకు వీలుగా తానా తరపున ఆమెకు అన్ని విధాలుగా అండగా నిలిచారు. ప్రతిభను ప్రోత్సహించడంలో ముందుండే నాగ పంచుమర్తి చొరవతో తానా నాయకులు కూడా తమ వంతుగా ఆమెకు సహకారాన్ని అందించారు. నేడు ఆమె వివిధ పోటీల్లో మెడల్స్‌ను గెలుచుకుని తానాకు మంచి పేరును తీసుకువచ్చింది. ఆమె గెలుపుపట్ల నాగ పంచుమర్తితోపాటు తానా నాయకులు పలువురు ఆమెకు అభినందనలు తెలియజేశారు.







## తానా-సప్తోరా ఆన్‌లైన్ సమ్మర్ క్యాంప్

తానా సహకారంతో సప్తోరా ఆధ్వర్యంలో ఆన్‌లైన్ సమ్మర్ క్యాంప్ కోర్సులు నిర్వహిస్తోంది. ఆరు సెషన్ల కోర్సుకు 20 డాలర్ల ఫీజుతో పది కోర్సులు అంద జేస్తోంది. అడ్వాన్స్‌డ్ లెవెల్ చెస్, రూబిక్స్ క్యూబ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, చెస్ ఫర్ బిగినర్స్, కీబోర్డ్, మెంటల్ మ్యాథ్, కాన్వా డిజైనింగ్, గ్రాఫైట్ ఆర్ట్, రోబ్లాక్స్, కాలిగ్రఫీ వంటి ఆసక్తికరమైన కోర్సులను ఈ సమ్మర్ క్యాంప్‌లో అందజేస్తున్నారు. ఈ కోర్సులపై ఆసక్తి కలవారు http://www.sapthora.com/tana/ వెబ్‌సైటులో దరఖాస్తు చేసుకోవచ్చు.

# తానా కళాశాల న్యూ ఇంగ్లాండ్ ఆధ్వర్యంలో శ్రీ సీతారామ కల్యాణ కూచిపూడి నృత్య ప్రదర్శన



ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) కళాశాల న్యూ ఇంగ్లాండ్ ఆధ్వర్యంలో 'శ్రీ సీతారామ కల్యాణ కూచిపూడి నృత్య' ప్రదర్శన కార్యక్రమం ఘనంగా జరిగింది. యుూఎస్‌లోని గ్రేటర్ బోస్టన్‌లో శ్రీ కూచిపూడి నాట్యాలయ, తానా కళాశాల న్యూ ఇంగ్లాండ్ డైరెక్టర్ శైలజా చౌదరి ఆధ్వర్యంలో సుమారు 200 మంది విద్యార్థులు, విద్యార్థినిలు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు.

శ్రీ సీతారామ కల్యాణ కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను కట్టిపడేసింది. 200మంది కళాకారులు ప్రదర్శన ఇవ్వడంతో చూసేందుకు ప్రేక్షకులకు రెండు కళ్లూ సరిపోలేదు. కల్యాణ మహోత్సవ వైభవాన్ని వివరంగా తెలిపేలా కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రదర్శన చూపరులను మంత్ర ముగ్ధుల్ని చేసింది.

ఈ కార్యక్రమానికి సుమారు 400మంది ప్రేక్షకులు హాజరయ్యారు. అనంతరం తానా మాజీ కోశాధికారి అమ్మని దాసరి కళాశాలలో ఉత్తీర్ణులైన విద్యార్థు లందరికీ పద్మావతి యూనివర్శిటీ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తానా న్యూఇంగ్లాండ్ ప్రాంతీయ ప్రతినిధి సోంపల్లి కృష్ణప్రసాద్ ప్రసంగించారు.

ఈ కార్యక్రమంలో తెలుగు గ్రేటర్ బోస్టన్ అధ్యక్షురాలు దీప్తి గోరా, శ్రీనివాస్ గొండి, శివ డోకిపర్తి, చంద్రారెడ్డి, సురేశ్ దగ్గుబాటి, రామకృష్ణ కొల్లా, కీర్తి తొగరు, సాయి లక్ష్మి, ఉమా కంతేటి, అనంతా జయం, మాధవి పోరెడ్డి, రజని దగ్గుబాటి, కోటేశ్ కందుకూరి, సూర్య తేలప్రోలు, రమణ బిల్లకంటి, సురేశ్ సూరప రాజు, మురళీ పసుమర్తి పాల్గొన్నారు. కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ కూచిపూడి నాట్యాలయ, తానా కళాశాల న్యూ ఇంగ్లాండ్ డైరెక్టర్ శైలజా చౌదరి కృతజ్ఞతలు తెలిపారు.

# బోస్టన్‌లో తానా ఆధ్వర్యంలో ఫాదర్స్ డే వేడుకలు

ఉత్తర అమెరికా తెలుగుసంఘం (తానా) న్యూ ఇంగ్లాండ్ చాప్టర్ ఆధ్వర్యంలో హాప్కిన్‌టన్ బోస్టన్‌లో ఫాదర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానికంగా ఉన్న పార్క్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రవాస భారతీయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వలివేటి శ్రీహరి ఆధ్వర్యంలో ఈ వేడకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ తండ్రుల ప్రాముఖ్యతను వివరించారు. మరోవైపు స్థానిక కళాకారులు, పాఠశాల విద్యార్థులు కలిసి పాటలు, నృత్యాలు, వివిధ రకాల స్కిట్లను ప్రదర్శించారు. కార్యక్రమానికి హాజరైన వారికి వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. తండ్రి-పిల్లల క్విజ్‌లు వంటి స్నేహపూర్వక పోటీలు అన్ని వయసుల వారికి వినోదాన్ని అందించాయి.

ఈ సందర్భంగా సంఘ నాయకులు, స్థానిక ప్రముఖులతో సహా ప్రత్యేక అతిథులు తమ అనుభవాలను పంచుకున్నారు. ఇలాంటి వేడుకలు నిర్వహించడం వల్ల తండ్రులను గౌరవించడమే కాకుండా అన్ని కుటుంబాలను దగ్గర చేసినట్లు అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో పిల్లలంతా కలిసి కేక్ కట్ చేసి, వారి వారి తల్లిదండ్రులకు తినిపించారు. ఈ కార్యక్రమానికి రమణ అవదూత కుటుంబ సభ్యులతో పాటు రవి దాదిరెడ్డి, శ్రీహరి రాయవరపు, గొరెపల్లి వెంకటేశ్వరరావు, చాగంటి శ్రీనివాసు, వెంకట కొప్పవోలు, బచ్చు శ్రీనివాసు, నిరంజన్ అవధూత, శ్యామ్ సబ్బెల్ల, ఆనంద్ గొర్రె, రామకృష్ణ తడపనేని, శ్రీనివాస్ పచ్చల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు,

తానా న్యూఇంగ్లండ్ ప్రాంతీయ ప్రతినిధి సొంపల్లి కృష్ణప్రసాద్ ఈ కార్యక్రమానికి హాజరైన వారికి కృతజ్ఞతలు తెలిపారు. తానా అధ్యక్షుడు నిరంజన్ శృంగవరపు తానా ఫౌండేషన్ చైర్మన్ శశికాంత్ వల్లేపల్లి అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.




Telugu Association of North America
ఉత్తర అమెరికా తెలుగు సంఘం
న్యూ ఇంగ్లాండ్ విభాగం
HAPPY FATHER'S
Niranjan Srungavarapu
President





# Chess Tournament

*We are excited to announce the upcoming TANA Chess Tournament, a USCF-rated event, and we cordially invite all New England TANA members to participate in this thrilling competition.*

***Event Details***

**Date: July20th Saturday** **Time:10 AM onwards**

***Venue:*** **Montrose School**

29 North Street, Medfield, MA 02052

***Registration Deadline:*** ONLINE / Onsite Registration closes 30 minutes before Round 1

This tournament is a fantastic opportunity for chess enthusiasts of all levels to showcase their skills, compete with fellow members, and enjoy a day of strategic fun. Whether you are a seasoned player or new to the game, we encourage you to join us for this engaging event.

***How to Register:*** Visit our registration page at https://www.nachesshub.com/Events/Details/fd140645-29b0-4b94-80a0-cf2f3e4bfe44

Complete the registration form with your details.

Pay the registration fee (if applicable).

Please ensure that you have an active USCF membership to participate in the tournament. If you are not yet a member, you can join the USCF at [Insert USCF Membership Link].

We look forward to your participation and making this tournament a grand success. Should you have any questions or require further information, please do not hesitate to contact us




***Let's come together to celebrate our shared passion for chess and make this event memorable.***

# Mega Cricket Tournament

***TANA and DTA are teaming up to host a massive cricket tournament this summer.***

***Register your team now to secure your spot.***

***Team registrations are now open! Once a team has made the payment, they will be registered and the team captain will receive access to add players.***

***For more details, visit***
**https://cricclubs.com/farmingtoncc/viewLeague.do?league=111&clubId=27071**



# Workshop on Writing Articles for Media

***Topic:*** Writing Articles for Media- Workshop

***Speaker Bio:*** Venkat, is the founder and chief editor of Sacramento Telugu Velugu Magazine.Over 200 of his Essays, News Coverage Articles, and Travel Log Articles have been published in India's mainstream newspapers and in Indian American Newspapers and Magazines. Based in California, he has a 25+ year career in IT, Project Management, and Service Management. He is also a professional mentor for BSMD programs for high school students.

Join Zoom Meeting

Date: Saturday, July 20

Time: 4.00pm PDT

Zoom: https://tinyurl.com/tanawriting

Meeting ID: 827 4934 0068

Passcode: 605905

***Don't miss this chance to learn from the best!***



# రిఫ్రెష్ వర్క్‌షాప్

అమెరికాకు వచ్చే ఫ్రెష్ స్టూడెంట్స్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన నిరంతర కార్యక్రమం ఇది. అమెరికాకు ఉన్నత విద్యకోసం వచ్చే విద్యార్థుల జీవితంలో అనేక విషాదాలు చోటు చేసుకుంటున్నాయి, దీనిని నివారించడానికి విద్యార్థులు అమెరికాలోని నియమాలు పాటిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. రిఫ్రెష్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు కలిసే ప్రదేశాలలో వర్క్ షాపులను నిర్వహించి తగు జాగ్రత్తలు సూచించడము, పెప్పర్ స్ప్రే ఎలా ఉపయోగించాలి, ఫోన్ పోయినట్లయితే ఏమి చేయాలి, అధికారులతో ఎలా మాట్లాడాలి, విద్యార్థులకు ఎలాంటి హద్దులు ఉంటాయి మొదలైన అంశాలను వివరించాలి. న్యూ ఇంగ్లాండ్ తానా ప్రాంతీయ ప్రతినిధి కృష్ణప్రసాద్ సోంపల్లి ఈ రకమైన వర్క్‌షాప్‌లను నిర్వహిస్తున్నారు. ఎడ్యుకేషన్ సిటీ బోస్టన్ లో రిఫ్రెష్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రిఫ్రెష్ ప్రోగ్రామ్‌లో భాగంగా వివిధ ప్రాంతాల నుండి వస్తున్న ఫోన్ కాల్స్‌లో కూడా వర్క్ షాప్ చేస్తున్నారు.



ఉత్తర అమెరికా తెలుగు సంఘము
TELUGU ASSOCIATION OF NORTH AMERICA

OUR MISSION: TO IDENTIFY AND ADDRESS SOCIAL, CULTURAL AND EDUCATIONAL NEEDS OF NORTH AMERICAN TELUGU COMMUNITY IN PARTICULAR AND TELUGU PEOPLE IN GENERAL

TELUGU ASSOCIATION OF NORTH AMERICA, INC.
TANA
Our Youth are Our Heritage
Est:1977
www.tana.org

# TANA ADVERTISING OPPORTUNITIES - 2024

## E - PATRIKA

| DESCRIPTION | 3-ISSUE | 6-ISSUE | 12-ISSUE |
|---|---|---|---|
| FRONT INSIDE COVER PAGE | $ 900 | $ 1,650 | $ 3,000 |
| BACK OUTSIDE COVER PAGE | $ 900 | $ 1,650 | $ 3,000 |
| BACK INSIDE COVER PAGE | $ 825 | $ 1,500 | $ 2,750 |
| FULL PAGE | $ 650 | $ 1,250 | $ 2,300 |
| HALF-PAGE | $ 350 | $ 650 | $ 1,200 |

## WEEKLY NEWSLETTER

| 3 MONTHS | 6 MONTHS | 12 MONTHS |
|---|---|---|
| $900 | $1,650 | $3,000 |

### FOR MORE DETAILS PLEASE CONTACT:

**Venkata (Raja) Kasukurthi**
**Secretary**
**((201) 270 - 8648**

**Bharath Maddineni**
**Treasurer**
**(678) 772 - 1681**

**Venkat Koganti**
**Joint Secretary**
**(848) 203 - 2118**

**Sunil Pantra**
**Joint Treasurer**
**(248) 469 - 2349**

**advertisements@tana.org**



ఉత్తర అమెరికా తెలుగు సంఘము

**TELUGU ASSOCIATION OF NORTH AMERICA**

OUR MISSION: TO IDENTIFY AND ADDRESS SOCIAL, CULTURAL AND EDUCATIONAL NEEDS OF NORTH AMERICAN TELUGU COMMUNITY IN PARTICULAR AND TELUGU PEOPLE IN GENERAL

TELUGU ASSOCIATION OF NORTH AMERICA, INC.
TANA
Our Youth are Our Heritage
Est:1977
www.tana.org

# ANNUAL SPONSORSHIP OPPORTUNITIES - 2024

| Sponsor Benefits | PLATINUM SPONSORSHIP $ 25,000 | GOLD SPONSORSHIP $ 15,000 | SILVER SPONSORSHIP $ 10,000 |
|---|---|---|---|
| E-Patrika | 12 Issues - Prime Full Page | 9 Issues - Prime Full Page | 6 Issues - Prime Full Page |
| Weekly Newsletter | 12 Months | 9 Months | 6 Months |
| Website: Logo & Link | YES | YES | YES |
| National Event Opportunity | 3 National Events | 2 National Events | 1 National Events |
| Event Title Sponsor | YES | NO | NO |
| Event Flyers: Logo | 3 National Events | 2 National Events | 1 National Events |
| Sponsor Audio / Video Presentation in Event | 4 min | 3 min | 2 min |
| Event Registrations* | 25 | 15 | 10 |
| Recognition in event Press Release | YES | YES | YES |
| Sponsor Booth* | YES | YES | YES |
| Stand Up Banners at Stage* | YES | YES | YES |
| Stage Recognition | YES | YES | YES |

* Based on event type and availability.

## FOR MORE DETAILS PLEASE CONTACT:

**Venkata (Raja) Kasukurthi**
Secretary
((201) 270 - 8648

**Bharath Maddineni**
Treasurer
(678) 772 - 1681

**Venkat Koganti**
Joint Secretary
(848) 203 - 2118

**Sunil Pantra**
Joint Treasurer
(248) 469 - 2349

advertisements@tana.org



Vegesna Foundation

Research & Rehabilitation Centre for Differently Abled Children

A Non Profit Tax Exempted Charitable Regd. Trust
INDIA & USA

Est. 1977
www.tana.org

TACT

VANGURI FOUNDATION
OF AMERICA

# GRAND MUSICAL CONCERT

## (SONGS OF YOUR CHOICE)

## (SONGS IN TELUGU, HINDI, TAMIL & KANNADA)

FREE ENTRY



Multilingual, Versatile
Playback Singer (India)
"Gaanakala Sarvabhowma"

**SRI RAMAKRISHNA YANAMANDRA**



Singer (India) , MC

**LALITHA RAMAKRISHNA**

**Saturday, July 20, 2024 (5:30 - 8:30 PM)**

**Venue**

**SATYA HALL, SATYANARAYANA TEMPLE**
**11 TRAINING HILL RD, MIDDLETOWN, CT 06457**

**For more details contact**

Rao Yalamanchili - Paatasala Co-Chair (203) 815-7627
Srinivas Yenduri, TANA - Foundation Trustee : (732) 725-9499
Krishna Prasad Sompally, TANA - RR : (617) 515 - 5149
Pavan Gudipudi : (860) 709-0390
Deepthi Vejendla, TACT President: (860) 995-1252

ALL DONATIONS TO VEGESNA FOUNDATION ARE TAX-DEDUCTIBLE IN USA

Vegesna Foundation

Research & Rehabilitation Centre for Differently Abled Children

A Non Profit Tax Exempted Charitable Regd. Trust

INDIA & USA

TANA

VANGURI FOUNDATION OF USA

PRESENT

# MANCHAHE GEET

FREE ENTRY

# GRAND MUSICAL CONCERT

## (SONGS OF YOUR CHOICE)

## (SONGS IN TELUGU, HINDI, TAMIL & KANNADA)



Multilingual, Versatile
Playback Singer (India)
"Gaanakala Sarvabhowma"

**SRI RAMAKRISHNA YANAMANDRA**



Singer (India) , MC

**LALITHA RAMAKRISHNA**

**Sunday, July 21, 2024 (4:30 - 7:30 PM)**

**Venue**

**SRI LAKSHMI TEMPLE, 117 WAVERLY ST, ASHLAND, MA 01721**

HELP US GIVE A HELPING HAND

DONATE GENEROUSLY FOR THE WELFARE OF DIFFERENTLY ABLED CHILDREN

For more details contact

Sam Rao : 781-879-3043

Venkat Vedam -312-217-0146

SasiKanth Vallepalli, TANA - Foundation Chairman

Rao Yalamanchili - Paatasala Co-Chair, (203) 815 - 7627

Srinivas Yenduri, TANA - Foundation Trustee

(732) 725-9499

Krishna Prasad Sompally, TANA - Regional Representative

(617) 515 - 5149

ALL DONATIONS ARE TAX-DEDUCTIBLE IN USA

## తానా ప్రపంచసాహిత్యవేదిక నిర్వహణలో

# 'ప్రతిభామూర్తుల జీవితచరిత్రల' సదస్సు

తానా సాహిత్యవిభాగం 'తానా ప్రపంచ సాహిత్య వేదిక' ఆధ్వర్యంలో ప్రతి నెలా ఆఖరి ఆదివారం నిర్వహిస్తున్న సాహిత్య సమావేశాల పరంపరలో జూన్ 30న జరిగిన 68వ అంతర్జాతీయ అంతర్జాల దృశ్య సమావేశం 'స్ఫూర్తిదాయకమైన ప్రతిభామూర్తుల జీవితచరిత్రలు' సదస్సు ఘనంగా జరిగింది.

తానా ప్రపంచసాహిత్యవేదిక నిర్వాహకులు డా. ప్రసాద్ తోటకూర అతిథులను సాదరంగా ఆహ్వానించి సదస్సును ప్రారంభిస్తూ, ప్రతిభామూర్తుల జీవిత చరిత్రలు చదవడంద్వారా కేవలం వారు గడిపిన జీవితమేగాక ఆనాటి సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ పరిస్థితులు, ప్రజల జీవనవిధానం మొదలైన ఎన్నో విషయాలు తెలుస్తాయి. అంతేగాక ఆయా ప్రముఖులు తమ జీవితాలలో ఎదుర్కొన్న సమస్యలు, ఆటుపోట్లు, వాటిని అధిగమించిన తీరునుండి మనం ఎన్నో విషయాలను నేర్చుకో వచ్చునని అందువల్ల తెలుగు సాహిత్య ప్రక్రియలలో 'జీవితచరిత్రలు' లేదా 'ఆత్మకథలు' చాలా ముఖ్యభూమిక వహిస్తాయన్నారు."

కృష్ణాజిల్లాలోని 'ముదునూరు' అనే గ్రామంలో 'జీవితచరిత్రల గ్రంథాలయం' వ్యవస్థాపకులు డా. నాగులపల్లి భాస్కరరావు ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొని ఈ గ్రంథాలయ స్థాపన వెనుక ఉన్న ఆశయాన్ని, అమలు జరుగుతున్న తీరుతెన్నులను సోదాహరణంగా వివరించారు. విశిష్ట అతిథులుగా పాల్గొన్నవారిలో సుప్రసిద్ధ రచయిత్రి, విద్యావేత్త ఆచార్య డా. సి. మృణాళిని, ప్రముఖ రచయిత బుచ్చిబాబు సతీమణి శివరాజు సుబ్బలక్ష్మి రచించిన 'మా జ్ఞాపకాలు' అనే జీవితచరిత్రను మరియు బీనాదేవి పేరుతో భార్యాభర్తలు కలిసి జంటగా రాసిన అనేక






రచనలను 'బీనాదేవీయం' అనే గ్రంథాలలోని అనేక విషయాలను చాల హృద్యంగా ఆవిష్క రించారు.

ప్రముఖ రచయిత డా. జి.వి. పూర్ణచందు తెలుగువారికి తక్కువగా పరిచయమైన తమిళనాట ఆధ్యాత్మికరంగంలో ఎనలేని కృషిచేసిన తెలుగు ప్రముఖులు 'అప్పయ్య దీక్షితులు' మరియు 'అల్లూరి వేంకటాద్రిస్వామి' జీవితచరిత్రలలోని అనేక విశేషాలను పంచుకున్నారు. ప్రముఖ సాహితీవేత్త, ప్రయోక్త కిరణ్‌ప్రభ ఒక రష్యన్ యువతి కేవలం భారతీయ నృత్యకళలపై ఆసక్తితో తన పేరును 'రాగిణీదేవి'గా మార్చుకుని ఎన్నో సాహసాలతో భారతదేశంలో అడుగు పెట్టి, అనేక సంవత్సరాలు కృషిచేసి నాట్యం నేర్చుకున్నదీ, నాట్యశాస్త్రంపై ఎంతో పరిణితితో కూడిన గ్రంథాలు రాసిందీ, తన కుటుంబం మొత్తం ఏ విధంగా నాట్యకళకు జీవితాంతం అంకితం అయిందీ లాంటి అనేక ఆసక్తికరమైన విషయాలను చాలా ప్రతిభావంతంగా ఆవిష్కరించారు. అలాగే తాను నమ్మిన సిద్ధాంతంకోసం తన తుదిశ్వాస వరకు ఏ విధంగా గిడుగు ఒంటరి పోరాటం చేసినదీ, వ్యావహారిక భాషోద్యమ పితామహుడు 'గిడుగు వేంకట రామమూర్తి'గారి జీవితంలోని అనేక కోణాలను కిరణ్‌ప్రభ విశ్లేషించారు.

సాహిత్యవేదిక సమన్వయకర్త చిగురుమళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ఇలాంటి సాహితీ సమావేశాలు విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నిర్వహించడం చాలా అవసరం అన్నారు.





## నివాళి...

# అక్షరం... అక్షయం... రామోజీరావు సంకల్పం



**రామోజీరావు... ఈనాడు పత్రికను పదివేల అక్షౌహిణుల సైన్యంగా తీర్చిదిద్దారు. అణచివేతకు గురైన అక్షరానికి ధర్మాగ్రహం బోధించారు. పదాల్ని ఫిరంగుల్లా గురిపెట్టారు. బేలచూపుల వాక్యాన్ని బ్రహ్మాస్త్రంలా మలిచారు. శీర్షికలతో శీర్షాసనం వేయించారు. ఇంట్రోలను బంట్రోతులుగా మార్చుకున్నారు. ఫొటోలతో మాట్లాడించారు. క్యాప్షన్లతో కవాతు చేయించారు. కార్టూన్లతో కత్తులు నూరించారు. సంపాదకీయ వ్యాసాల్లో మందుగుండు చొప్పించారు. పరిశోధనాత్మక కథనాలతో కదనకుతూహలం రేకెత్తించారు. అవినీతిపై అవిశ్రాంత యుద్ధం ప్రకటించారు. అక్రమార్కులపై త్రివిక్రమించారు. నియంతల అంతు చూశారు. పాలన వ్యవస్థలు దారితప్పిన ప్రతిసారీ, పట్టుబట్టి ప్రజాస్వామ్యాన్ని గెలిపించారు. పత్రిక అనేది అధికార పక్షమో, ప్రతిపక్షమో కాదనీ.. అక్షరాలా జనపక్షమనీ నిరూపించారు.**

రామోజీరావు కృష్ణా జిల్లా, పెదపారుపూడిలో 1936 నవంబరు 16న పుట్టారు.. తెలుగునాట సామాజిక, రాజకీయ, సాంస్కృతిక చైతన్య వారధులైన విశ్వనాథ సత్యనారాయణ, చండ్ర రాజేశ్వరరావు, ఎన్టీఆర్, అక్కినేని నాగేశ్వరరావు, ఘంటసాల, కొండపల్లి సీతారామయ్య వంటి ఎందరో మహానుభావులకు జన్మనిచ్చిన కృష్ణాజిల్లా కన్న మరో అనర్ఘ రత్నం... రామోజీరావు.

1961 ఆగస్టున 19న తాతినేని రమాదేవిని పెళ్లి చేసుకున్నారు. విజయవాడ పక్కనున్న పెనమలూరు ఆమెది. బెజవాడ కనకదుర్గ గుడి దగ్గర్లోని కన్యకాపరమేశ్వరి మందిరంలో 1961 ఆగస్టు 19న వివాహం జరిగింది.

### ఈనాడు ఆవిర్భావం

విశాఖ నగరాన 1974 ఆగస్టు 10న హంగూ ఆర్భాటాల్లేవు. ప్రచార పటాటోపాల్లేవు. నిజానికి, అవన్నీ రామోజీరావుకు నచ్చని విషయాలు. కొద్దిమంది అతిథుల సమక్షంలో ఓ సాధారణ ఉద్యోగితో మీట నొక్కించారు. క్షణాల్లో ముద్రణ ప్రారంభమైంది. కొమ్మరెమ్మల నుంచి కాగితం పూలు రాలినట్టు.. ప్రింటింగ్ మెషీన్‌లోంచి టపటపా పత్రికలు! అలా, బొద్దం వెలుగులీనిన నేలపై నుంచి సమస్యల చీకట్లపై అక్షర యుద్ధం ఆరంభమైంది. జెండా పండగకు ఐదు రోజుల ముందు ప్రజల అజెండాతో ఓ దినపత్రిక ప్రాణం పోసుకుంది. పత్రికంటే పదివేల సైన్యమే. కానీ, పత్రికను నడపాలంటే.. పది తలలతో ఆలోచించాలి. ఇరవై చేతులతో పనిచేయాలి. వంద సమస్యలను ఎదిరించాలి. అప్పటికే 'అన్నదాత' పేరుతో వ్యవసాయ మాస పత్రికను తీసుకొస్తున్న అనుభవం ఉంది. దినపత్రిక మాత్రం కొత్తే. ఆత్మబలం ఆ పరిమితినీ అధిగమించేలా చేసింది. మరింత స్పష్టత కోసం.. దిగ్గజాలతో చర్చించారు. నిపుణులతో సమాలోచనలు



జరిపారు. తనవంతు కసరత్తు పూర్తిచేశారు. ప్రోత్సహించినవారు ప్రోత్సహించారు. నిరాశపరిచిన వారు నిరాశపరిచారు. ఎవరి మాట ఎలా ఉన్నా.. ఆయన దారి ఆయనదే. ‘పట్టు పట్టరాదు, పట్టి విడువ రాదు’.. అనుకునే గట్టి స్వభావం. కాబట్టే, ఆలోచన ప్రణాళికగా మారడానికీ, ప్రణాళిక ఆచరణగా రూపుదాల్చడానికీ ఎంతో సమయం పట్టలేదు.

‘ఈ..నా..డు’ పేరులోనే మూసను బద్దలు కొట్టారు. చద్ది వార్తల పద్దు రద్దయిపోయిందని ప్రతీకాత్మకంగా ప్రకటించారు.

నిన్న... గతం. రేపు... అస్పష్టం.

నేడే నిజం. ఈనాడే నిజం!

ఎన్ని వ్యాపారాలున్నా- రామోజీరావుకు ఈనాడు తరువాతే అన్నీ. ఈనాడును తన మానసపుత్రికగా చెప్పుకుంటారు. తెల్లవారకముందే దినపత్రిక పాఠకుడి చేతికి చేరాలన్న లక్ష్యంతో ఆయన ప్రారంభించిన ఈనాడు అచిరకాలంలోనే రాష్ట్రంలో నంబర్-1 పత్రికగా ఎదిగింది. జిల్లాకొక అనుబంధ పత్రికని పరిచయం చేసి, ఆదివారం అనుబంధాన్ని పుస్తక రూపంలో తీసుకొచ్చి పత్రికారంగంలో పెను సంచలనం సృష్టించారాయన. మహిళల కోసం ప్రత్యేకంగా ‘వసుంధర’ పేజీని మొదలుపెట్టి సరికొత్త విప్లవానికే కారణమయ్యారు. చదువు, సుఖీభవ, ఈ-నాడు, సిరి, ఈతరం, హాయ్‌బుజ్జీ, మకరందం, ఆహాలతో తెలుగు పాఠకలోకాన్ని ఆశ్చర్యా నందాలలో ఓలలాడించారు.



పత్రికల్లో ఫొటోల విలువను తొలుత గుర్తించింది రామోజీరావే. కృత్రిమత్వపు ఛాయల్లేని ఛాయా చిత్రాలు ఈనాడు పేజీలకు వన్నె తెచ్చాయి. అప్పటివరకూ ఫొటోలు దిష్టిబొమ్మలతో సమానం. నాణ్యత కరవు. స్పష్టత సున్నా. రైటప్ ఉన్నా కూడా గుర్తించడం కష్టమే. ఆ దృశ్య దారిద్ర్యాన్నీ వదిలించారాయన. మరింత నాణ్యత కోసం, ఇంకొంత వేగం కోసం సంస్థ ఆవరణ లోనే బ్లాక్ మేకింగ్ విభాగాన్ని ప్రారంభించారు. మారుతున్న కాలానికి తగినట్టు సిబ్బందికి ఖరీదైన కెమెరాలు సమకూర్చారు. పదునైన ఫొటోలు పతాక శీర్షికల పక్కన సగర్వంగా చోటు సంపాదించుకున్న రోజులున్నాయి. పాలకులకు చెమటలు పట్టించిన సందర్భాలూ, అధికారులకు బీపీలు తెప్పించిన దాఖలాలూ అనేకం. సాక్షాత్తూ అధినేతే.. గుట్టలకొద్దీ ఫొటోల్ని ముందేసుకుని కూర్చుని... ప్రచురణ కోసం ఓ ఆణిముత్యాన్ని ఎంపిక చేసిన ఘట్టాలూ లేక పోలేదు. మరుసటిరోజు రచ్చబండ మీద ఆ చర్చే, అసెంబ్లీలోనూ ఆ రచ్చే! ‘ఆర్ట్ ఆఫ్ చూజింగ్’లో ఆయన తర్వాతే ఎవరైనా.

***మార్గదర్శి...!***

డిగ్రీ పూర్తయ్యాక రామోజీరావు ఢిల్లీలోని ఓ యాడ్ ఏజెన్సీలో ఆర్టిస్టుగా చేరారు. రామోజీరావులోని సహజ ప్రతిభకి ఢిల్లీ జీవితం మెరుగుపెట్టింది. తానెన్నో గొప్ప విజయాలు సాధించవచ్చన్న ఆత్మవిశ్వాసాన్ని సొంతం చేసుకుని... 1962లో మార్గదర్శి చిట్‌ఫండ్స్‌ని స్థాపించారు. ఎన్నో సవాళ్ల మధ్య పట్టుదలగా ముందుకు సాగారు. వసూళ్లు, చెల్లింపులు కచ్చితంగా ఉండేలా చూడటంతో ఖాతాదారుల్లో విశ్వాసం ఏర్పడింది. వాళ్ల



దన్నుతో పలు రాష్ట్రాలకి విస్తరించారు. మార్గదర్శి నేడు సుమారు పది న్నరవేల కోట్ల పైచిలుకు టర్నోవర్‌తో దేశంలోనే నంబర్‌వన్‌గా విరాజిల్లుతోంది.

రామోజీరావు కళాభిమాని, కళాపోషకుడు, సంగీతప్రియుడు. చిన్నప్పటి నుంచీ నాటకాలు, సాంస్కృతిక కార్యక్రమాలంటే చెప్ప లేనంత ఇష్టం. ఆ ఇష్టంతోనే చిన్నతనం నుంచీ వాటిల్లో ఉత్సాహంగా పాల్గొనేవారు. ఆ ఆసక్తితోనే ఓ చిత్రంలో అతిథి పాత్ర లోనూ నటించారు రామోజీరావు. విశ్వేశ్వర రావు 1978లో నిర్మించిన మార్పు చిత్రంలో ఆయన న్యాయమూర్తి పాత్రను పోషించారు. కావడానికి అది చిన్న పాత్ర అయినా సినిమా పోస్టర్లపైన అప్పట్లో రామోజీరావు బొమ్మను ప్రచురించారు!

### ఈటీవీ... మీటీవీ

ఈటీవీ తెలుగు ఛానల్ 1995 ఆగస్టు 27న మొదలైంది. తెలుగుదనం ఉట్టిపడే ధారావాహికలు, కార్యక్రమాలతో ఈటీవీ ఇంటింటి టీవీ అయింది. నిరంతర వార్తా ప్రసారాలే లక్ష్యంగా 2003 డిసెంబర్ 28న ఈటీవీ-2 ప్రారంభమైంది. 2019లో మరో అద్భుత ప్రయోగానికి ఆద్యులయ్యారు రామోజీరావు. అదే ఈటీవీ భారత్. అప్పటిదాకా ఆన్‌లైన్ న్యూస్ ఆప్‌ల గురించే పాఠకులకి తెలుసు. ఒకే సంస్థ నుంచి, ఒకే ఆప్ ద్వారా రెండు మూడు భాషలకి చెందిన వార్తలు రావడమూ నాడు కొత్త కాదు. కానీ పదికిపైగా భాషలకి సంబంధించిన న్యూస్ వీడియోలు ఒకే ఆప్‌లో- అదీ ఎప్పటికప్పుడు లైవ్‌గా రావడం- ఓ అపూర్వ ప్రయోగం. 24 రాష్ట్రాలకి చెందిన పదమూడు భాషల్లో వచ్చే నిరంతర దృశ్య-వార్తా స్రవంతిగా మన్నన లందుకుంది ఈటీవీ భారత్. 2019లో 'ఈటీవీ విన్'తో ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లోకీ అడుగుపెట్టింది రామోజీ గ్రూపు.



### ఉషాకిరణాలు

ఆరోగ్యకరమైన వినోదంతో పాటూ సందేశాత్మక కథాచిత్రాలు నిర్మించాలన్న సంకల్పంతో 'ఉషాకిరణ్ మూవీస్ సంస్థ'ను ఏర్పాటుచేశారు రామోజీరావు. తొలి సినిమా శ్రీవారికి ప్రేమలేఖతో మయూరి ఫిలిం డిస్ట్రిబ్యూటర్స్‌ని ప్రారంభించారు. తెలుగు చిత్రాలనే కాకుండా ఇతర భాషా చిత్రాలను కూడా పంపిణీ చేస్తూ వచ్చారు. సుమారు రెండున్నర దశాబ్దాల కాలంలో వందలమంది కొత్త తారలు, కళాకారులు, సాంకేతిక నిపుణులనూ వెండితెరకు పరిచయం చేశారు. తెలుగు సినిమాలే కాకుండా హిందీ, తమిళ్, కన్నడ, మలయాళీ, బెంగాలీ భాషలలోనూ సినిమాలు నిర్మించారు. ఇలా దాదాపు 80కి పైగా చిత్రాలను నిర్మించారు.

### ఫిలిం సిటీ

రామోజీరావు 1996లో హైదరాబాదు శివార్లలో ఓ సినిమా సామ్రాజ్యాన్ని స్థాపించారు. అదే రామోజీ ఫిల్మ్ సిటీ. చలనచిత్ర నిర్మాణానికి సంబంధించిన సకల సేవలనూ ఒకేచోట అందిస్తూ 1,666 ఎకరాల్లో ఫిలిం సిటీని నిర్మించారు. ప్రపంచంలోనే అతి పెద్ద ఫిలిం సిటీగా గిన్నిస్ రికార్డులో నమోదయింది. ఇక్కడ కేవలం తెలుగు సినిమాలు, సీరియల్సే కాకుండా






ఇతర భాషా చిత్రాలు, విదేశీ చిత్రాలు కూడా నిర్మాణ మవుతున్నాయి. ఇటీవలి భారీ చిత్రాలైన బాహుబలి, ఆర్ఆర్ఆర్ కూడా కొంత మేరకు ఇక్కడ నిర్మిత మయ్యాయి.

**పద్మ విభూషణుడు**

రామోజీరావుకి 2016లో కేంద్ర ప్రభుత్వం అత్యున్నత పౌరపురస్కారాల్లో ఒక్కటైన పద్మ విభూషణ్‌ని అందించింది. అలాగే, ఈనాడు పత్రిక ద్వారా అక్షర సేద్యం చేసినందుకు 1986 నవంబరు 16న 'ఆంధ్ర విశ్వకళాపరిషత్ స్నాతకోత్సవ సభ'లో 'డి.లిట్'ను ప్రదానం చేశారు. 2001లో వివిధ రంగాల్లో సేవలగ్గాను యుధ్‌వీర్ పురస్కారాన్ని పొందారు. 1989లో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, 2015లో శ్రీశ్రీ రవిశంకర్ వర్సిటీ నుంచి డాక్టరేట్‌ను అందు కున్నారు. కానీ ఆయన ఎక్కడా ఎపవిడూ డాక్టర్ రామోజీరావు అని ఇప్పటివరకూ రాసుకోలేదు, తన పత్రికల్లోనూ రాయనివ్వలేదు!

**ఈనాడు జర్నలిజం స్కూలు**

ఈనాడులో ఎప్పటినుంచో పాత్రికేయులకు సమగ్ర శిక్షణ ఇస్తూ వచ్చినా దానికో ప్రత్యేక సంస్థ అంటూ లేదు. దీన్ని గుర్తించిన రామోజీరావు పటిష్ఠమైన శిక్షణ సంస్థగా 1990లో ఈనాడు జర్నలిజం స్కూలుని ప్రారంభించారు. ఈ స్కూలు జన పాత్రికేయాన్ని ప్రబోధిస్తూ వేలమంది సామాన్య యువకులను సుశిక్షిత పాత్రికేయులుగా తీర్చిదిద్దింది. ఈనాడు, ఈటీవీ, ఇంటర్‌నెట్, ఈటీవీ భారత్‌లకి క్రమశిక్షణ కలిగిన అక్షర సైనికులను అందిస్తోంది.

రామోజీరావుకు ఇద్దరు కుమారులు. 1962 మే 21న పెద్ద కుమారుడు కిరణ్ పుట్టారు. ఆయనే ఇప్పుడు ఈనాడు మేనేజింగ్ డైరెక్టర్. సంస్థను మరింత అభివృద్ధి చేయడానికి సృజనాత్మక ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారు. 1966 డిసెంబర్ 23న రెండో కుమారుడు సుమన్ జన్మించారు. ఈటీవీ మేనేజింగ్ డైరెక్టర్‌గా రచన, దర్శకత్వం, నటన, నిర్మాణం... ఇలా అన్ని విభాగాలనూ ఒక్క చేతిమీద నడిపారు. జీవించి ఉంటే తండ్రిని మించిన తనయుడిగా ఎదిగేవారేమో కానీ- దురదృష్టవశాత్తూ 2012లో అనారోగ్యంతో కన్నుమూశారు.

ఆ కర్మయోగి ఎనభై ఎనిమిదేళ్ల పరిపూర్ణ జీవితం.. ఎందరికో అండనిచ్చింది, ఎన్నో కుటుంబా లకు అన్నం పెట్టింది. తెలుగు ప్రజలకు అక్షయమైన అక్షర సంపదను ప్రసాదించింది.

రామోజీరావు శ్రమజీవి. ఖాళీగా ఉండాలను కోరు. అక్షరం అవసరమైన చోట.. తప్పక అవతరిస్తారు. మార్పు అనివార్యమైన నేలపైన... తూర్పు దిక్కున ఉదయిస్తారు.







# కొండపల్లి శేషగిరిరావు

మీరు ఎప్పుడైనా హైదరాబాద్‌లోని అమీర్‌పేట కూడలిలో ఉన్న మైత్రీవనం బిల్డింగ్‌లోకి వెళ్లారా? దాని ప్రవేశద్వారంలోనే రెండు గోడలపైనా రెండు ఫ్రెస్కో చిత్రాలు కన్పిస్తాయి. అంటే రంగు రంగుల ఇసుకతో చేసిన రంగుల చిత్రం! ఒక గోడమీద విశ్వరూప సందర్శనం. మరో గోడమీద తెల్లని గుర్రాన్ని బంధిస్తున్న లవకుశుల చిత్రాలు దర్శనమిస్తాయి. ఆ చిత్రాల్ని చూసి ఆనందించడానికి చిత్రకళామర్మాలు ఏమీ తెలీనక్కరలేదు. విశ్వరూపం చిత్రంలో ఎక్కువగా అన్నీ సరళరేఖలే! బిరుసుగా, గంభీరంగా ఉంటాయి. యుద్ధబీభత్సాన్నీ, తీవ్రతనూ వేడివేడిగా ప్రతిఫలిస్తుంటాయి. అదే సమయంలో తనలోకి తను చూసుకొని, అంతర్ముఖుడై, చేసేవాడు, చేయించేవాడు ఎవరు అనే ప్రశ్న వేసుకొని, కార్యోన్ముఖుడు కావాల్సిన అవసరముందని చాటే గీతా సందేశం. బాహిర్ముఖత్వం, అంతర్ముఖత్వం- వీటి మధ్య సంఘర్షణ! రెండో గోడపై అందమైన అడవి. వృక్షాలు, లతలు, జింకలు వీటి మధ్య ఇద్దరు చూడచక్కని బాలురు. అందమైన అశ్వాన్ని ఒడుపుగా బంధిస్తున్న దృశ్యం. ఎంతో ఆహ్లాదకరంగా ఉండే చిత్రం. చిత్రమంతా వక్రరేఖల ఒయ్యారాలే! ప్రకృతి ఇంత అందంగా ఉంటుందా అన్పించేత సొగసైన ముచ్చటైన చిత్రం!

ఈ రెండు ఫ్రెస్కో చిత్రాల్ని చిత్రించినవారు ఆచార్య కొండపల్లి శేషగిరిరావు. శేషగిరిరావు 1924 జనవరిలో వరంగల్ జిల్లాలోని పెనుగొండ గ్రామంలో జన్మించారు. చిన్నప్పుడు ఆర్టిస్టులు గీసిన చిత్రాల్ని గీస్తూ, గీస్తూ చిత్రలేఖనంలో ఓనమాలు స్వంతంగా నేర్చుకొన్నారు. హైస్కూల్లో చేరాక ఆయన అదృష్టం పండింది. డ్రాయింగ్ మాస్టారుగా దీన్‌దయాళ్ నాయుడుగారు ఆ ఊరొచ్చారు. నాయుడుగారు వీలుచిక్కితే చాలు పాకాల అడవులకెళ్లి అడవి దృశ్యాల్నీ, జంతువుల బొమ్మల్నీ గీసుకొచ్చేవారు. ఆయన దగ్గర మరింత బాగా చిత్రలేఖనం నేర్చి, హైదరాబాద్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో చేరాలని శేషగిరిరావు హైదరాబాద్ వచ్చారు.

హైదరాబాద్ ఆర్ట్ స్కూల్లో చిత్రకళాభ్యాసం పూర్తయిన తరువాత శాంతి నికేతన్‌లో చేరి నందలాల్ బోసుకు శిష్యుడై చిత్రకళా మర్మాల్ని తెలుసుకొన్నారు

శేషగిరిరావు. సృష్టిలోని లయను పట్టుకోగలిగారు. ఆనందానికి కారణం లయే. లయ లేనిదే సృష్టి లేదు. లయ చిత్రకళలో రేఖల ద్వారా వ్యక్తమౌతుంది. సరళ రేఖ స్థితి ప్రధానం. వక్రరేఖ గతి ప్రధానం. గంభీరతకు చిహ్నం సరళరేఖ. ఒయ్యారానికి, ఆవేశానికీ వక్రరేఖ.

"ద్వంద్వాలు కలిస్తేనే సృష్టి సంపూర్ణమవుతుంది. రెండూ ఒకటేనని తెలుసుకోవటమే జ్ఞానం. ఈ స్థితిలో స్థిరత్వం కలిగిననాడే కళకు సార్థకత ప్రాప్తిస్తుంది," అంటూ తన చిత్రరచనా పద్ధతిని వివరిస్తారు శేషగిరిరావు.

సాధారణంగా శేషగిరిరావును సాంప్రదాయిక చిత్ర కళాకారుడు అంటారు. ఎందుకంటే ఆయన ఆధ్యాత్మికవాది. రామాయణ ఘట్టాలకు ఆయన వేసిన చిత్రాలు అపూర్వమైనవి. అలాగే భారతంలోని కొన్ని కథలకు- ముఖ్యంగా శకుంతలోపాఖ్యానానికి ఆయన గీసిన మూర్తులు సజీవంగా మన కళ్ల ముందు నిలుస్తాయి.

శాంతినికేతన్‌లోనే శేషగిరిరావు చైనా, జపాన్ చిత్ర కళారీతుల్ని కూడా అధ్యయనం చేశారు. తాను గీయదలచుకొన్న ప్రతి అంశమూ, ప్రతి సన్నివేశమూ సందర్భోచితంగానూ, ఖచ్చితంగానూ ఉండాలనే దీక్ష ఆయనది. అశోకవనంలో సీత బొమ్మ గీసేటప్పుడు శేషగిరిరావుకి అశోకవృక్షం ఎలా ఉంటుందో




*తెలుగువారు గర్వించదగ్గ అపూర్వ చిత్రకారుడు కొండపల్లి శేషగిరిరావు. రామాయణ ఘట్టాలకు, అలాగే కాళిదాసు శాకుంతలంలోని ఘట్టాలను చిత్రించిన తీరు ఆశ్చర్యం గొలుపుతుంది. వీరు చిత్రించిన అశోకవనంలో సీత చిత్రాన్ని చూస్తే కళాకారుడిగా ఆయన విశ్వరూపం కనబడుతుంది. అంతటి గొప్ప చిత్రకారుడి శత జయంతి సందర్భంగా వారి అబ్బాయి కొండపల్లి వేణుగోపాలరావు, కోడలు నిహారిణి పూనికతో ఆనంద్ గడప, నిర్మల బిలుక సంపాదకత్వంలో వెలువడిన అపూర్వ చిత్రకళా గ్రంథం ఇది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో ఎ4 సైజులో సుమారు 200 పేజీలతో, వారి అద్భుతమైన చిత్రాలతో వెలువడిన ఈ గ్రంథం కొండపల్లి శేషగిరిరావు ప్రతిభకు తార్కాణంగా నిలుస్తుంది.*







తెలియదు. ఎవర్నో అడిగితే బెంగుళూరు లాల్‌బాగ్‌లో ఓ అశోకవృక్షముందని చెప్పారు. వెంటనే బెంగుళూరు వెళ్లారు. ఆ చెట్టుని పలురకాలుగా స్కెచెస్ గీసుకొన్నారు. ఆ తర్వాతే అశోకవనంలో సీత పెయిటింగ్ చిత్రించారు.

శేషగిరిరావు దేశవ్యాప్తంగా ఎన్నో ప్రదర్శనల్ని ఇచ్చారు. 1950లో తాను చదువుకొన్న హైదరాబాద్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో అధ్యాపకుడిగా చేరారు. 1988లో భారత ప్రభుత్వం ఆయనకు ప్రొఫెసర్ ఎమిరేటస్ హోదాని ఇచ్చింది. 1996లో తెలుగు విశ్వవిద్యాలయం డాక్టరేట్, 2003లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హంస అవార్డు ఇచ్చి సత్కరించాయి. తెలుగు సాహిత్యంలో విశ్వనాథ ఎలాగో, చిత్రకళారంగంలో కొండపల్లి శేషగిరిరావు అలాంటివారు. శేషగిరిరావు తాను గీస్తున్న చిత్రం నుండి వేరైనవాడు కాదు. చిత్రాన్ని రచించడమంటే ఆయనకు తపస్సుతో సమానం.

శేషగిరిరావు 26 జులై 2012న మరణించారు. ఇది వారి శతజయంతి సంవత్సరం.

*తెలుగునాడి, ఆగస్ట్ 2006*



సీరియల్-8



# వెన్నెల్లో ఆడపిల్ల

## యండమూరి వీరేంద్రనాథ్



"కంగ్రాచ్యులేషన్స్!" అటునుంచి కోమల స్వరం వినిపించింది.

"నేనే మీకు చెప్పాలి" ఉద్వేగం నిండిన కంఠంతో అన్నాడు రేవంత్. "గెలిచిన ఆ క్షణం మిమ్మల్ని చూడాలని ఎంత అనిపించిందో తెలుసా? అందరూ నన్ను అభినందిస్తూంటే, ఈ అభినందనలన్నీ నాకు కాదు, మీకు చెందాలి అని అనుకున్నాను."

"మీరు అనవసరంగా నన్ను మునగచెట్టు ఎక్కిస్తున్నారు."

"లేదండీ. ఆ క్షణం నేను ఎంత సెల్ఫ్‌పిటీతో కృంగిపోయానో చెప్పలేను. మీరుగాని ధైర్యం చెప్పకపోయి ఉంటే అంతటితో నా కెరీర్ అంతం అయిపోయేది. ఎక్కడో చదివాను, మొగవాడి ప్రతి విజయం వెనుకా ఒక స్త్రీ ఉంటుందని. సానుభూతి చెప్పటంకన్నా మానసిక స్థైర్యం ఇవ్వటం గొప్పది. మీరా రెండో పని చేసేరు. కృతజ్ఞతలు ఎలా చెప్పుకోవాలో తెలియటం లేదు."

"స్నేహితుల మధ్య కృతజ్ఞతలు ఏమిటి?" అన్నదామె. "మీలో ఆ శక్తి ఉందని నాకు తెలుసు. అందుకే చేతనైనంత ప్రోత్సాహం ఇచ్చాను. మీరు గెలిచారు, అంతే! పోతే ఈ ప్రపంచంలో నేను అధికంగా అసహ్యించుకొనేది సెల్ఫ్‌పిటీని."

"కానీ మీరేగానీ ఈసాయం చెయ్యకపోయి ఉంటే..." అంటూ అతనేదో అనబోతూంటే మధ్యలో ఆపుచేసి, "మనమిక ఈ యూ స్క్రాచ్ మై బ్యాక్, ఐ స్క్రాచ్ యువర్ బ్యాక్ మానేద్దామా," అంది.

రేవంత్ సిగ్గుపడి, "ఐ యామ్ సారీ," అన్నాడు.

ఆమె మాట మారుస్తూ, "అన్నట్టూ నన్ను కనుక్కునే విషయం ఏం చేసేరు? మనం పెట్టుకున్న గడువు ఇంక చాలా కొద్దిరోజులే ఉంది. మిమ్మల్ని చూస్తుంటే అసలు ఏ ప్రయత్నమూ చేస్తున్నట్టు లేదు."

"లేదని మీరెందుకు అనుకున్నారు? ఐ ఏట్ నథింగ్ ఫర్ సిక్స్ గంటలకి అర్థం ఏమిటా అని ఆలోచిస్తూనే ఉన్నాను."

*జరిగిన కథ*

వెన్నెల్లో ఆడపిల్ల రేవంత్‌కు ఉత్తరం రాస్తుంది. ఆ ఉత్తరంలోని వ్రాతనుబట్టి గ్రాఫాలజీ ద్వారా ఆమెను అంచనా వేయాలను కొంటాడు రేవంత్. చదరంగం పోటీలో పాల్గొన డానికి వచ్చిన రేవంత్‌కి ప్రభాకర్ నిమ్మకాయ ఇస్తాడు. ప్రభాకర్‌తో తలపడిన రేవంత్ గెలుపుకు అడుగు దూరంలో ఉండగా అతను హిప్నటైజ్ చేస్తున్నాడని ఆరోపిస్తాడు ప్రభాకర్. రేవంత్ జేబులో సీతారాం ఇచ్చిన నిమ్మకాయ దొరుకుతుంది. వార్తాపత్రికల్లో పతాకశీర్షికలతో రేవంత్ హిప్నాటిజమ్ గురించిన వార్తలు వస్తాయి. రేవంత్ తన ఉద్యోగానికి రాజీనామా చేయాలనుకుంటాడు. రేవంత్‌ని బ్లయిండ్ ఫోల్డు ఆడమని సలహా ఇస్తుంది వెన్నెల్లో ఆడపిల్ల. బ్లయిండ్ ఫోల్డులో రేవంత్ నెగ్గుతాడు.

"ఈ లోపులో పుణ్యకాలం కాస్త గడిచి పోతుంది."

"పుణ్యకాలం అంటే జ్ఞాపకం వచ్చింది నేను మిమ్మల్ని కనుక్కోవడానికి ఇచ్చిన గడువులో, ఆ చివరి ఆ రెండు రోజులూ నేను ఢిల్లీలో ఉంటాను."

"అంటే... ఇంకో రెండ్రోజులు ఎక్కువ టైమ్ ఇమ్మంటారా!"

"అబ్బెబ్బే! నా ఉద్దేశ్యం అదికాదు. జస్ట్ చెబుతున్నానంతే. అయినా అన్ని రోజులు ఎందుకు? ఒకటి రెండు రోజుల్లోనే కనుక్కుంటాను. మీ టెలిఫోన్‌లో మొదటి రెండు నంబర్లూ తెలిసిపోయినయ్," అంటూ చెప్పాడు.

"ఒకటి, ఎనిమిది."

"కరెక్టే, ఎలా కనుక్కున్నారు?" నిజంగా అన్నదో, వెక్కిరింతగా అన్నదో తెలియదు.

"మొదటి దానికన్నా రెండోది ఎనిమిది రెట్లు అన్నారుగా."

"గుడ్," అందామె. "మూడో అంకె, నాలుగో అంకె చెప్పనా?"

"చెప్పండి," అన్నాడు ఉత్సాహంగా ముందుకు వంగుతూ.

"మూడు నాలుగు అంకెలకన్నా, వాటిని తిరగేస్తే వచ్చే అంకె పది రెట్లు ఎక్కువ."

"ఊఁ. ఇంకా."

"ఇంకా ఏమిటి?"

"ఇంకేమీలేదా," నీరుకారి పోతూ అడిగాడు.

"సాధారణమైన ఐ.క్యూ. ఉన్నవాడికి మూడో అంకె కనుక్కోవటానికి ఈ మాత్రం హింట్ చాలు."

రేవంత్ చప్పున ఏదో అర్థమైనట్టు, "మూడో అంకె ఏమిటో తెలిసింది," అని అరిచాడు.

"ఏమిటి?"

"సున్నా...!"

"ఎలా?"

"ఎందుకంటే, 01 కి 10 పది రెట్లు ఎక్కువ. 04కి 40 పది రెట్లు ఎక్కువ. నాలుగో అంకె తెలీదు కానీ మూడోది మాత్రం కంపల్సరీ గా '0' యే," అన్నాడు.

"ఇక ఆ చీకట్లో ముద్దు కథ కూడా చెప్పేశానంటే ఫోను నెంబర్ అంతా తెలిసిపోతుంది. మీరు కనుక్కున్న మొదటి రెండు నెంబర్లూ కరెక్టయిన పక్షంలో..." అంది.

"ప్లీజ్ ప్లీజ్. ఆ కథ ఏమిటో చెప్పరూ," అభ్యర్థిస్తున్నట్టు అన్నాడు.

"ఒక ఊళ్లో అమ్మాయిలు కాలేజి-డే అయిపోయాక పెద్ద హాల్లో పార్టీ చేసుకుంటున్నారు. వాళ్లలో కేవలం ఒకే ఒక అబ్బాయి కూడ ఉన్నాడు. పాల బుగ్గలతో అచ్చు రేవంత్‌లా అమాయకంగా."

రేవంత్ పళ్లు బిగించి, "ముందు లెక్క చెప్పండి," అన్నాడు.

ఆమె నవ్వి, "ఏముందీ. ఇంతలో కరెంట్ పోయింది. ఆ చీకట్లో ప్రతి చిన్నారికీ రేవంత్‌ని ముద్దు పెట్టుకోవాలనిపించింది," అంది.

"వాళ్లు ఆడాళ్లు కాదు. ప్రేమ పిశాచులు."

"ఆఁ. అలాగే అనుకోండి. కానీ చీకట్లో ఆ రేవంత్ ఎక్కడున్నాడో కనబడడు కదా. అందుకని వాళ్లలో లీడర్‌లాంటి అమ్మాయి, స్నేహితురాళ్లతో, 'ఒసేవ్, మీరందరూ ఎక్కడి వాళ్లు అక్కడే కదలకుండా నిలబడండి. అందర్నీ వరసగా ముద్దు పెట్టుకుని నేను హాలు బైటకి వెళ్లిపోతాను అని అందట.'

"అర్థం కాలేదు."

"పదిమంది దోషులు తప్పించుకున్నా పరవాలేదు కానీ ఒక్క నిర్దోషికి శిక్ష పడకూడదు,' అని ఒక సామెత ఉంది. అలా 'ఒక కుర్రాడిని ముద్దు పెట్టుకోవటం కోసం పదిమంది అమ్మాయిల్ని పెట్టుకున్నా పర్వాలేదు,' అన్నమాట."

"మైగాడ్! ఒక్కముద్దు పెట్టుకోవటం కోసం అంత స్వజాతి చర్యకి పాలు పడిందా?"

"మరేం చేస్తుంది పాపం. రేవంత్ బుగ్గలకి అంత డిమాండ్ ఉన్నదన్నమాట."

రేవంత్ కోపంగా ఫోన్ పెట్టెయ్యబోతూ లెక్క ఇంటరెస్టింగ్‌గా ఉండటంతో, "తరువాత ఏమైంది?" అని అడిగాడు.

"ఆ అమ్మాయిని చూసి ఇంకో ఆఖరి అమ్మాయి కూడా అలాగే చేసి బైటకొచ్చిందట. ఎర్రగా కంది పోయిన బుగ్గలతో రేవంత్ ఒక్కడే మిగిలిపోయాడు పాపం."

"సానుభూతి అక్కర్లేదు. ఆ తరువాత?"



"బైట ఫ్యూజ్ వేస్తున్న ఎలక్ట్రీషియన్‌కి గదిలోంచి 1081 సార్లు 'మ్చ్' అని ముద్దు చప్పుడు వినిపించింది. ఆ గదిలో ఎంతమంది అమ్మాయిలున్నారో అవే నా టెలిఫోన్ చివరి రెండు అంకెలు."

చాలా సులభమైన లెఖ్ఖ. (N+1) x (N/2). రేవంత్ చెయ్యబోతూ ఉంటే, మేనేజింగ్ డైరెక్టర్ వద్ద నుంచి పిలుపు వచ్చింది. 'మళ్లీ ఏమైందిరా భగవంతుడా,' అనుకుంటూ వెళ్లాడు.

"రా కూర్చో!" అన్నాడు ఆయన. రేవంత్ ఎదుటి కుర్చీలో కూర్చున్నాడు.

"కంగ్రాచ్యులేషన్స్! పేపర్లు నీ గురించి బాగా వ్రాసినయ్. అభినందించవలసిన విషయం."

రేవంత్ ఆశ్చర్యపోయాడు. నాల్రోజుల క్రితం తనని రాజీనామా చెయ్యమన్నది ఈయనేనా? ఏమీ జరగనట్టు ఎంత మామూలుగా మాట్లాడుతున్నాడు. ఇందుకేనేమో వీళ్లు ఇంత పెద్ద వ్యాపారస్తులైంది.

"ఇద్దరు ముగ్గురు బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ఫోన్ చేసి నీ గురించి వాకబు చేసేరోయ్. వచ్చే మీటింగులో నీ ప్రతిభకు గుర్తింపుగా రెండు ఇంక్రిమెంట్లు ప్రపోజ్ చేస్తున్నాను."

"థాంక్యూ సర్!" అంటూ లేచి ఆయనతో కరచాలనం చేసి వచ్చేశాడు. నవ్వొచ్చింది.

విజయమా విజయమా! వెళుతూ వెళుతూ అధః పాతాళానికి తోస్తావు. వస్తూ వస్తూ అందలాన్ని ఎక్కిస్తావు. నీకు ఇది న్యాయమా?

అతడు తన ఛాంబర్‌లోకి వచ్చేసరికి అక్కడ జేమ్స్ కూర్చొని ఉన్నాడు. ఎప్పుడూ నవ్వుతూ ఈజీ టైప్‌లో ఉండే అతడి మొహం తీక్షణంగా, ఉద్వేగంతో, ఉద్విగ్నతతో ఉంది.

"ఏమిటి విశేషం?" అన్నాడు పలకరింపుగా.

జేమ్స్ చేతి గోళ్లవైపు చూసుకుంటూ, "నీకో విషయం చెప్పాలి రేవంత్," అన్నాడు.

అతడి కంఠంలో కనబడిన సీరియస్‌నెస్‌కి రేవంత్ ఒకింత విస్మయం చెంది, "ఏమిటి? ఏదైనా గొడవ జరిగిందా" అని అడిగాడు.

"మొగవాడి జీవితంలో పెళ్లి అనేది పెద్ద గొడవ అనుకుంటే, అదే జరగబోతోంది."

అర్థంకాక, "అంటే?" అన్నాడు రేవంత్.

"మనం ఒక ఎక్ఛేంజ్ అమ్మాయితో మాట్లాడేం జ్ఞాపకం ఉందా? ఆ అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని అనుకుంటున్నాను."

"ఆ అమ్మాయిని నువ్వెపుడు కలుసుకున్నావు?"

"మొన్న రాత్రి."

"మొన్న రాత్రి కలుసుకొని ఈరోజు పెళ్లి చేసుకోవాలనుకుంటున్నావా?"

"ఏం? కలుసుకున్న రెండు మూడు సంవత్సరాల వరకూ పెళ్లి చేసుకోకూడదంటావా?"

"అంటే నా ఉద్దేశ్యం..."

"మీరందరూ పెళ్లికి ఎందుకంత ప్రాముఖ్యత ఇస్తారో నాకర్థంకాదు. ఆకర్షణ, అర్థం చేసుకోవటం, ఆహాహా చందమామా- అంతా ట్రాష్ అని నా ఉద్దేశ్యం. పెళ్లి అనేది జీవితంలో ఒక ఫేజ్ మాత్రమే. అదొకటే కాదు జీవితం. నేనేదైనా నమ్మాను అంటే దాన్ని అనుసరిస్తా అని నీకు తెలుసుగా."

"ఇంతగా నిన్ను ఆ అమ్మాయి ఎలా ఇంప్రెస్ చేయగలిగింది?"

"ఇందులో ఇంప్రెస్ అన్న ప్రసక్తే లేదు. ఏదో ఒకటి జరగాలి కాబట్టి అది అలా క్యాజువల్‌గా జరిగిపోయింది. అంతే."

"అదే, ఎలా జరిగింది అని," రేవంత్ అడిగాడు.

అతడు చెప్పటం ప్రారంభించాడు.

## 11

విశాలమైన వీధులగుండా అతడు మోటార్ సైకిల్ని పోనిస్తున్నాడు. మలుపుల్లో అది వంగుతూంటే ఆమెకి భయం వేసింది. పట్టుకోవటానికి ఏమీలేదు. అతడి నడుము తప్ప.

మోటారు సైకిల్ ఒక పెద్ద హోటల్ ముందు ఆగింది. ఇద్దరూ కాబిన్‌లో కూర్చున్నారు.

అతడేమైనా మాట్లాడతాడేమో అని చూసింది కానీ, అతడు ఆమెతో మాట్లాడటం కన్నా, మోటారు

బైక్ తాళం చెవులతో టేబిల్ మీద తాళం వేస్తూ, మ్యూజిక్ వినటంలోనే ఎక్కువ లీనమయ్యాడు.

భోజనం పూర్తయ్యేసరికి పదయింది. "మీరుండేది ఎక్కడ?" బిల్ పే చేస్తూ అడిగాడు. ఆమె చెప్పింది. బైక్ అటు నడుపుతూ, మెయిన్‌రోడ్ ప్రక్క సందులో కనబడుతూన్న మేడ మీద గది చూపిస్తూ, "అక్కడే నేనుండేది," అని, అంతలో ఏదో ఆలోచన స్ఫురించిన వాడిలా, "పదండి. నా గది చూద్దురుగాని," అంటూ మోటారు సైకిల్ సర్రున ప్రక్కకి కోశాడు.

"ఇంతరాత్రి ఎందుకు," అనబోయింది కానీ, "మా ఇంటి ఓనరు ఏమీ అనుకోడులెండి," అంటూ ఇంటి ముందు బ్రేక్ వేసి లోపలికి దారితీశాడు. సమస్యను తన వైపు నుంచే ఆలోచిస్తున్న అతడిని చూస్తే ఆమెకి ఆశ్చర్యం వేస్తోంది. అతడు తాళం తీశాక ఇద్దరూ లోపలికి ప్రవేశించాడు. రూమ్ ఒక మ్యూజియంలా ఉంది. ఇంకు బాటిల్సూ, బ్రష్లూ, డ్రాయింగ్ బోర్డు మీద దొర్లుతున్నాయి. కిటికీ తలుపులు సరిగ్గా వెయ్యలేదనుకుంటా. డ్రాయింగ్ పేపర్లు ఎగిరి నేల మీద పడ్డాయి. మంచం కొత్తదే అయినా నవారు బిగించకపోవటం వల్ల కుక్కిమంచంలా ఉంది. తల దిండ్లు ఉండవలసిన చోట నాలుగైదు బౌండు పుస్తకాలున్నాయి. గోడకి స్పానిష్ గిటారు వేలాడుతూ ఉంది.

"కాఫీ తాగుతారా?"

"ఇప్పుడేగా భోం చేసేం."

"పర్లేదు," అంటూ ఫ్లాస్క్‌లో చల్లారిపోయిన కాఫీని స్టౌ మీద పెట్టాడు. ఆమె దృష్టి పెద్ద ఫోటో మీద పడింది. దాని మీద వ్రాసి ఉన్న పేరు చదువుతూ, "ఎవరీ గ్రెగరీ పెక్," అని అడిగింది.

"అమెరికాలో పెద్ద క్రికెట్ ప్లేయరు," అన్నాడు.

"స్టాలిన్?"

"పాకిస్తాన్ కవి."

పుస్తకాల రాక్‌లోంచి ఆమె ఒక పుస్తకాన్ని బైటకి తీసింది. 'గీతల్లో భావాలు' అన్న ఇంగ్లీషు పుస్తకం అది. "మీరు బొమ్మలు కూడా వేస్తారా?" అని అడిగింది.

"వేస్తాను."

"పత్రికల్లో వస్తూ ఉంటాయా?"

"కార్టూన్లు."

ఆమె చప్పున తలెత్తి, "జేమ్స్ అన్న పేరు మీద వేసేది మీరేనా?" అంది.

"నేనే."

ఆమె సంభ్రమంగా చూసింది. జోకు వ్రాయకుండా బొమ్మతోనే నవ్వు తెప్పించే ఆంధ్రదేశపు కొద్ది మంది కార్టూనిస్టులలో అతడొకడు. అప్పడాల కర్ర - గయ్యాలి భార్య జోకులకు దూరంగా ఉంటాడు.

"ఇంతసేపూ మీరే అని చెప్పలేదేం?"

"ఆ సందర్భం రాలేదుగా."

సులోచనకి తన ఎక్సేంజిలో పనిచేసే ఆపరేటరు గుర్తొచ్చాడు. స్వీయ విరచిత వచన గేయం పడిన లిఖిత పత్రికని పట్టుకొని, ప్రతి సంభాషణనీ ఆ పత్రిక మీదకే తీసుకొచ్చి తన రచనని చూపించేవాడు.

"భలే నవ్విస్తాయ్? మీరంత బాగా బొమ్మలు ఎలా వేస్తారు?"

"నిరంతర ఘర్షణ నుంచి బైటపడడానికి వేస్తా. ఇక ఎలా వేస్తా అంటే... ఎలా వేస్తాం? డ్రాయింగ్ పేపరు మీద ఇండియన్ ఇంక్‌తో," అన్నాడు నవ్వి.

ఆమె ఇంకా ఆ సంభ్రమం నుంచి తేరుకోలేదు.

కప్పుల్ని వెతకటానికి అయిదు నిముషాలు పట్టింది. న్యూస్ పేపర్ల వెనుక దొరికాయి. ఈ లోపులో కాఫీ చల్లారిపోయింది. దాన్నే తాగారు.

పదిన్నర అయినట్టు దూరంగా ఎక్కడో గడియారం గంట కొట్టింది. అతడు పక్క మీదున్న పుస్తకాలు అల్మైరాలో సర్దేడు. పెద్ద లైటు ఆర్పి, చిన్న లైటు వేశాడు. ఒక్కసారిగా గదిలో వ్యాపించిన చీకటికి ఆమె బెదిరింది.

"మీ ఎక్ఛేంజి గురించి చెప్పండి."

తన సబ్జెక్టు గురించి అతడు అడిగేసరికి ఆమె కొద్దిగా ఉత్సాహపడి, "ఏం చెప్పను," అంది.

"ఎక్సేంజిలో తెలిసినవాళ్లు ఉంటే ఫ్రీగా ఎన్నైనా ఫోన్లు చేసుకోవచ్చునట, నిజమేనా?"

"ఎవరన్నారు? శుద్ధ అబద్ధం," కోపంతో అంది ఆమె.

“అలాగే అంటార్లెండి. నిజం చెప్పండి.”

ఆమె ఆలోచించి, “నాకు తెలిసినంతవరకూ అలా చెయ్యలేం. పోతే అంబులెన్స్‌లో తెలిసిన వాళ్లెవ రయినా ఉంటే వాళ్లు లోకల్ కాల్స్ ఫ్రీగా ఇవ్వచ్చును కుంటా.”

గది నీలిరంగులో కనిపిస్తుంది. కిటికీలోంచి వెన్నెల పడుతోంది.

“మీరు ఆ ‘లైను’ మీదకి ఎప్పుడొస్తారు?”

ఆమె నవ్వి, “ఏం? మీరు చెయ్యాల్సిన కాల్స్ ఉన్నాయా,” అంది.

“ఈవిధంగానైనా బిల్లు తగ్గిద్దామనుకుంటు న్నాను,” అంటూ ఏదో జ్ఞాపకం వచ్చినవాడిలా, “లైన్ మెన్‌ని పట్టుకుంటే ఒకరి బిల్లులు వేరొకరికి పడే ఏర్పాట్లు చేస్తాడట. నిజమేనా?” అని అడిగాడు.

“అంటారు కానీ అబద్ధం. మాకొచ్చేవి తొంభై శాతం తప్పుడు కంప్లయింట్లే. యస్.టి.డి. వచ్చాక ఇళ్లల్లో ఆడవాళ్లు బంధువులతో గంటల తరబడి మాట్లాడి, తరువాత ఆ విషయమే మరిచిపోతారు. బిల్లు వచ్చాక మొగవాళ్లు ఎగిరిపడుతోంటే తేలు కుట్టిన దొంగల్లా ఉండిపోతారు,” నవ్వింది.

“అంటే రాంగ్ బిల్లింగ్ అన్నదే జరగదా.”

“ఆ మాత్రం తప్పులు ఏ డిపార్ట్‌మెంట్‌లోనైనా జరుగుతాయి జేమ్స్.”

క్రింద ఇంటివాళ్లు లైట్లు ఆర్పేశారు. వరండాలో చీకటి పల్చగా పరుచుకుంది. అతడు కిటికీ తలుపు తెరిచాడు. చల్లటిగాలి రివ్వున వీస్తోంది.

“మనం ఎవర్నైనా ఏడిపించాలంటే, వాళ్లకి ఫోన్ చేసి తిరిగి మన రిసీవర్ సరిగ్గా పెట్టకపోతే వాళ్ల ఫోన్ పనిచెయ్యదట, నిజమేనా?”

ఆమె కళ్లు పెద్దవి చేసింది. “ఇన్ని దారుణమైన ఆలోచనలు మీకెందుకు కలుగుతున్నాయి?”

“నిజమో కాదో చెప్పకూడదా ఏమిటి?”

“నిజమే.”

ఊరు నిద్రకుపక్రమించటానికి ఆయత్తమవు తుంది. తూర్పు దిక్కుగా వెళ్తున్న పక్షి కిటికీలోంచి తెల్లగా కనబడుతుంది.

“ఏం మాట్లాడినా ఫోనే కాబట్టి ఆపరేటర్లు అంతగా పట్టించుకోరని అంటారు, నిజమేనా?” అన్నాడు

“అవతలివాళ్లు అవసరమైన దానికన్నా ఎక్కువ గా మాట్లాడితే ‘కీ’ ఆఫ్ చేస్తాం. అది తెలియక మేము ఇంకా వింటున్నామనుకొని వాళ్లు మాట్లాడటం కొన సాగిస్తారు. అలాగే తిట్లు కూడా...” నవ్వింది.




“ప్రొద్దుట్నుంచీ సాయంత్రం వరకూ డయల్ అలా తిప్పుతూనే ఉంటారు కదా. వేళ్లు నొప్పెట్టవూ.”

“పియానో బటన్ సిస్టమ్ వస్తే బావుణ్ను అని మేమూ అనుకుంటూ ఉంటాం.”

టేప్ రికార్డర్ ఆన్ చేశాడు. పాట మంద్రస్థాయిలో వస్తుంది. ఆమె వాచీ చూసుకుంది. అతడు తన గదిలో ఫోన్ చూపిస్తూ, “ఇది నాకెలా వచ్చిందో తెలుసా?” అని అడిగాడు.

“ఎలా వచ్చింది?”

"ఇంట్లో ఎవరికైనా సీరియస్‌గా ఉంటే టెంపరరీ ఫోన్ ఇస్తారు కదా. మొదటి ఆర్నెల్లూ మా నాన్నకి హార్ట్ కంప్లయింట్. తరువాత ఆర్నెల్లూ మా అమ్మకి హృద్రోగం."

ఉన్న ఒక్క గదిని చూస్తూ, "వాళ్లేరి?" అని అడిగింది.

"నా చిన్నప్పుడే పోయారు," అంటూ నవ్వేడు.

ఆమె కూడా నవ్వింది. అతడు చాలా క్యాజువల్‌గా దగ్గరికొచ్చి ఆమెని చేతుల మధ్య తీసుకున్నాడు. ఇదెంతో మామూలుగా నిశ్శబ్దంగా జరిగిపోయింది. ఒక్క క్షణం ఆమెకేమీ అర్థం కాలేదు. అతడి మొహం దగ్గరకొస్తోంది. అర్థమయ్యేసరికి. ఒక్కసారిగా విదిలించుకొని, అడుగు వెనక్కి వేసి, తడి ఆరిన గొంతుతో, "ఏ... ఏమిటది?" అని హిస్టీరిక్‌గా అరిచింది.

ఆమె నుంచి ఈ రియాక్షన్ ఆశించనట్టు అతడో క్షణం విస్తుబోయి, "మీ కిష్టంలేదా?" అన్నాడు. అతడి కంఠంలో ఆశ్చర్యం కొట్టొచ్చినట్టు కనబడుతోంది.

"ఏమనుకుంటున్నారు మీరు నా గురించి," రోషమూ, ఉక్రోషమూ, నిస్సహాయతా, ఏడుపూ కలిసిన కంఠంతో అడిగింది.

అతడూ అంతే నిజాయితీగా, "ఏమీ అనుకోవటం లేదు," అన్నాడు.

ఈ జవాబుకి ఆమె తెల్లబోయి తలెత్తి చూసింది.

అతను అన్నాడు, "మీరూ నేనూ ఇద్దరమే గదిలో ఉన్నాం. టైమ్ రాత్రి పది. మీకు ఇష్టమేమో అనుకున్నాను," అన్నాడు.

"ఒక అమాయకమైన ఆడపిల్ల మిమ్మల్ని నమ్మి గదికి వస్తే ఇక ఆ ఉద్దేశ్యం తప్ప మరేమీ కలగదా మీకు?" కోపంగా అంది.

"మరీ స్త్రీత్వాన్ని నటించకండి, అమాయకత్వం నటించే వాళ్లంటే నాకసహ్యం. ఇలా జరుగుతుందని నిజంగా మీకు తెలీదా?"

"నిజంగా నాకు తెలీదు. మీకీ ఉద్దేశ్యం ఉందని అనుకోలేదు." ఆమె కంఠంలో ఏడుపొక్కటే తరువాయి.

అతడు ఆమె వంక సూటిగా చూశాడు. ఆమె కంఠంలో వినబడిన సిన్సియారిటీ గుర్తించి, ఒక్క క్షణం మౌనంగా ఉండి, భుజాలెగరేసి, "ఓ.కే. ఇట్సాల్ రైట్..." అన్నాడు. "నేనే తొందరపడ్డానేమో. ఇక ఇదంతా మర్చిపోండి."

ముక్కుపొడుం గట్టిగా పీల్చి తుమ్మి 'సారీ' చెప్పినంత సులభంగా అతను 'ఇదంతా మర్చిపోండి' అనే సరికి ఆమె తల తిరిగిపోయింది. "అందుకోసమే నన్నిక్కడికి తీసుకొచ్చారా" అని అడిగింది.

అతడు నిర్లక్ష్యంగా తల ఎగరేసి, "ఇంక అదంతా మర్చిపోమన్నాగా," అన్నాడు.

"అంటే మీ ఉద్దేశ్యంలో ఆడా మొగా మధ్య స్నేహం అంటే ఇంతేనన్నమాట," హేళనగా అంది.

అతడు నెమ్మదిగా ఆమె వైపు తిరిగాడు. "... 'ఇంతే' అన్న మీ మాటకి అర్థం ఏమిటి? మొదట్లో ప్రేమికుడు చందమామ ఎంత బావుందో అంటాడు. అవునంటుంది. మన భావాలు ఎంత బాగా కలిసి పోయాయో చూశారా అంటాడు. తదాత్మ్యతలో తలూపుతుంది. నేన్నిన్ను ప్రేమిస్తున్నా అంటాడు. 'నేనూ అంతే. నువ్వు లేకపోతే బ్రతకలేను ప్రియా' అంటుంది. అతడామెను దగ్గరకు తీసుకుంటాడు. ప్రకృతి పులకిస్తుంది. కోయిల పాడుతుంది. మొత్తం మీద చివరకు జరిగేదేమిటంటే అతడు ఆమెను అనుభవించటం. దానికోసం ఇంత డ్రామా, ఇన్ని రోజులు పాట్లూ ఎందుకు? ప్రతిదీ అక్కడికే వెళ్లి అంతమయ్యేదానికి, అదేదో అక్కడే ప్రారంభించి ముగించేసుకుంటే ఆ సమయాన్నంతా మిగతా విలువైన పన్లకి ఉపయోగించుకోవచ్చుగా. ఈ ప్రేమికుల్ని చూస్తే నాకు నవ్వొస్తుంది. ప్రేమ అనే ఆత్మవంచన పేరిట ఎంత సమయాన్ని వృథా చేసుకుంటూ ఉంటారో. ముఖ్యంగా మా రేవంత్ లాంటి వాళ్లు."

"మీరింత మెటీరియలిస్టు అనుకోలేదు."

"నావి దారుణమైన భావాలే. కానీ నా భావాల్ని నేను పెంపొందించుకునే హక్కు నాకుంది. వీటితో మీరు కన్విన్స్ అవ్వాలని రూల్ లేదు."

"మనం వెళ్దామా ఇక."

"పదండి," తాళం కప్ప చేతిలోకి తీసుకుంటూ అన్నాడు.

"నన్నిక భవిష్యత్తులో కలుసుకోరు కదూ?"

"దానిదేముంది. ఎప్పుడైనా కల్సుకుంటూనే ఉంటాం కదా," తేలిగ్గా అన్నాడు.

ఆమె గుమ్మం దాటబోయేదల్లా ఆగి, "మైగాడ్," అంది.

"ఏం జరిగింది."

ఆమె సిగ్గుతో, "బ్రా తెగినట్టుంది. ఇలా ఎలా వెళ్లటం?" అంది.

అతడు ఆమె వీపుమీద బిగుతుగా ఉన్న జాకెట్‌ను కొద్దిగా పైకి తోసి, స్ట్రాప్స్ అందుకోవటానికి ప్రయత్నం చేసి, రెండు చేతులతో లాగి దగ్గరకు చేరుస్తూ, "తెగిపోలేదు, హుక్ విడిపోయిందంతే," అంటూ సరిచేశాడు.

ఆమె బల్లమీద పెట్టిన హేండ్ బ్యాగ్ చేతిలోకి తీసుకొంటూ అతడివైపు చూసింది. అతడి మొహంలో ఒక కారు బాగుచేసిన మెకానిక్ అలసట మాత్రమే కనబడింది.

ఇద్దరూ గది బైటకొచ్చారు. అతడు గది తలుపులు తాళంవేసి, మెట్లు దిగుతూ చివరి మెట్టు దగ్గిరకొచ్చేసరికి, అప్పటివరకూ అడగనా వద్దా అన్నట్టూ మనసులోనే మథనపడి ఓ నిర్ణయానికి వచ్చిన దానిలా ఆగి, "నేనొక ప్రశ్న అడుగుతాను, చెపుతారా?" అంది.

"ఏమిటి?"

ఆమెకు సిగ్గేసింది. కాని అతడి మనసు లోతుల్లోని అస్పష్టతని తెలుసుకోవాలన్న కుతూహలం ఆ సిగ్గుని పక్కకు నెట్టింది. "మీకు... మీకు ఏ కోర్కె కలగలేదా?" అని అడిగింది.

అతడి మొహంలో విస్మయం స్పష్టంగా కనబడింది. "మీరొద్దన్నారుగా! ఒకసారి వద్దు అన్న తరువాత ఇక ఎందుకు కలుగుతుంది?" అని, అంతలో ఏదో అర్థమైనట్టు నవ్వి, "కేవలం నా నిగ్రహం పరీక్షించటం కోసమే మీరు ఇలా చేసారా ఏమిటి?" అన్నాడు.

"ఛీ..." అంది.

'నా ఆలోచన్లూ, భావాలూ అన్నీ మెటీరియలిస్ట్‌గానే ఉంటాయి సులోచనా! ఇంకో వంద సంవత్సరాలు పోయినా మనం ఇలాగే ఉంటాం. మీరు బాత్రూమ్‌లో సబ్బు అందించమన్నా నాకే కోర్కె కలగదు. మీరు 'నో' అన్న క్షణం నుంచీ మిమ్మల్ని స్త్రీగా గుర్తించటం మానేశాను. అందుకే మనిద్దరి మధ్య భవిష్యత్తులో స్నేహం గురించి ప్రస్తావన వచ్చినప్పుడు తటపటాయించాను. మీతో నేను పేకాడలేను. మనసు బావోలేనప్పుడు కలిసి మందు కొట్టలేను. ఇంకెలా మీతో స్నేహం చెయ్యటం? మనసులో ఒక భావాన్ని పెట్టుకొని పైకి మరోలా మాట్లాడటం నాకు చేతకాదు. నేను పచ్చిగా మాట్లాడినట్టూ అనిపిస్తే నన్ను క్షమించండి. మీకన్నా సునీల్ గవాస్కర్‌తో కలం స్నేహం చెయ్యటం నాకు ఇష్టం," అన్నాడు.

"ఎంత దారుణమైన ఆలోచనలు మీవి. మనసుని కూడా అణాపైసలతో లెఖ్ఖ కట్టేటట్టూ ఉన్నారే."

"అవును, చాలా దారుణమైన, వ్యాపార సంబంధమైన భావాలు. ఏ మాత్రం లాలిత్యం ఉన్న అమ్మాయి మనసునైనా తూట్లు పొడిచే భావాలు. నాకు ప్రేమ మీద నమ్మకం లేదు. దాని గురించి ఏళ్ల తరబడి ఆలోచించి బస్తాల కొద్దీ కావ్యాలు వ్రాస్తారెందుకో అర్థం కాదు. అదో క్రిమినల్ వేస్ట్ ఆఫ్ టైమ్ అని నా ఉద్దేశ్యం."

"ప్రేమపట్ల మీకింత తేలికైన అభిప్రాయాన్ని కలిగించిన వారెవరు?"

"మా కుటుంబసభ్యులు," అన్నాడు. "ఇన్సెస్ట్ అన్న పదం మీరెప్పుడైనా విన్నారా? ఇన్సెస్ట్ అంటే దగ్గిర బంధువులతో శారీరక సంబంధం. ప్రస్తుతం పాశ్చాత్య దేశాల్లో దారుణంగా పెరిగిపోయిన ఈ ఇన్సెస్ట్ పాతిక సంవత్సరాల క్రితమే మా ఇంట్లో ఉండేది. నా తల్లి స్కూల్ టీచర్. ఓ మధ్యాహ్నం ఏదో పనిమీద ఇంటికి వచ్చిన ఆవిడకి తన మొగుడూ, కూతురు పక్కమీద కనబడ్డారు. అక్కడే ఆ ఇద్దర్నీ చంపేసి ఎనిమిది

సంవత్సరాల జైలు అనుభవించి, ఆ తరువాత అక్కడి జైలర్‌తోనే లేచిపోయింది.''

చంద్రుడు మబ్బులచాటుకి వెళ్లటంతో వెన్నెల మాయమైంది. ఆ చీకటిలో అతడి మొహంలో భావాలు కనబడటంలేదు. కంఠం మాత్రం వినిపిస్తోంది. అతడు చాలా మామూలుగా మాట్లాడటానికి ప్రయత్నించినా వణికే కంఠాన్ని స్వాధీనంలో ఉంచుకోవటానికి కష్టపడుతున్నాడని గ్రహించింది.

''చదువుకోవటం కష్టమైంది. స్కాలర్‌షిప్ సరిపోయేది కాదు. ప్రైవేట్లు చెప్పటం తప్పనిసరి అయింది. దాంతో చదువుకి టైమ్ ఉండేది కాదు. రోజుకి పదహారు గంటలు పని చెయ్యటం అలవాటయింది. చదువు పూర్తయి పోయాక కొత్తగా మిగిలిన సమయాన్ని ఏం చేసుకోవాలో తెలియలేదు. కార్టూన్స్, గిటారు అన్నిటికన్నా ముఖ్యంగా పుస్తకాలు, వీటితో చీకట్లోంచి వెలుగులోకి వచ్చినట్టయింది. నా చుట్టూ ఇంత ప్రపంచం ఉందా అనిపించింది. ఒక్కసారి ఈ 'స్పృహ' కలిగాక ఈ ప్రేమ మీదా, సున్నితభావాల మీదా నమ్మకం పోయింది. నా ఈ పరిణామానికంతటికీ కలిపి మీరు 'మెటీరియలిజం' అని పేరు పెట్టుకుంటే నాకేమీ అభ్యంతరం లేదు. పదండి మనం ఇలా వరండాలో నిలబడి మనసులు విప్పుకోవటం ఏమీ బావోలేదు,'' అంటూ కదిలేడు.

ఆమె కదల్లేదు. నిశ్చేష్టురాలైనట్టూ అలానే నిలబడి ఉంది. మనసు లోతుల్లోకి చూడగలిగితే ఏ మనిషీ చెడ్డవాడు కాదు అనిపించింది.

''జీవితాన్ని బిజినెస్‌లా తీసుకొనే మీరు పెళ్లెందుకు చేసుకోలేదు. నా ఉద్దేశ్యం నెలకి ఓ మూడు నాలుగొందలు పడేస్తే భార్య కమ్ వంట మనిషి కమ్ స్త్రీ కమ్ పనిమనిషి వస్తుంది కదా!''

ఆమె మాటల్లో ఎగతాళి ఏదైనా ఉందేమోనని అతడు ఆమె వైపు చూశాడు. ఆమె నవ్వేసేసరికి తనూ నవ్వుతూ, ''నిజమే, ఈ ఆలోచన నాకు రాలేదు సుమా. అయినా ఇంత పచ్చి అభిప్రాయాలున్న నన్ను



ఎవరు చేసుకుంటారు? మాటలతో మోసం చెయ్యటం నాకు ఇష్టంలేదు," అన్నాడు.

"నాలాటి ఒంటరి ఆడది ఎవరైనా చేసుకోవచ్చు. అడిగి చూడండి."

"నిజంగా చేసుకుంటారా?"

చిన్న నవ్వు.

'థాంక్యూ. రెండు మూడు రోజుల్లో గుడి కానీ, చర్చికానీ ఏది ఖాళీ ఉంటే అక్కడ చేసుకుందాం."

*

"అంతేనా? అయిపోయిందా?" ఆశ్చర్యపోతూ అడిగాడు రేవంత్.

"అంతేనా ఏమిటి. అంతే. అయిపోయింది," కుర్చీ వెనక్కి వాలుతూ అన్నాడు జేమ్స్.

"నేను నమ్మలేను. జీవితాంతం కలిసి ఉండబోయే నిర్ణయాన్ని ఇంత క్యాజువల్‌గా, కేవలం రెండే రెండు ప్రశ్నలతో తీసేసుకున్నారా?" ప్రశ్నమీద ప్రశ్న కురిపించాడు రేవంత్.

"అంటే, చేసుకోబోయే ముందు నెలరోజుల పాటు ఒకరినొకరు ఐ.క్యూ. టెస్ట్ పెట్టుకోవాలంటావా?" అన్నాడు జేమ్స్.

దెబ్బకొట్టాడని తెలుసు. అయినా వాళ్లిద్దరి మధ్య ఆ మాత్రం చనువు ఉంది. అప్పటికీ విషయాన్ని జీర్ణించుకోలేక, "ఆమె ఎలాటిదో ఏమిటో నీకేం తెలుసు?" అని అడిగాడు.

"నీ వెన్నెల్లో ఆడపిల్ల ఎలాంటిదో తెలియకుండానే ఆమెని నువ్వు ప్రేమించటంలేదూ? అదే లాజిక్ నాకూ వర్తిస్తుందని ఎందుకనుకోవు? ఆగు. నువ్వు అడగబోయే రెండో ప్రశ్న నాకు తెలుసు. అర్ధరాత్రి మోటార్ సైకిల్ ఎక్కి ధైర్యంగా నీ రూమ్‌కి వచ్చిన అమ్మాయి పవిత్రత గురించి నీకు అనుమానం లేదా? అని అడగబోతున్నావు. అంతేనా? ఈ పవిత్రత అనేది ఒక ట్రాష్ అని నా ఉద్దేశం. నాకు అనుమానం కలిగిందే అనుకో. అర్ధరాత్రి ఒక అమ్మాయిని తీసుకొని వెళ్లిన నా పవిత్రత మీద కూడా ఆమెకి అనుమానం కలగాలి కదా. పురుషుడికి అక్కర్లేని పవిత్రత స్త్రీకి ఎందుకు కావాలంటారో నాకర్థం కాదు. నేనొట్టి మాటలు చెప్పేవాణ్ణి కాదని నీకు తెలుసు. మేమిద్దరం కలిసి వుంటాం. ఇరవైనాలుగు గంటలు బిజీబిజీ దినచర్యలో మూడు నిముషాల 'బయాలాజికల్ నీడ్' కోసం పరస్పరం సహకరించుకుంటాం. ఓ యాభై సంవత్సరాల తరువాత ఇద్దరం చచ్చిపోతాం. అంతే. ఇంత దానికి ఇంత మానసిక సంఘర్షణా, నిర్ణయాలూ, సిద్ధాంతాలూ ఇవన్నీ ఎందుకు? పెళ్లనేది రిస్కు అయినప్పుడు ఆ రిస్కు ఎవరితోనైతేనేం? నా మాటలు నీకు నవ్వు పుట్టించవచ్చు. కానీ జీవితంలో ఎన్నో రాపిడులకు గురయిన నా మనసు నాకు నేర్పిన పాఠం ఇది. అందుకే నాకు, 'నేనేదో కష్టాల్లో ఉన్నాను... నా మనసునెవరూ అర్థం చేసుకోవటం లేదు...' వగైరా సెల్ఫ్ పిటీ ఆలోచన్లు కలగవు. దీనికి మీరు పెట్టిన పేరు 'మెటీరియలిజం' అయితే నాకు అభ్యంతరం లేదు. ఎందుకంటే, పైకి ఎంత భావుకత్వమూ, సెంటిమెంటూ, కవిత్వమూ చెప్పినాసరే, అసలు పెళ్లి అనేదే పురుషుడూ, స్త్రీ అనే ఇద్దరు మెటీరియలిస్టులు పరస్పర అవసరాలు తీర్చుకోవటం కోసం చేసుకొనేదని నా భావన. ఇన్నీ ఆలోచించే నేనీ పెళ్లికి సిద్ధపడ్డాను. ఎల్లుండే పెళ్లి. వచ్చెయ్యి."

*(ఇంకా ఉంది)*






తండ్రి శరభయ్యతో సపరేటయిపోయి ఊరి చివరెక్కడో కాపురం ఉంటున్న మారేటి కొడుకు గోపాలకృష్ణ ఆ రాత్రి కారు డ్రైవ్ చేసుకుంటా వస్తున్నపుడు చాలా లోతైన ఆ ఏరులో పడి చనిపోతే కోడల్ని పరామర్శించడానికొచ్చేడా దొంగ తండ్రి శరభయ్య.

తిరపతి చివర చిత్తూరు వెళ్లే రోడ్డులో ఉన్న ఆ పసుమర్తి వారింట్లో షూటింగ్.

అదయ్యాకా ఆ దొంగతండ్రి శరభయ్య వేషం వెయ్యడానికి ఇవ్వాళే మద్రాసు నించొచ్చినా గొల్లపూడి మారుతీరావుగారు, మా ముందు నడుచుకుంటా రోడ్డుమీదాగున్న కారు దగ్గరకెళ్తున్నారు.

ఆయన వెనకాలే కాస్త దూరంగా నడుస్తున్న నేను, పక్కనే ఆ విలను శరభయ్యకి సొంత కొడుకు వేషం వేస్తున్న కృష్ణ భగవాన్.

“పొద్దుట్నుంచీ షాట్ గ్యాప్ వచ్చినప్పుడల్లా ఆ మారుతీరావుగారితో మాటాడతానే వున్నారుగదా మీరు?” అన్నాడు కృష్ణ భగవాన్.

ఔనంటూ నవ్విన నేను, “నాకాయన ఇవాళే పరిచయం అయినా ఆయన గురించి కొంత తెల్సు,” అన్నాను.

“నేనాయన రాగరాగిణి, సత్యంగారిలెక్కడ నాటికలు చూసేను. పందొమ్మిది వందల డబ్భైలో ఆంధ్ర కళాపరిషత్తు విజయవాడలో జరిగినపుడు ఆయన కరుణించిన దేవతలు, కళ్లు నాటకాలు ఆడేరు. ఆ రెండింటికీ ఆయన అవార్డు అందుకున్నప్పుడు ఆర్టిస్టులంతా భుజాలమీదెక్కించుకుని ఊరేగించారంటాయన్ని,” అన్నాడు కృష్ణ భగవాన్.

“అదంతా నాకు తెలీదుగానీ రైటర్గా తెల్సు. అదే మాట్లాడేను పొద్దుట్నుంచీ,” అన్నాను.

ఆయన కారెక్కేసెళ్లిపోయేక నా కారులో ఎక్కాడు కృష్ణ భగవాన్.

“అలా రేణిగుంటదాకా వెళ్లి వెనక్కి రా,” అన్నాను డ్రైవరుతో.

మామూలే. కదిలిన కారు స్పీడందుకున్నాక గాలొస్తుంది లోపలికి.

"ఇన్నేళ్లలో ఆయన రాసిన కథలు ఏభై పైచిలుకు మాత్రమేనంట," అన్నాను.

"అంతేనా?" అన్నాడు కృష్ణభగవాన్.

"ఔను. సినిమాలు మాత్రం ఒక డబ్బై అయిదు రాసేరంట," అన్నాను.

"కథల గురించింకా ఏవన్నారండీ?" అడిగేడు కృష్ణ భగవాన్.

"అవన్నీ ఇప్పుడు చదువుతుంటే, కొన్ని కథల్ని ఇప్పుడు రాయననీ, కొన్ని ఇలా రాయననీ, కొన్ని ఇంకా బాగా రాసేవాడిననీ అనుకున్నారంట."

"ఒక వయసొచ్చాకా ఎవరైనా అలాగే అనుకుంటారేమోనండీ."

"కథ చెప్పి, సందేశాన్ని సూచనగా చెప్పకుండా వదిలెయ్యడం ఒక శిల్పం అవ్వొచ్చుగాని, సమస్యని విశ్లేషించడం నాకిష్టం," అంటారాయన.

"ఈయనన్నదే బాగుందనిపిస్తుందండి నాక్కూడా."

"శిల్పమో, పాత్రీకరణలో వైచిత్రో, మానసిక విశ్లేషణో లేకుండా కథ రాయలేదంటాయన," అని నేనంటే, "ఆయన కథలు చదువుతున్నపుడు నాక్కూడా ఇదనిపించిందండి," అన్నాడా కృష్ణభగవాన్.

"ఆయనిన్ని తక్కువ కథలు రాయడానికి కారణం ఒకటుంది."

"ఏంటండదీ?"

"ఎవరో ఒకళ్ల ప్రోద్బలం లేకుండా ఆయన కథ రాయలేదు. ఏటేటా ఆంధ్రజ్యోతినించి పురాణం సుబ్రమణ్యశర్మ, జ్యోతి రాఘవయ్యా, నండూరి రామ్మోహనరావూ ఇలా ఫ్రెండ్స్ అడిగినప్పుడు మాత్రమే రాసేరంట. అందుకే ఆయన కథలన్నీ ప్రత్యేక సంచికల్లోనే కనిపిస్తాయంట."

"ఇది నాకు తెలీదండి."

"ఆయన కథల్లో ఆ క్యారెక్టర్లూ, సీన్లూ అన్నీ ఆయన ఎరిగినవేనంట. తాజ్‌మహల్ కథ తను ఆగ్రా టూరు వెళ్లినప్పటిదంట. 'ద్రౌకన్ను'లో కారు ఆక్సిల్ విరిగిన సందర్భం, కీర్తిశేషుడులో లారీ కింద మనిషి చెయ్యి, గడ్డిపువ్వులో పేరిందేవి నిజాలంట," అన్న నేను చీకటిపడ్డంతో కారు వెనక్కి తిప్పమన్నాను.

"ఆయన ఇవన్నీ చెప్పేరు బానేవుంది గానండీ... ఆ జుజుమురా కథ గురించేం చెప్పలేదా మీకు?" అన్నాడో లేదో గతుక్కుమంది మనసు. దాన్ని ఎవరు చదివినా సరే కాసేపలాగుండిపోతారు. అంతే ఫీలుంటదా కథలో.

ఊర్వశీ లాడ్జికొచ్చినా కారు దిగి పైకెళ్లేకా మేనేజర్లనీ నా డిపార్ట్‌మెంటు అసిస్టెంట్లనీ, పిల్చి రేపు ప్రోగ్రాం మాటాడేకా స్నానం అదీ కానిచ్చి కూర్చునుంటే వచ్చిన ఆ కిన్నెర అన్నయ్య శీను, "టెర్రస్ మీదకెళ్దామండీ మా చెల్లి కూడా వస్తానంటుందీవేళ," అన్నాడు.

"ఇవాళొద్దులే," అంటా అతన్ని పంపించేసిన కాసేపటికి నేనొక్కడ్నే వెళ్దామనిపించింది ఆ పైకి.

చాలా ఫ్లోర్లున్న ఆ ఊర్వశీ హోటలు పైకెక్కిన నాకు ఎటు చూసినా చీకటే. పల్చగా వీస్తున్న కొండ గాలి. దూరంగా కనిపిస్తున్న కొండమీద వెలిగిపోతున్న తిరునామం. దాన్నే చూసేకా మళ్లీ చీకట్లో కలతిరుగుతున్న నాకు ఇందాకా కృష్ణ భగవాన్ చెప్పిన జుజుమురా కథ గుర్తుకొస్తుంది.

ఒక చీకటి రాత్రి శంభల్‌పూర్‌లో బయల్దేరి భువనేశ్వర్ వెళ్తున్న ఒక బస్సులో కథ. తెల్సిన నిజాల్నీ అనుభవాల్నీ మాత్రమే కథలు రాసిన మారుతీరావు గారు, ఈ కథ మట్టుకి కల్పించే రాశారనిపిస్తుంది. కాదు, నిజమేనేమో ఇలాక్కూడా జరిగిందేమో అని కూడా అనిపిస్తుంది. ఎందుకంటే ఫస్ట్ పర్సన్‌లో రాసిన కథలోని హీరో ప్రవర్తన పొద్దుట్నుంచీ చూస్తున్న ఈ మారుతీరావుగారిదిలాగే వుంది. ఆ హీరోలాగే మారుతీరావుగారికి జరదాకిళ్లీలంటే చాలా యిష్టం.

అసలా రాత్రి చదివిన ఆ జుజుమురా అపుడెలాగుందో మళ్లీ తల్చుకుంటే ఇప్పుడూ అలాగే అనిపిస్తా ఆ ఫీలే కలిగిస్తుంది.

ఆ చీకటి రాత్రి వస్తున్నా బస్సులోకి దుర్మార్గుడి పగలాగ దూసుకుంటూ వస్తుంది చలి. ఆకాశంలో చంద్రుడు నీరసంగా తొంగి చూస్తున్నాడు. కనిపిస్తున్న చుక్కలు అలికేసినట్టున్నాయి.

వెళ్తున్న బస్సుకి రిపేరు రావడంతో జుజుమురా అన్న పేరుగల ఆ చిన్ని గ్రామంలో ఆగిపోయింది. విసుక్కుంటూ దిగుతున్న పాసింజర్స్‌తోపాటు శంభల్ పూర్ ముతకచీర కట్టుకున్న మీరా అనే ఆ అమ్మాయి ఈ కథలో నాయకుడైన రావుకి తెలుగులో మాట్లాడుతూ పరిచయమై ఆ కాసేపట్లోనే చాలా బాగా దగ్గరైపోయింది.

అరగంట తర్వాత రిపేరైన ఆ బస్సు హారన్ మోగడం మొదలయ్యేటప్పటికి బస్సులోకి పరుగెట్టేరంతా.

రావు పక్కనే కూర్చుని నిద్రోతున్న ఆ పండా, ఒరియాలో ఏదో అంటుంటే, "అర్థమైందా?" అందా మీరా.

"ఏంటీ?" అన్నాడు రావు.

"మీరిద్దరూ భార్యాభర్తలు గదా! రెండు సీట్లెందుకు? నువ్వు ముందు కూర్చున్న నీ పెళ్లాం దగ్గర కెళ్లిపోతే, నేనిక్కడ హాయిగా పడుకుంటాను బాబూ," అంటున్నాడు.

ముఖం ఎరుపెక్కిన రావు ఆ ముసలి పండావైపు కోపంగా చూస్తుంటే, నవ్విన మీరా, "మీరిలాగొచ్చేసి ఆ ముసలోడ్ని పడుకోనియ్యండి పాపం," అంది.

ఆ చలిబెడ్తున్న వాతావరణంలో చలాకీగా మాటాడ్తున్న మీరా వెచ్చటి శరీరం తనకి తగుల్తున్నప్పుడు, ఏదోలాగయిపోతున్న రావు నోట్లోంచి ఏవేవో మాటలొస్తుంటే, "ఏంటీ అన్నారూ," అంది.

"నేను పూరీ వెళ్తున్నాను. ఈ పండా ఆశీర్వాదం ఫలించాలని జగన్నాధుడికి చెప్పుకుందామనుకుంటున్నాను."

విని ఆశ్చర్యంగా చూసినా మీరా, "అంటే మీరు నన్ను పెళ్లి చేసుకుంటారా?" అంది.

జవాబివ్వకుండా కంగారుపడ్తున్న రావుని చూస్తూ, "ఒణుకుతున్నారు ఈ శాలువా కప్పుకోండి," అంటూ తన ఒంటిమీదది తీసిచ్చింది.

"మీకు చలేస్తే నేను తట్టుకోలేను... మరైతే ఇద్దరం కప్పుకుందాం," అన్నాడు.

"సరే, జీవితాన్ని పంచుకునే ముందు శాలువాని," అంటూ సగం తన మీదికి లాక్కుంది.

రథాకోల్‌లోంచి వెళ్తున్న ఆ బస్సు శబ్దం తప్ప, అంతా నిశ్శబ్దం. చంపుకు తింటున్న చలి.

తనకి తెలీకుండానే ఆ మీరా నడుంచుట్టూ



చెయ్యేసి పట్టుకున్న రావు అలాగెంతసేపుండిపోయాడో ఆ తర్వాతేం చేశాడో తనకి తెలీదు.

అతని చెవి దగ్గర నోరుపెట్టిన మీరా అచ్చం భర్తని పిల్చినట్టే, "ఏవండీ," అంటూ పిలిస్తే తెలివొచ్చింది రావుకి.

"రఢాకోల్ వచ్చాం కొంచెం టీ తాగరూ?" అంది.

కళ్లు తెరిచిన తను, ఆమె వెచ్చటి ఒళ్లో తల పెట్టుకున్నట్టు అప్పుడర్థమయ్యి సిగ్గుపడిపోతున్నాడు.

"పడుకున్న మిమ్మల్ని లేపాలనిపించడంలేదు. ఆకలితో అవస్థపడతారని ఇలా కుదిపాను. ఇక్కడ టీతోపాటు శనగపప్పుతో చేసే పప్పు, వేడి రొట్టెలు చాలా బాగుంటాయి," అంది.

లేచెళ్లి తింటుంటే ఒకళ్లకొకళ్లు బాగున్నట్టు చాలా రుచిగా వున్నాయా పప్పు, రొట్టెలు.

రఢాకోల్ నించి అంగూల్‌కి ఎనభై కిలోమీటర్ల దూరం. రెండు పక్కలా తవ్వేయడంతో ఎక్కడ మట్టి ఉందో, ఎక్కడ గొయ్యి ఉందో తెలీని భయంకరమైన రోడ్డు. దాంతో మీరా చేతుల్లో రావొచ్చి వుంటే మళ్లా ఆ రావు చేతుల్లోకి మీరా వచ్చేస్తుంది. దీంతోపాటు బస్సులో దీపాలన్నీ ఆర్పేసేరు. ఒకళ్ల ఊపిరొకళ్లకి తగుల్తుంటే ఎంత రేటు పెట్టి కొన్నా రాని అనుభవం.

బొయిండాకి పది మైళ్లవతలిదాకా ఈ రోడ్డిలా వుండటంతో ఈ అద్భుతమైన వాళ్ల అవస్థ.

అలా చాలాసేపు తర్వాత అంగూర్ వచ్చింది.

మంచులాంటి చలిగాలి వాళ్ల శరీరాల మధ్య నలిగి వేడెక్కి మెల్లిగా శలవు తీసుకుంది. ఎక్కడా దూరం లేకుండా ఏకమయ్యాయి శరీరాలు.

ఈసారి కావాలని రావు నడుం చుట్టూ తన చేతిని తిప్పుకున్న మీరా ఏం మాట్లాడకుండా చూస్తోంది చీకట్లోకి. అలా చూస్తున్న మనిషి అతనివైపు తిరిగి, "భార్యని బాగా ప్రేమించగలరు మీరు," అంది.

"మీకెలా తెలుసు?" అన్నాడు.

"ఈ కింది పెదవి చూడండి ఇంకా రక్తం చిమ్ముతోంది," అని నవ్వింది.

దాంతో వెన్నెలరాత్రి, మీరా కట్టుకున్న పట్టుచీరా, పెళ్లిపందిరీ, ఆమె మెళ్లో కట్టే మంగళసూత్రం-ఏంటేంటో తెగ ఊహించేసుకుంటున్నాడు రావు.

చారలు చారలుగా మెరుస్తున్న చౌద్వార్ వెలుగుల్ని చూస్తున్న మీరా, "నేను కటకంలో దిగాలి," అంది.

"నేనూ దిగుతాను," అన్నాడు.

"ఎందుకూ? నేను దిగెళ్లిపోవాలి."

"రాత్రంతా రెచ్చగొట్టి ఇప్పుడు దిగెళ్లిపోతావా మీరా?"

బస్టాపులో అరగంటాగుద్దంట. ఇద్దరూ దిగి నడుస్తున్నారా చీకట్లో.

"మనం ఇంకాస్సేపట్లో శాశ్వతంగా విడిపోవాలి," అంటున్న ఆమె గొంతు గాద్గదికమయ్యింది. "ఎందుకంటే నాకు లంగ్ క్యాన్సర్."

"మీరా!!! ఏంటీ ఘోరం?"

"ఎలాగూ చనిపోబోతున్న నేను నా భర్తతో ఒక రాత్రి గడపాలనుకున్నాను. అదిలా దక్కింది మీతో," అంటుండగా కదలబోతున్నట్టు బస్ హారన్. "గుడ్ బై మై హజ్బెండ్," అంటూ ఆ రావుని బస్సెక్కించిన మీరా ఆ కటిక చీకట్లో కల్సిపోయింది.

అప్పుడెప్పుడో చదివిన ఆ కథనే తల్చుకుంటూ కిందున్న నా రూమ్‌లో కొచ్చేటప్పటికి ఫోన్ మోగింది.

"అరకునించి ట్రంకాల్," అన్నాడు ఆపరేటర్.

"హలో," అన్న నేను ఆ పక్కనున్న వర్ణమాలతో ఇంతసేపూ నాకు గుర్తొచ్చిన ఆ ఒరియా అమ్మాయి కథ చెప్పాను.

"మా అరకులో ఉండే జనం తెలుగు మాట్లాడ్తారుగానీ ఆల్మోస్ట్ ఒరిస్సా జనమే. అంతా సెటిలర్స్. కావాలంటే ఎవర్నన్నా కనుక్కోండి," అందా వర్ణమాల.

"నిజమా?" అన్నాను.

"ఔను... నేను కూడా ఒరియా మనిషినే గదా?"

"ఔనా... "

“ఔనో కాదో మీ మద్రాసులో ఎవరైనా ఒరియా వాళ్లుంటే అడగండి. ఇన్నాళ్లు టాపిక్ రాలేదు గాబట్టి చెప్పలేదుగానీ, నేను చదువుకున్నదంతా ఒరియా సాహిత్యమే. సత్‌రౌత్‌రాయ్ కథలు బాగా చదివేను. మీకు కావాలంటే తెలుగులో ట్రాన్స్‌లేట్ చేసిన ‘స్మశాన కుసుమం’ అనే కథ పంపిస్తాను. ఖాళీగా వున్నప్పుడు చదవండి అంటూ ఇంకాసేపు మాటాడి, “చాలా రాత్రయింది... ఈ చీకటి లోయలో ఎక్కడో వున్న మా ఇంటికెళ్లాలి,” అంటూ పెట్టేసింది.

వీణ తీగెలమీద తుమ్మెద వాలితే ఎంత సుతారమైన సవ్వడి ఉంటుందో... ఆ పువ్వులోంచి పూడి తివాచి పైన పడితే ఎంత మృదుమైన స్పర్శ అవుతుందో... వెన్నెల పరిమళం తగిలి మల్లెపువ్వు సుకుమారంగా ఊగుతుంటే ఎలా ఉంటుందో... అలా ఉంది వర్ణమాల స్వరం.

మెల్లగా మెత్తగా ఒబ్బిడిగా కంజాయింపుగా తూకమేసినట్టు... ఎంత అందంగా వున్నాయి వర్ణమాల మాటలు!!

ఈ అమ్మాయి పుట్టినప్పుడే టీచరవ్వుద్దని, ఆళ్ల అమ్మానాన్నలకి తెలుసేమో- వర్ణమాల అని ఎంత మంచి పేరు పెట్టేరు!!

❈

వెస్ట్ చర్చి కాంపౌండ్ ఏరియాలో ఉన్న ఆ చిన్న పెంకుటింటి వెనకాల పొడుగాటి పచ్చటి కొండలు. పాతకాలంనాటి ఆ ఇల్లు చెట్టుకింద ప్లీడరైన బాలరాజుది అని ఆర్ట్ డైరెక్టర్ రంగాకి చెప్పి, మర్నాడు లొకేషన్‌కొచ్చే టప్పటికి ఆ ఇంటికి మేచ్ అయ్యేలాగ కాంపౌండు, ఆ డొక్కు ఫోర్డు కారు, నిలబెట్టిన పట్టి మంచం, బోర్లించిన రేకు డబ్బా లాంటివన్నీ పడేసున్నాయి.

కారు కిందకి దూరి రిపేరు చేసుకుంటున్నా బాలరాజు దగ్గరకొచ్చిన పాత సామాన్లోడు ఎప్పట్లాగే బాలరాజుని వేపించుకుని తినేయడం మొదలెట్టేడు. పప్పుజీళ్లకా ఫోర్డుకారు కొట్టేసి పట్టుకుపోదామని పాతసామాన్లోడి ఎదవ ఐడియా. ఆ యాంటిక్ కారు మీద పాతసామాన్లోడి చూపులు పడడమే ఇన్నట్లను కుంటున్న బాలరాజు ఆణ్ణి తన్ని తరిమేసే ప్రయత్నం చేస్తున్నాడు. ఈలోగా తన జనాన్నేసుకొచ్చిన మహం కాళి అనే అరటితోటోడొస్తే, “ఏంటి కేసు?” అన్నాడు బిజీ లాయరు టైపులో పోజెట్టిన బాలరాజు .

“నా అరటితోటలోకొచ్చిన ఒకడు రోజుకో గెల నరుక్కెళ్లిపోతుంటే అడ్డి పట్టుకుని చితగ్గొట్టేసేను. ఆడేమో నా మీద కేసెట్టేసేడు. దాన్ని నువ్వు వాదించి పెట్టాలయ్యా,” అన్నాడా మహంకాళి.

రాకరాక కేసొచ్చినందుకు లోపల్లోపల తెగ సంబరపడిపోతా, దాన్ని మహంకాళికీ ఆడితో పాటొచ్చిన మందకీ తెలియకుండా మేనేజ్ చేస్తా ఈ కేసు నువ్వు నెగ్గేసినట్టే వెళ్లిపొమ్మన్నాడు బాలరాజు.

ఈ సీన్ తియ్యడం అయ్యేకా ఆర్ట్ డైరెక్టర్ రంగాని పిల్చి, “కొన్ని కోర్టు సీన్లున్నాయి..సెట్ ఈవూళ్లో వేస్తే, ఈ పెద్ద షెడ్యూల్‌లోనే సినిమా అంతా అయి పోతుందండీ,” అన్నాను.

ఏం మాటాడకుండా వెళ్లిపోయినా రంగాగారు మర్నాడొచ్చి, “కోర్టు సెట్ ఈ వూళ్లోనే వేస్తాను సార్,” అన్నాడు.

“ఎక్కడ,” అన్నాను.

“ప్రకాశం రోడ్లో ఉన్న ఎస్వీ హైస్కూలు లోపల,” అనేసెళ్లిపోయి, నేను చెప్పిన టైముకి రెడీ చేసేసేడు.

ఆ స్కూలు లోపలున్న గాంధీ హాల్లో అచ్చం కోర్టునక్కడ దింపేసేడా ఆర్ట్ డైరెక్టరు. ఆ ఏవీఎమ్ స్టూడియోలో కోర్టు సెట్టంత గొప్పగా వుండకపోవచ్చు గానీ నేనూ ట్రై చేస్తానంటూ వెళ్లినా రంగా ఎంత బాగా వేసేడు!

నిజమే. ఇరవై నాలుగు క్రాఫ్టులూ చాలా గొప్పగా కనిపిస్తాయంట ‘రషోమాన్’ సినిమాలో. వాటన్నిటి మీదా అంత పట్టున్న అకిరా కురసోవా పనిచేయించు కోడానికి ఈ రంగాలాంటి మంచి వర్కర్స్ దొరికి వుంటారు.

ఆ సెట్టంతా కలదిరిగిన నేను మంచి హుషారు గా మొదలెట్టేను పని.

బేరాల్లేక చెట్టుకింద ఈగలు తోలుకుంటూ కూర్చున్న బాలరాజు దొరక్క దొరక్క దొరికినా మహం కాళి అరిటి గెలల కేసుని చాలా హుషారుగా ఈ దెబ్బతో దశ తిరిగిపోవాలన్నంత కోరికతో రంగంలోకి దిగిపోయినా కంగారులో బాగా కన్‌ఫ్యూజయి తనకీ కేసు అప్పగించిన తన క్లయింటు మహంకాళే ముద్దాయి అనీ, అతను నరికింది అరిటిగెలలు కాదు ఏకంగా మనిషి తలలు అని... ఇలాగ సంబంధం లేని నేరాలు ఆ మహంకాళి మీదకి తోసేసి, నానా గందర గోళం చేసేసి, అతనికి మూడొందల రెండు సెక్షన్ ప్రకారం ఉరిశిక్ష వేయాలని కోర్టు వారిని కోరుకున్నాడు.

బాలరాజు మాటల్తో మంటెక్కిపోయినా మహం కాళి ఆ బోన్లోనే నిజంగా మహంకాళి అవతారం ఎత్తేసేడు. మామూలు అరిటిగెలల కేసుని ఉరిశిక్ష వరకు తీస్కెళ్లినా బాలరాజుని, 'మర్డర్ చేయందే వదల్ను,' అంటూ తరుముతుంటే, ఆడు పారిపోయేడు గానీ అసిస్టెంటయిన ఆ క్రిష్ణకుమారి మాత్రం దొరికి పోయిందాళ్లకి.

*

చనిపోయిన తన భర్త గోపాలకృష్ణకి ఫ్రెండయిన ఆ లాయర్ బసవరాజు దగ్గర కెళ్లింది సుజాత. సాయం చెయ్యడం మానేసేడు సరిగదా ఆ విలన్ శరభయ్యకి ఫర్‌గా మాటాడ్డం మొదలెట్టినా బసవరాజు, "ఇంక ఎక్కువ అల్లరి చెయ్యకుండా వెనక్కి వెళ్లిపో," అన్నాడు.

డల్లయిపోయిన సుజాత సెల్ఫ్ డ్రైవింగ్ చేసుకుంటూ తన కారులో వస్తుంటే,ఆ శరభయ్య మనుషులు జీపులో ఫాలో అవ్వడం మొదలెట్టేరు.

ఆ పక్కనించా మహంకాళి తరుముతుంటే తన కారులో పారిపోయి వస్తున్న బాలరాజు ఎదురయ్యేడీ సుజాతకి.

అతనికి తన కేసు అప్పగించిన సుజాత అడ్వాన్స్ ఇవ్వబోతుంటే ఆ పెద్ద ఎమౌంట్ చూసిన బాలరాజు "అబ్బే ఇప్పుడెందుకండీ," అన్నాడు.

పక్కనే వున్న క్రిష్ణకుమారి, అతన్ని లోపలికి తీసుకెళ్లి చెడామడా తిట్టేస్తా తలంటేసి అర్జంటుగా డబ్బులందుకోమంది.

*

లొకేషన్‌లో అసలెవరితోనూ మాటాడకుండా చాలా డల్‌గా వుండే ఆ కిన్నెర తన హుషారు కేరెక్టర్ని అంత బాగా చేస్తుంటే ఆ మనిషినే చూస్తున్న నేను, 'ఈ అమ్మాయిని గ్లామరస్‌గా చూపించాలంటే ఏం చెయ్యాలీ?' అనుకుంటుండగా వచ్చినా మేకప్ కుమార్, "ఈ గెటప్ కమిట్ అయిపోయేం గాబట్టి ఇప్పుడు కుదరదుగానీ ఆ సత్యంగారు విగ్గు కొనడానికి నాకు డబ్బులిచ్చి వుంటే చాలా గ్లామరస్‌గా తయారు చేసి వుందునీ పిల్లని," అనేసెళ్లిపోయేడు.



'తన హుషారు కేరెక్టర్ని అర్థం చేసుకుని చేస్తున్న కిన్నెర, బేసికల్‌గా డేన్సరవ్వడం వల్ల బాగా చేస్తుంది పాటల్లో. కొంచెం అందంగా కనిపిస్తే చిన్న బడ్జెట్ సినిమాలకి మంచి హీరోయిన్ దొరికినట్టుండేది. మరేమవు తుందో ఈ మనిషి ఫ్యూచర్,' అను కుంటూ పనిలోని దిగేను.

తన కొడుకు గోపాలకృష్ణ, ఈ సుజాతలకసలు పెళ్లి అవ్వలేదు అంటూ కేసు పెట్టేడా శరభయ్య.

దాంతో సుజాతని తీసుకుని

మేరేజ్ సర్టిఫికెట్ కోసం రిజిస్ట్రార్ దగ్గరకొస్తే అక్కడ గుమాస్తా ఏసుపాదం లేదు పొమ్మంటూ చాలా అల్లరి చేసేడు. అక్కడ్నించి తనని పెంచి పెద్ద చేసిన ఆ ఆర్ఫనేజ్‌లో ఫాదర్ గాబ్రియేల్ దగ్గరకెళ్తే ఆయనకి మెమరీ పోయిందని చెప్పింది సిస్టర్.

"ఏంటిలా జరుగుతుందీ," అంటూ చాలా ఇదై పోతున్న సుజాతతో, "మీ డెలివరీ టైములో బర్త్ సర్టిఫికెట్ మీద మీ హజ్బెండ్ గోపాలకృష్ణ సంతకం ఉంటుంది గదా?" అన్నాడు బాలరాజు.

ఔనంది సుజాత.

దానికోసం హాస్పిటలుకెళ్తుంటే దారిలో అటకాయించినా శరభయ్య రౌడీలు చితగ్గొట్టి పారేస్తే, దేకుతా పాకుతా హాస్పిటల్ కెళ్ళేడు బాలరాజు.

వైద్యం చేయించుకుంటుంటే అక్కడికొచ్చిన సుజాతతో ఈ కేసు విత్‌డ్రా చేసుకుంటున్నట్టు చెపుతుంటే, అతన్ని ఒప్పించడానికి చాలా ప్రయత్నాలు చేస్తుందా ఒంటరి సుజాత.

ఒప్పుకోకపోయేటప్పటికి, వెళ్లిపోయిందా రుయా హాస్పిటల్లోంచి.

అదంతా చూసినా బాలరాజుకి అసిస్టెంటూ మేనకోడలైన పామర్తి క్రిష్ణకుమారి కుడికాలికీ మోచేతికీ కట్లతో నీరుగారిపోతున్నా పిరికోడికి చాలా ధైర్యం చెప్పింది.

భయపడిపోతున్నతను వినడం లేదు.

మాట వినని ఆ మనిషికి ఇలా బెటరని, 'నీరు గారి పారిపోకు నీరసాన జారిపోకు' అంటూ పాటందుకుంటే, ఆ హాస్పిటల్లో నర్సులూ కాంపౌండర్లూ వంత పాడతా సాయం చేసేరు.

అలాగా క్రిష్ణకుమారి ఎంత ధైర్యం చెబుతున్నా ఆ రౌడీగాళ్లే గుర్చుకొచ్చేస్తున్న బాలరాజుకింకేం వినిపించడం లేదు. నాల్రోజుల తరవాత ఆ హాస్పిటల్నుంచి డిశ్చార్జయినా పిరికోడు, ఈ జన్మకి ఆళ్ల జోలికి వెళ్లకూడదనుకుంటా ఆ వెస్ట్ చర్చి కాంపౌండ్‌లో అతనుంటున్న ఆ చిన్న పెంకుటింట్లోకెళ్లిపోయేడు.

రాత్రయ్యింది. తిరుపతంతా నిద్రోయినా ఆ కొండమీద తిరునామం వెలుగుతానే వుంది. ఇంత సేపూ అరుస్తా వెళ్లినా నల్లకుక్కకి నిద్రొచ్చినట్టుం దిప్పుడు. వీధి మొత్తం నిశ్శబ్దం.

సరిగ్గా అదే టైములో గొళ్లెం పెట్టిన తన ఇంటి తలుపు వెనకనించి, "బాలరాజుగారూ," అన్న ఆడగొంతు.

నెమ్మదిగా కళ్లు విప్పిన బాలరాజు, "ఎవరండీ" అన్నాడు.

"కొంచెం తలుపు తెరవండీ చెపుతాను..."

చిత్రంగా ఫీలైన బాలరాజు, 'ఈ టైములో ఎవరా?' అనుకుంటూ తలుపు తెరిస్తే ఆళ్లే... ఆ చీకట్లో నవ్వుతా నిలబడ్డ శరభయ్య మనుషులు. తనని బాదేసిన దుర్మార్గులు.

ఆ చీకట్లో కూడా కూలింగ్ గ్లాసులెట్టుకున్నా డొకడు. కాట్రాక్ట్ ఆపరేషన్‌గానీ చేయించుకున్నాడేమో రీసెంట్‌గా. తన కోసం దూరాన్నించొచ్చిన క్లోజ్ ఫ్రెండ్లా పళ్లికిలిస్తున్నాడు.

"ఆ సుజాతగారి కేసు విత్‌డ్రా చేసుకున్నానండీ," అంటా ఈ పిరికి బాలరాజు నోరు విప్పబోయే లోపే మీదకి దూకేసినాళ్లు, ఈడరిస్తే పక్కింటోళ్లకి ఎక్కడ వినపడిపోద్దో అనేసి నోరు మూసేసి మరీ రేవెట్టేస్తున్నారు. ఆల్రెడీ కట్టున్న ఆ ఎడమ మోచేతినీ కుడికాలి సీలమండల్ని హెవీగా చితగ్గొట్టేసెల్లిపోయేరు.

తెల్లారేకా రోజూలాగే సినిమా పాట పాడుకుంటా





సైకిల్ మీదొచ్చినా క్రిష్ణకుమారి ఆ చెత్త చెత్త సామాన్ల మధ్య చిత్తుచిత్తుగా దెబ్బలు తినేసి పడిపోయున్న బాలరాజుని చూసింది.

ప్రాణముందిగానీ, పడుకునున్నాడు.

పరిగెట్టుకుంటా వెళ్లిన క్రిష్ణ, "బావా... లే," అంటా తట్టి లేపుతుంటే లేచేడు మొత్తానికి.

"ఏంటి బావా... ఎవరు కొట్టేరు. ఏం జరిగిందసలూ?" అనేసి కంగారుపడతా అడుగుతుంటే ఓ పక్క బాధగానే మూలుగుతున్న బాలరాజు, "ఆళ్లే... అర్ధరాత్రొచ్చేరు..." అన్నాడు.

షాకైన క్రిష్ణకుమారి, "వాళ్లా... సుజాతగారు ఎంత బలవంతం చేసినా ఆ కేసు చెయ్యనని వదిలేసేవు గదా. మళ్లీ ఎందుకొచ్చేరు?" అంది.

"ఆ విషయం సుజాతగారికీ మనకీ తెలుసు తప్ప వాళ్లకి తెలీదుగదా," అన్నాడు బాలరాజు.

"ఔనౌను..." అంటా ఎండిపోయిన రక్తపుచార లున్న అతని ఒంటిని తడుముతా, "అయ్యయ్యో... ఎన్ని దెబ్బలో... పద, మళ్లీ ఆ హాస్పిటల్లో చేరిపోదూగాని..." అంది.

"వాళ్లనంత తేలిగ్గా వదిలిపెట్టను. పోలీస్ రిపోర్టిచ్చి తీరతాను..." అని బాలరాజు ఆవేశంగా అనేటప్పటికి కంగారు పడ్డ క్రిష్ణకుమారి, "ఎందుకులే బావా వాళ్లతో మనకీ..." అంది.

"లేదు. పోలీస్ రిపోర్టు ఇవ్వాల్సిందే,"అంటా లేచి తయారైనా బాలరాజు కుంటుకుంటా బయల్దేరి పోలీస్టేషన్కెళ్లబోతుంటే పరుగెట్టుకుంటా వచ్చినో మనిషి, "సార్.. బాలరాజుగారంటే మీరేనాండీ?" అన్నాడు.

"అవును నేనే."

"రాత్రెవరో నలుగురు రౌడీలు సుజాతగారిని చితగ్గొట్టేసేరంట. హాస్పిటల్లో ఉన్నారంటండీ," అన్నాడు.

ఒకటే కంగారు పడిపోయిన బాలరాజు, "అయ్యయ్యో. అలాగా. మగోడ్ని నన్నే పులుసులోకి ఎముక ల్లేకుండా కొట్టేసేరు... పద పద..." అంటా ఆ మనిషెనకాలే నడిచేడు.

నాలుగడుగులేసేకా ఆగున్న ఒక మినీవేన్ క్రాసవ్వబోతుండగా ముందు నడుస్తున్న వాడు విజిల్ వెయ్యడంతో ఆ వేన్ డోర్ తెరుచుకోడం, అందులోకి బాలరాజుని లాగేయడం, ఆ వేన్ కదలడం వెంట వెంటనే జరిగిపోయినియ్యి. లోపలున్న ఆ రౌడీల్లో రాత్రి కూలింగ్లాసులోడు కూడా ఉన్నాడు.

లోపలికొచ్చినా బాలరాజు ఒంటిమీద నిన్న రాత్రి కొట్టిన దెబ్బల తాలూకు బ్లెడ్డు ఇప్పుడే ఆరిందన్న జాలి కూడా లేకుండా మళ్లీ కొట్టడం మొదలెట్టేరు.

అలా బాగా దెబ్బలు తినేసేకా స్పృహ తప్పిందా బాలరాజుకి.

*(ఐపోలేదింకా)*

జ్ఞాపకాలు

❊ ఎ. జగన్నాథశర్మ

# ముపాసాతో ఓ మిట్టమధ్యాహ్నం

లంకలో సీతను చూశాడు హనుమ. ఆమెతో సంభాషించాడు. తిరిగి వెళ్లిపోవాలనుకున్నాడు. కాని ఆగాడు. ఎందుకు ఆగాడంటే... కొంచెం పని మిగిలి ఉన్నది అనుకున్నాట్ట!

*న సామ రక్షస్సు గుణాయ కల్పతే*
*న దానమర్థోపచితేషు యుజ్యతే*
*న భేదసాధ్యా బలదర్పితా జనాః*
*పరాక్రమస్త్వేవ మమేహ రోచతే!*

అంటే... రాక్షసుల స్వభావానికి సామోపాయం కుదరదు. ధనంతో బలిసి ఉన్నవారి విషయంలో దానోపాయానికి అర్థంలేదు. బలగర్వితుల విషయంలో భేధోపాయానికి తావులేదు. ఇక మిగిలింది, శౌర్య పరాక్రమాలతో కూడిన దండోపాయం మాత్రమే అనుకున్నాట్ట హనుమ. అనుకుని, రాక్షసులను రెచ్చగొట్టేందుకు అశోకవన ధ్వంసానికి పూనుకున్నాట్ట!

ఆనాటి హనుమే ఈనాటి రచయిత. దండోపాయంగా రచననే ఎన్నుకోవాలి. తప్పదు అన్నాడు మా నాన్న. ఆయన్ని కలిసేందుకు వచ్చిన మిత్రులతో ఓ చల్లని సాయంత్రం వేళ చెప్పాడలా. నేనప్పుడు టెన్త్ క్లాస్ చదువుతున్నాను. దండోపాయం ఏమిటి? రచనను ఎన్నుకోవడం ఏమిటి? ఏమిటిదంతా? అనుకున్నాను. అర్థంకాలేదేదీ.

నాన్న వామపక్షవాది. రష్యన్ సాహిత్యాన్ని బాగా ఇష్టపడేవాడు. అలాంటివాడు భారత రామాయణ భాగవతాలను చదవడం చిత్రంగా ఉండేది. చదవడమేకాదు, అవసరానికి అప్పుడప్పుడు వాటిలోని శ్లోకాలను పేర్కొని, ఎంచక్కా అర్థాన్ని వివరించేవాడు.

ఆ పద్ధతి నాకు నచ్చేదికాదు. ఒకనాడు నాన్నను నిలదీశాను. ఏంటిదంతా? అన్నాను.

“రచయిత కావాలనుకునేవాడూ, పదిమందికీ పది మంచిమాటలు చెప్పాలనుకునేవాడూ మంచివీ, చెడ్డవీ, క్లాసిక్‌లూ, డిటెక్టివ్‌లూ, పురాణాలూ, ఇతిహాసాలూ, కావ్యాలూ... అన్నీ చదవాలయ్యా! చదువుతూ ఇదెందుకు మంచిదయింది? అదెందుకు చెడ్డదయింది, ఇదెందుకు క్లాసిక్ అయిందన్నది వారంతటవారే తెలుసుకోవాలి. అది ఎలా తెలుసుకోవాలంటే... వడ్రంగి దగ్గర శిష్యరికం చేసే కుర్రాడిలా అణకువగా, ఆరాధనగా తెలుసుకోవాలి. తెలుసుకుంటూ చదవాలి. చదువుతూ రాయాలి. రాస్తూ మాట్లాడాలి. మంచిదని అనిపిస్తే జాగ్రత్త చెయ్యాలి. కాదనిపిస్తే కిటికీలోంచి విసిరేయాలి. మరచిపోవాలి. వామపక్షభావాభిమాని అయినంతమాత్రాన మను చరిత్ర చదవద్దు. విజయవిలాసం చదవద్దంటే... నేనొప్పుకోను,” అనేవాడు నాన్న.

అలాగే అవి చదవడం తప్పు అనడాన్ని గట్టిగా తప్పుబట్టే వారాయన.

డిగ్రీ చదువుతున్న రోజుల్లో విశాఖ రచయితలతో నాకు పరిచయాలు ఏర్పడ్డాయి. పరిచయాలలో రచనని దండోపాయంగా ఎలా మార్చవచ్చో తెలిసింది. నాన్న చెప్పింది ఆనాడు నాకు అర్థమయింది.

హైదరాబాద్ చేరుకున్నప్పుడు, దండోపాయంగా రచనని ప్రయోగిస్తున్న అనేకమంది రచయితలను కలిశాను. వారిలో ‘ముపాసా’ (ముక్తవరం పార్థసారథి) ఒకరు.



నవ్య వీక్లీకి సంపాదకుణ్ణి అయిన తర్వాత... ముపాసాగారి అనువాద నవల 'మరణోపనిషత్' మాన్యుస్క్రిప్ట్ కంటబడితే చదివాను. బాగుంది. ప్రచురణకు స్వీకరించామని చెప్పేందుకు ఫోన్ చేశాను.

"మీ అనువాదం బాగుంది. త్వరలోనే నవలను ప్రచురిస్తాం," అన్నాను.

"థ్యాంక్సండీ! ఆ నవలను చెదలు తినేసేయేమో అనుకున్నాను," అని నవ్వారు.

నవలను వీక్లీకి పంపి మూడేళ్లయిందట! అజా పజా లేకపోవడంతో... చెదలు తినేశాయి అనుకున్నారట!

చిన్నప్పటి నుంచీ అనువాదాలు చదవడం, ఆ పై విపులలో పనిచేయడం, దానాదీనా అనువాదాలంటే నాకు బలే ఇష్టం. వచ్చీరాని ఇంగ్లీషులో చదివి ఏదేదో అర్థం చేసుకునే కంటే... బాగా అనువాదం చేసిన వారి రచనలు చదువుకోవడంలో సుఖ ఉంది, సభ్యత ఉంది అనుకునేవాణ్ణి.

భాష తెలిసినంతమాత్రాన అనువాదం చేయగలమనుకోవడం భ్రమ. భాష ముఖ్యంకాదు. భావం ముఖ్యం. రచనలోని స్థలకాలాదుల గురించేకాదు, ఆ రచనలోని పాత్రల రక్తనమూనా, వారి చెమట చుక్కల రహస్యం కూడా అనువాదకుడికి బాగా తెలిసి ఉండాలి. తెలిస్తేనే అనువాదం రక్తి కడుతుంది. అనువాదాన్ని రక్తి కట్టించడం ముపాసాకు బాగా తెలుసు.

ప్రేమోపనిషత్ తర్వాత అనేక కథలు వారు అనువాదం చెయ్యడం, నేను మా వీక్లీలో ప్రచురించడం జరిగింది. ఆ కథల సమాహారమే 'విశ్వకథాశతకం' ముపాసాగారి అనువాద కథలు ప్రచురిస్తున్నప్పుడు ఒకటి రెండుసార్లు వారిని కలిశాను. ఆనాటికి నేను నవ్యలో మహాభారతం రాస్తున్నాను.

"మీ భారతం బాగుంది శర్మగారూ! మీ వచనం బాగుంటుంది. సింపుల్‌గా ఉంటుంది అన్నారు. వచనాన్ని హాయిగా చదవగలుగుతున్నామంటే... దానిని అంత హాయిగా రాయడానికి మీరెంతగా కష్ట పడుతున్నారో తెలుస్తున్నది," అన్నారు.

“ఇన్ని చదవడానికి మీకు టైమెక్కడిది సార్?” అడిగాను.

“చదవడానికి టైం లేకపోతే రాయడానికి కూడా టైం లేనట్టే,” అని నవ్వారు ముపాసా.

కొన్ని కథల గురించి చర్చిస్తూ... గొప్ప కథలు అన్నీ వివరించవు. కొన్నిటిని దాచిపెడతాయి. వాటిని తెలుసుకోవాలంటే... మనం ఎదగాలన్నారు. ఎదగడానికి ఎక్కువగా చదవాలన్నారు. మా నాన్న గుర్తొచ్చారప్పుడు.

చదవడం, రాయడం గురించి తప్ప మరేమీ మాట్లాడరు ముపాసా. ఆర్థిక పరిస్థితుల గురించిగాని, అనారోగ్యాల గురించిగాని అడగరుగాక అడగరు.

ఇటీవల వారు అనువదించిన ‘బాల్జాక్ జీవితం: సాహిత్యం’ పుస్తకం వచ్చిందంటే... దానిని అడిగి తెచ్చుకునేందుకు, వారితో కాసేపు ముచ్చటించేందుకు నేనూ, రమణజీవీ, రేడియో రాంబాబూ ఓ మిట్టమధ్యాహ్నం వారింటికి వెళ్లాం. వెళ్లిన దగ్గర నుంచీ ఒకటే మాట:

ఏం చదువుతున్నారు? ఏం రాస్తున్నారు?

ఫేస్‌బుక్‌లో అప్పుడప్పుడూ ఏదో రాస్తున్నానంటే...

“కంగారేమీలేదు, త్వరగా రాస్తే బాగా రాయలేరు. బాగా రాయడాన్ని అలవాటుచేసుకోండి! త్వరగా రాయడం దానికదే అలవడుతుంది,” అన్నారు ముపాసా.

కుమ్మరిపనివారిని ‘కుమ్మరి’ అంటారు. కమ్మరి పని చేసేవారిని ‘కమ్మరి’ అంటారు. అలాగే రాసేవాణ్ణి ‘రచయిత’ అంటారు. మంచో చెడో ఎప్పుడూ ఏదో ఒకటి రాయాలి. రాస్తూ ఉండాలి. రచయిత అనిపించుకోవాలన్నారు.

ఒక గొప్ప కథ ఆ కథలోని ప్రధాన పాత్ర గురించి ఓ నిజం చెబితే... ఓ చెత్తకథ ఆ కథ రాసిన రచయిత గురించి ఓ నిజాన్ని చెబుతుంది. తెలుసుకోవాలి. తెలుసుకుంటూ చదువుకోవాలన్నారు.

“ఓ మంచికథ అద్భుతమైన కలండీ. ఆ కలని ఇటు రచయితా, అటు పాఠకుడూ ఇద్దరూ పంచుకుంటారు. కలగంటూ హాయిగా నిద్రిస్తున్న రచయితనీ, పాఠకుణ్ణి పిచ్చిపిచ్చి వాఖ్యానాలతో మేల్కొలిపేవారినే చెత్త విమర్శకులు అంటారు. అలాంటి విమర్శకులతో నాకు పెద్దగా పరిచయాలు లేవు. నేను అదృష్టవంతుణ్ణి,” అని నవ్వారు ముపాసా.

వర్షం కురుస్తున్నదని ఫోటో తీసి చూపించదు కథ. వర్షం కురుస్తున్నదని అనుభూతింపజేస్తుంది. మనం అనుభూతి చెందాలి. ఆనందించాలన్నారు ముపాసా. మధ్యాహ్నం రెండయిందప్పటికి. పదండి పదండి! లేవండి అన్నాడు రాంబాబు. బాల్జాక్ జీవితం: సాహిత్యం బహుమతిగా అందుకుని ముగ్గురం అక్కణ్ణుంచి బయల్దేరాం.

ముపాసా మాటల జలపాతం హోరు వినవస్తుంటే...

ఈరోజు మనం ఒక మంచిపని చేశాం. ముపాసాని కలిశాం అన్నాడు రమణజీవి. అవునవు నన్నాను. ఇలాగే ఒకసారి గురువుగారు శివారెడ్డిగారిని కూడా కలవాలి. ఆయనదీ ఓ కొత్త పుస్తకం వచ్చింది అన్నాను.

తప్పకుండా కలుద్దాం అన్నాడు రాంబాబు.

ఆ సాయంత్రం ప్రముఖ రచయితా, కష్టాల్లో ఉంటే, కౌగలించుకుని మరీ ధైర్యం చెప్పే స్నేహితుడూ నందిగం కృష్ణారావు ఫోన్ చేశారు.

ముపాసాగారిని కలిశారటకదా? ఓ ముక్క చెబితే నేనూ అటు వచ్చేవాణ్ణి కదా? అన్నారు.

ఒకసారి మీరూ, రమణజీవీ, రాంబాబూ పొద్దునే మా ఇంటికి రండి. సాయంత్రం వరకూ కబుర్లాడుకుందాం అన్నారు.

ముపాసా, మా నాన్నగారిలాగే కృష్ణారావుకీ రష్యన్ సాహిత్యం అంటే చాలా ఇష్టం. వారింటికి వెళ్తే రష్యన్ సాహిత్యానికి చెందిన ఏదో ఓ పుస్తకం గుర్తుగా ఇవ్వడం వారికి అలవాటు.

“పుస్తకం చేతిలో ఉండడం, పుస్తకాన్ని చదువుతూ ఉండడం అంటే... మీరు ఒంటరి కాదని అర్థం. చదవండి! ఆలోచించండి! పుస్తకాలు ఉన్నది అందుకే,” అంటారు కృష్ణారావు. ❀

కథ

* విజయ కర్రా



పొద్దు వాటారుతున్న ఆ వేళ, ఎగిసి లేస్తున్న గోధూళిది నీలి ఆకాశాన్ని అందుకునే ప్రయత్నం. ఉరకలేస్తూ గోవులు వాటి వెనుకనే గోపాలకుల రాకతో నందగోకులం వీధులన్నీ సందడి నింపుకున్నాయి.

# మోహనవంశీ





"ఎల్లనా అయ్యా... అదే రేపటి పున్నమి రాత్రి..." చావిడి స్తంభానికి చేరగిలి నిల్చున్న పదిహేనేళ్ల శ్రావణి తండ్రి సమాధానం కోసం ఆతృతగా చూసింది.

వీధి అరుగు మీద కూర్చుని ఆవు దూడకి చిక్కం అల్లుతున్న తండ్రి ఆమె మాట పూర్తి కాకముందే తలెత్తి చూశాడు. తీగలాంటి శరీరం - పల్చని అమాయకమైన మొహం. 'నా కూతురింకా చిన్నది,' అనుకున్నాడు. తిరిగి చిక్కం అల్లుతూ చెప్పాడు. "ఇప్పుడొద్దులే అమ్మా! మళ్లీ నెల పెళ్లి పనులంటూ అత్తమ్మ ముందు గానే వొస్తుందాయే! ఆమెతో కలిసి వెళ్దువుగానిలే." కాదనకుండా కాదన్న తీరు ఈసారికి.



ఇంతకుమునుపు కూడా తండ్రి నుండి అభ్యంతరాలు అనేక రూపాల్లో వచ్చాయి. చిన్నపిల్లవి తల్లీ! అనో, తల్లి లేనిదానివమ్మా! అనో, పెళ్లి కావలసిన పిల్లవనో. తీరా మళ్లీ వచ్చే పౌర్ణమికి ఏ కారణం చెపుతాడో కదా ఈ తండ్రి! నిరాశని సన్నని నిట్టూర్పులో కప్పిపుచ్చుతూ తమ్ముడికేసి చూసింది. ఆవు దూడ మెడ చుట్టూ చేతులు వేసి ఆడుతున్న పదమూడేళ్ల చంద్రుడు ఇదేమీ పట్టనట్లే వున్నాడు.

మగపెళ్లివారికి స్వయంగా ఆహ్వాన పత్రికలు ఇచ్చేందుకు తండ్రి చిన్నాయనతో కలిసి మరుసటి రోజున పక్క ఊరికి వెళ్తున్నాడు. రాత్రికి అక్కడే చెల్లెలి ఇంట వుండి ఆ మర్నాడే తిరిగి రావడం. లోన మెత్తని గడ్డి పరిచి, పూల దండలతో అలంకరించబడిన బండి ఓ పక్కగా నిలిచి వుంది. మువ్వలు కూర్చిన కొత్త గంటలతో ముస్తాబైన గిత్తల జంట- మరుసటి రోజు ప్రయాణానికై ఇంటి పట్టునే వుండి విశ్రాంతి తీసుకుంటున్నాయి. పెళ్లి వారింటికి తీసుకువెళ్లాల్సిన పిండి వంటలు, ఆహ్వాన పత్రికలు మధ్య సావిడీలో పేర్చి వున్నాయి.

ఇంటి వెనుకకి చేరి, ఆలమందలకోసం నీళ్లు తోడి పోసి వెదురుబద్దలా సాగి వెన్ను సవరించుకుంది శ్రావణి. గాలి విసురుకి వల్లెవాటు కొంగు తెరచాపలా పైకి లేచి సుడి తిరిగింది. అదుపు చేసుకునే ప్రయత్నంలో తల పైకెత్తి నీలిమేఘాలను చూసి ఉలిక్కిపడింది. రేపటిరోజున కాకపోతే ఇక కుదిరే దెప్పుడు? పెళ్లయి ఈ ఇంటి గడప దాటి పరాయి ఊరికి చేరిందంటే మరింక ఈ బృందావనం కలలో కూడా ఊహించుకునే అవకాశం రాదు. ఆ నల్లనయ్య వేణుగానం, గోపికల నృత్యం ఈ జన్మకి చూసే అవకాశం తనకి లేదేమో! దిగులు కమ్ముకుంది.

*

సంవత్సరకాలం గడిచి తిరిగి వచ్చిన అతిథి. శరదృతువుని బృందావనం ఆత్మీయంగా ఆలింగనం చేసుకుంది. ఉండీ ఉండీ వీచే చల్లని ఉదయపు గాలికి నేల రాలిన ఆకులు గమ్యం లేకుండా తిరుగు తున్నాయి. గాలి పోనుకుంటున్న వెదుళ్లు ఎవరినో అనుకరించే ప్రయత్నంలో విఫలమవుతున్నాయి. ఒడ్డున కూర్చున్న శ్రావణి చూపులు యమునని దాటి...



***విజయ కర్రా వృత్తిరీత్యా సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్. కౌముది, కినిగె అంతర్జాల పత్రికలలోను, ఆంధ్రజ్యోతిలోను వీరి ఇతర కథలు ప్రచురించబడ్డాయి. భర్త, కుమార్తెలతో బే ఏరియాలో నివాసం.***

దాటి... నింగి నేలని తాకే చోట చిక్కుపడిపోతున్నాయి. కాళ్ల మధ్యన ఖాళీ బిందె నీటిపైన వృత్తాలు తిరుగుతోంది. చుట్టూ వినవస్తున్న నవ్వులూ కేరింతల మధ్య ఆమె ఒంటరి. ఊరులో ఒకరిద్దరే స్నేహితులు. అంత సన్నిహితులేమి కారు. ఎప్పుడైనా ఎవరితోనైనా ముచ్చట పెట్టుకుంటే, 'ఎందుకు తల్లీ! ఆ ఊసుపోక మాటలు? అక్కడి నుండి లేని పోని పోల్చుకోవడాలు,' అంటూ తండ్రి వారించేవాడు. మారుమనువు మాట తలపెట్టకుండా తమని ప్రాణంలా చూసుకుంటున్న తండ్రి మాటకి కట్టుబడి వుంటారు అక్కా తమ్ముడు. ఎట్టకేలకు బిందె నీటితో నింపి కదిలింది. ఒకసారి ఇంటికంటూ వెళితే బందీనైపోతానేమోనన్న భయం. దారిలో కనిపించినంత మేర ఎదురైన స్త్రీలందరూ గొప్ప సంబరంలో వున్నట్లున్నారు. పూలమాలలు కట్టుకుంటూ- సాంబ్రాణి పొగలతో కురులు ఆరబెట్టుకుంటూ సందడి సందడిగా వున్నారు.

"ఏమ్మా! పెళ్లికూతురా! ఆ నత్తనడకలు- మనసెక్కడ పారేసుకున్నావేమిటి?" ఎదురైన చెలి ఒకతె వేళాకోళమాడింది.

మేనత్త స్వయంగా తీసుకొచ్చింది పెళ్లి సంబంధం. శ్రావణమాసపు వేడుకలంటూ అత్త ఇంటికి వెళ్లినప్పుడు చూశాడు ఆ పిల్లవాడు. శ్రావణినే చేసుకుంటానని పట్టుబట్టాడట. ఆ వేడుకల జాతరలో ఆసక్తిగా వెంట తిరిగిన అతడు గుర్తున్నాడు ఆమెకి. నచ్చాడు. ఇష్టపడింది. ఇంకా చిన్నపిల్ల, అప్పుడే చేతికి అందిరాని కొడుకు అంటూ ఇదివరకు ఇతర సంబంధాలకు అభ్యంతరం చెప్పిన తండ్రి ఈసారి మహదానందంగా ఆ కార్తీకంలోనే పెళ్లి ముహూర్తాలు చూసేశాడు. 'అత్తమ్మ కనుసన్నలలో వుంటుంది నా కూతురు,' అంటూ ఆనందించాడు. ఇప్పటివరకూ ఏదో ఒకరోజున తండ్రి ఒప్పుకుంటాడని ఎదురు చూసింది. పున్నమి రాత్రి బృందావనానికి వెళ్లాలని, కృష్ణుని వేణుగానం వింటూ గోపికలతో కలిసి ఆడి పాడాలని కలలు కంది. ఆ కోరిక నెరవేరకుండానే అత్తవారింటికని పరాయి ఊరు వెళ్లిపోవలసి వస్తోంది. తల్లే వుండి వుంటే ఇంట ఎలాంటి అభ్యంతరం వుండేది కాదేమో!

నడక నెమ్మదైంది. కుడివైపు తిరిగితే నందరాజు ఇంటికి వెళ్లేదారి. కృష్ణలీలలను వింటూ పెరిగింది. తల్లి వున్న రోజుల్లో పన్నెండేళ్ల వయసు వరకూ స్నేహితురాళ్లతో కలిసి ఆ వీధిలో ఎన్నోమార్లు తిరిగింది. కృష్ణుడు ఎదురుపడ్డప్పుడు నిస్సంకోచంగా కళ్లలో కళ్లు కలిపి స్వేచ్ఛగా నవ్వింది. ఇప్పుడెదురైతే గుర్తుపడతాడా? అయినా దగ్గరగా చూసి ఎన్నేళ్లయిందని? ఎందుకో యుగాలు గడిచినట్లుగా వుంది. ఆలోచనలలో పరిసరాలు మరచి నడివీధిలో ఆగిపోయిన శ్రావణి- "అక్కా," అన్న పిలుపుతో ఉలిక్కిపడి పక్కనే నిల్చున్న తమ్ముడికేసి అయోమయంగా చూసింది.

"రా! ఇంటికి పోదాం," అంటూ బిందె అందుకుని ముందుకు దారితీశాడు. వసపిట్టలా వాగే తమ్ముడు ఎలాంటి ముచ్చటా లేకుండా వెంట నడవడం కూడా ఆమె గుర్తించలేదు. ఇంటికి వచ్చి రాగానే అన్నాడు, "అక్కా! ఈ రాత్రి నేను తోడు వస్తాను. నువ్వెళ్లు బృందావనానికి."

ఒక్కమాటుగా ఉలిక్కిపడి విన్న విషయం నిజమేనా అన్న సంశయంతో తమ్ముడికేసి చూసింది.

"నిజం అక్కా! ఎవరికీ కనిపించని దూరంలో ఆగిపోయి నీకోసం ఎదురుచూస్తాను. అందరికన్నా కొన్ని క్షణాలు ముందుగా తిరిగి వచ్చావంటే ఇద్దరం కలిసి ఇంటికి వచ్చేయ్యొచ్చు."

తమ్ముడి చేతిలో బిందె అందుకుని కుదురు మీద పెడుతూ, "అమ్మో! అయ్యకి తెలిస్తేనో!" అంది.

ఆమెని ఓ మెట్టు పైన కూర్చోపెట్టి తను క్రింద కూర్చుని చెప్పసాగాడు. "అమ్మ పోయిన నాటికి నీకు పన్నెండేళ్లు. నాకు పది. అయ్య ఒక్కడే చేసుకోలేడని కదా ఆరోజు నుండి ఇంటిపనులు, వంటపనులు అన్నీ చేస్తున్నావు. నన్నూ నా అల్లరిని విసుగు లేకుండా భరిస్తున్నావు. ఆడపిల్లవని, తల్లి లేనిదానివని అయ్య భయాలు అయ్యకి వుండొచ్చు. కానీ... అంత మాత్రాన నీ తోటి యువతులకి వుండే హక్కు నీకెందుకు వుండకూడదు."

మాట్లాడుతున్న తమ్ముడికేసి విస్మయంగా చూస్తుండిపోయింది. "నీకెందుకు, నువ్వెళ్లు అక్కా! నేను వస్తా నీకు తోడుగా! నందగ్రామంలో వున్న ప్రతి స్త్రీకి కన్నయ్య వేణుగానం వింటూ బృందావనంలో ఆడిపాడే హక్కు వుంది. పెళ్లయి ఈ ఊరు దాటావంటే నీ పైన ఎలాంటి ఆంక్షలు వచ్చి పడతాయో! ఈ రాత్రి నీది! ఎలాంటి సంకోచం లేకుండా వెళ్లిరా!"

శ్రావణికి భయం తగ్గలేదు. అయ్యకి తెలిస్తేనో! తిట్టడు. కానీ మనసు కష్టపెట్టుకుంటాడు. జీవితాంతం తమ ఇద్దరి మధ్య ఆ నొప్పి ముళ్లతెరలా వుండి పోతుందే! తమ్ముడు అర్థం చేసుకున్న వాడిలా చూశాడు.

"అయ్యకి నువ్వెళ్లినట్లు ఎవరైనా చెపుతారని అనుకోను నేను. ఈ ఊరిలో ఆ యశోదమ్మ బిడ్డ ఆటాపాటా చూసి వచ్చిన వారెవరూ ఆ వివరాలు మాట్లాడుకోవడం కానీ, చర్చించడం కానీ నేనెప్పుడూ వినలేదు. నువ్వు కానీ విన్నావా! ఊరి జనం అమ్మవారి గుడికి వెళ్లడం ఎంత సహజమో, బృందావనంలో మీ యువతులు కృష్ణయ్య వేణుగానానికి ఆడిపాడడం అంతే సహజం. అంతగా తెలిసినట్లైతే నేను చెపుతాను అయ్యకి. నిన్ను ఒప్పించి స్వయంగా నేనే దగ్గరుండి తీసుకు వెళ్లానని. ఆ కోపమేదైనా వుంటే అయ్యకి నా పైన మిగలాలేకానీ పెళ్లయి పరాయి ఇంటికి వెళ్తున్న నీమీద మాత్రం కాదు!"

శ్రావణికి కళ్లు చెమర్చాయి. మనసు నిండిపోయింది. తనకన్నా రెండు గుప్పెళ్లు పెరిగాడే అనుకుంది కానీ ఇన్ని విషయాలు మాట్లాడగలిగే ఆరింద అయ్యాడని ఆ క్షణానే తెలిసింది. కలకాదు కదా అన్న తీరులో తమ్ముడి చెక్కిలి తాకి చూసింది.

"నిజంగా! వెళ్లనా?!"

చంద్రుడు నవ్వి అక్క చేతిపైన తన చేతిని వుంచాడు.

*

పొద్దు గడిచేలోగా తలస్నానం చేసి, ఆరి ఆరని జుత్తుని జడ కుప్పెలతో కలిపి వొదులుగా అల్లుకుంది. నుదుటిన కస్తూరి తిలకం, కంటికి కాటుక. కాళ్లకి ఎప్పుడూ వుండే మువ్వల పట్టీలే! చెవులకీ చేతులకీ ఎప్పుడూ వుండే ఆభరణాలే! వేసుకున్న నీలిరంగు పరికిణీ వల్లెవాటు పాతవే. ఎవరైనా పొరపాటున ఎదురైతే- తప్పిపోయిన లేగ దూడని వెతుకుతూ వచ్చానంటే నమ్మేలా వుండాలి. ఆనందమే కదా అందం.

వెలిగే అక్క కళ్లకేసి చూస్తూ, "బావున్నావక్కా! కృష్ణుడికి మల్లే!" అన్నాడు చంద్రుడు.

ఆడా మగా అన్న భేదం లేకుండా ఊరందరూ ఏకగ్రీవంగా ఒప్పుకునే అత్యంత అందగాడు కృష్ణుడు. అలాంటి అందగాడితో పోల్చడమే అనుకుని, "అమ్మో!" అంది తప్పు అన్న సూచనగా చూపుడు వేలు పెదవిపై ఆనించి.

"నిజ్జం," అన్నాడు తమ్ముడు నవ్వుతూ!

*

వెన్నెల పుంజుకునేలోగా తాత్కాలిక విజయం ప్రకటించిన చీకట్లలో ఊరు నెమ్మదించింది. అక్కా





తమ్ముడు ఎదురుచూస్తున్నారు. కొన్ని సూచనలు అందుతున్నాయి. అందెల రవళులు, గాజుల గలగల, సనసన్నని నవ్వులు. కొత్త వస్త్రాల గరగరలతో పాటు... వీధిన నడిచి వెళ్లేవారి నుండి గాలి సంగ్రహించి తెచ్చిన కస్తూరి పరిమళాలు కూడా వారిని చేరుతున్నాయి.

మరికొంత నిరీక్షణ. ఆపైన వేణుగానం తేలి వచ్చి చెవులకి సోకింది. ముందర తమ్ముడు వెనుక అక్క కదిలారు. ఇంకెవ్వరి పొడ కనిపించని ఆ పరిసరాలు ఆమెకి ధైర్యాన్ని ఇస్తూ తమ్ముడి వెంట నడిపించాయి.

గుబురైన చెట్ల నీడలలో మరికొంత దూరం నడిచాక కడిమి చెట్టు దగ్గర ఆగాడు చంద్రుడు. ఒడుపుగా ఎగిరి చెట్టు కొమ్మల మధ్యకి చేరుకుంటూ ముందుకు వెళ్లమన్నట్లు శ్రావణికి సంజ్ఞ చేశాడు. పదహారు కళలతో వెలుగుతున్న శరశ్చంద్రుడు ఆపైన తోడైనాడు.

*

శారద రాత్రి. చిక్కని వనవృక్షాల నడుమనున్న ఆ ప్రదేశం జగత్తు అంతటికీ కేంద్రమైనట్లు వెలుగుతోంది. మురళి మోమున దాల్చినవాడు కేంద్రబిందువైనాడు. నాదానికి కట్టుబడి అతడి చుట్టూ లయగా కదులుతున్న గోపికల వలయం. కోలాటమాడే సమయంలో పక్కన జత కలుపుతున్నది ఒక పరి చెలి మరొక పరి మాయావి కృష్ణుడు. రాసలీలకు వేళ అది.

అక్కడిదాకా వేగంగా వచ్చిన శ్రావణి పొగడచెట్టు క్రింద బెరుకుగా ఆగిపో యింది. పైట కొంగును తలపై నుండి చుట్టి, కొసను మునిపంట నొక్కిపట్టింది. చెట్టుని ఆసరాగా చేసుకుని నిలచిపోయింది. తనకు తెలిసినవారెవరా అని గోపికల నొక్కొక్కరినే చూస్తూ తిరిగి కృష్ణుని చూసే సమయానికి అతడామె చూపును ఎదుర్కొని సమ్మోహనంగా నవ్వాడు. వున్నవాడు అక్కడున్నట్లే వుండి... విడివడి ఆమె దగ్గరగా వచ్చి... నవ్వుతూ చేతిని అందుకుని తెచ్చి నాట్యమాడుతున్న భామల మధ్యన వదిలాడు.

కృష్ణుడు దగ్గరగా వచ్చినప్పుడు మేనిలో కలిగిన అలజడి నెమ్మదించి వారిలో ఒకరుగా కలిసిపోయింది. ఆమె రాక ఎవరికీ తెలియకుండా వుంచుదామని అనుకున్న విషయం పూర్తిగా మరుపుకొచ్చింది. గోపికలు కూడా అతి సహజంగా ఆమెని తమలో కలుపుకున్నారు. వారితో కలిసి లయబద్ధంగా అడుగులు వేయసాగింది.

ఒకరి చేతులు మరొకరు అందుకుని కలిసి కొంత సమయం, విడివడి కోలాటమాడుతూ మరి కొంత సమయం- మురళీరవళికి కట్టుబడి నాట్యలీల కొనసాగుతోంది. అలసినవాళ్లు చెట్ల మానుల పైన, బండరాళ్లపైనా కూర్చుని జరుగుతున్న జగన్నాటకానికి సాక్షులవుతున్నారు. విరామం లేని వేణుగానం వారందరిని మోహంలో ముంచివేస్తూ నలుదిశలా వ్యాపించి వ్యాపించి... ఎగసి... పైకెగసి... దివ్య లోకాలకి చేరుతోంది.

అలసిన శ్రావణికి ఓచోట కూర్చుని మురళీరవం వింటూ తదేకంగా కృష్ణుని, నాట్యమాడుతున్న గోపికలని చూడాలనిపించింది. అనుకున్నదే తడువు చెట్టు మానుని ఆనుకుని విశ్రాంతిగా కూర్చుంది. జరుగుతున్నది కలయో మాయో అర్థంకాని స్థితి. మధురిమలు నింపుకున్న వేణుగానం- ఊహకు మించిన ఈ సౌందర్యం- ఈ అలౌకిక ఆనందం- భువన మోహనమైన మరేదో లోకానికి వచ్చినట్లుంది ఆమెకు.

మురళితో వెన్నెల పోటీపడుతోంది. నాదంతో నాట్యం మెరుగు పెట్టుకుంటోంది. ఆడుతున్న గోపికలది పారవశ్యం. కూర్చుని చూసేవారిది తన్మయత్వం. పున్నమి వెన్నెల మరింత ప్రగాఢమైన ఆ మలిజాము గడియలలో కొత్తదనపు ఉనికేదో నెమ్మదిగా వారి మధ్య చోటు చేసుకుంది. సరికొత్త పరిమళమేదో చుట్టూరా ఆవహించింది. కూర్చున్న శ్రావణి మోచేతిని తట్టి చూడమని సైగ చేసింది చెంతనున్న గోపిక.

ఆడుతున్న గోపికల మధ్యన ఎవరా వనిత? గోప స్త్రీ కాదు. తమ ఊరి మనిషి కాదు. ఇంతకు

మున్నెప్పుడూ చూడలేదు. వెన్నవంటి దేహఛాయ! అగరు ధూపం రంగు వలువలు. పూలమాలతో చుట్టి బంధించిన ఒత్తైన కురులు. విశాల నయనాల మధ్యన పొడవుగా తీర్చిన తిలకం. పెదవులపైన ఆగని చిరునవ్వు. కదలికలలో నేర్పయిన లయ!

"ఎవరది?"- కుతూహలంగా అడిగింది శ్రావణి పక్కనున్న గోపికని.

"మధురానగర వాసియో? రాచకన్యయో? మరి దేవకన్యయో? ఊహూ! మధురలో కూడా నే జూడలేదు ఇంతటి సౌందర్యరాశిని," తనలో తాను అనుకున్నట్లుగా జవాబిచ్చింది ఆమె.

మరికొద్ది సమయంలో పరిసరాల స్పృహ వీడి ఆ నర్తకి భావావేశం వేరు ఉపరితలంలోకి ప్రవేశించింది. అప్పటివరకూ అందరితో కలిసి నర్తిస్తూ కేవలం లయబద్ధమైన ఆమె కదలికలో ఏదో మార్పు. భావ వ్యక్తీకరణలో ఏదో కొత్తదనం. తక్కిన గోపికలకు ఏమి జరుగుతోందో తెలిసేలోగా విస్మయంతో వాళ్ల లయ నెమ్మదించింది. వారు మునుపెన్నడూ చూడని హావ భావాలు, కరవిన్యాసం, హస్తముద్రలు, పాద కదలిక ఆమె సొంతం. ఆ ప్రత్యేక నర్తనాన్ని కళ్లారా చూడాలన్న కుతూహలంతో గోపికలు ఆమె నుండి విడివడి దూరంగా జరిగారు.

లయ జతియై, జతి నృత్తమై, నృత్యమై, నాట్యమై, లాస్యమై... తనను తాను మరచి పురి విప్పిన నెమలివలె ఆమె నర్తించసాగింది. వేణుగానం ఒక్క క్షణం లయతప్పి తిరిగి నిలదొక్కుకుంది. అలౌకిక తన్మయత్వంలో అరమోడ్పులై వున్న కృష్ణుని కళ్లు విచ్చుకున్నాయి. అతడి మోములో విస్మయం, హాసం ఒకేసారి తొంగిచూశాయి. ఆమె హావభావాలకు అనుగుణంగా మారే ప్రయత్నంలో మురళీనాదం తడబడింది. ప్రయత్నమైతే మరికొంతసేపు కొనసాగింది.

జలపాతాన్ని తలపోసే ఆ నాట్య వేగానికి వేణు గానాన్ని జోడించడం సాధ్యమా?!

అది లాస్యం, అది నర్తనం, అది నృత్యం, అది నాట్యం! అది పరవశం, అది మోహం, అది కేళి, అది తాండవం!

ఆమె వేగానికి జత కలపలేక మురళి మూగ పోయింది. గానం ఆగిన కొద్ది క్షణాలకి నృత్యం నెమ్మదించి... ఆగింది. గోపికలందరూ నిశ్చేష్టులై ఎక్కడివారక్కడ నిలిచిపోయారు.

మురళిని రెండు చేతుల మధ్యన వుంచి తల వొంచి నవ్వుతూ కృష్ణుడు ఆమెకి అభివాదం చేశాడు.

"నమో నటరాజ! నమో నమః!!!"

చిరునవ్వుతో తలవొంచి అభివాదం స్వీకరించి నాలుగు అడుగులు వెనుకకు వేసి ఆ నర్తకి అదృశ్య మైంది.

ముందుగా తేరుకున్న శ్రావణి వెనుతిరిగి తమ్ముడున్న చోటుకి చేరుకుంది. ఇంటికి చేరుకున్నాక వర్ణించి వర్ణించి శ్రావణి చెపుతున్న విషయాన్ని సంభ్రమాశ్చర్యాలతో విన్నాడు చంద్రుడు. అంతటి అద్భుతం జరిగాక శ్రావణి వెళ్లిన విషయం కడలిలో నీటిబొట్టు వంటిదని, ఎవరికీ పట్టదని అక్కా తమ్ముళ్లి ద్దరికీ అనిపించింది. అది అలాంటి ఇలాంటి సంఘటన కాదే! అందుకే చంద్రుడు మళ్లీ మళ్లీ అడిగి చెప్పించుకున్నాడు. ఆ ముచ్చటతోనే వారికి తెల్లవారి పోయింది. ఆ ముచ్చటతోనే పల్లె నిద్ర లేచింది.

నంద గ్రామంలో ప్రజలకు అది ముందు రోజులాంటి రోజు కాదు. ఏనాడూ బృందావన లీలల గురించి ఈసంతైనా మాట్లాడని గోపికలు ఆ రాత్రి తాము చూసిన ఆ నర్తకి సౌందర్యాన్ని ఆమె అపురూప నాట్యాన్ని చిలువలు పలువలు చేసి చెప్పుకున్నారు. ఊరు, వాడ, నగరం, రాజ్యం దాటి కథ అమరం అయింది. కని విని ఎరిగిన కథ! కాలానికి నిలిచి చిరస్మరణీయమైన కథ! అందుకు సాక్షిగా బృందా వనంలో యమునా నదీతీరంలో కృష్ణుని ముని మనుమడైన వజ్రనాభుడి పర్యవేక్షణలో గోపేశ్వర్ మహదేవుని ఆలయం వెలిసింది. ❁



జలపతి & శ్రీ అట్లూరి

# ఆంధ్రపదేశ్‌లో తెలుగు సినిమాకి కొత్త కళ

***తెలుగు సినిమా పరిశ్రమ ఇప్పుడు గ్లోబల్ స్థాయికి ఎదిగింది. అయితే, గత కొన్నేళ్లలో తెలుగు సినిమా మార్కెట్ ఆంధ్రప్రదేశ్‌లో పెద్దగా పెరగలేదు. అలాగే సినిమా పరిశ్రమ అనేక సమస్యలు ఎదుర్కొంది. ఇప్పుడు తెలుగుదేశం - జనసేన - బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో సినిమా ఇండస్ట్రీ సంబరాలు చేసుకుంటోంది. దీనికి చాలా కారణాలున్నాయి. అవేంటో చూద్దాం!***

### మార్కెట్‌కి ఊపు

కొత్త ప్రభుత్వం రాకతో ఏపీలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని భావిస్తున్నారు. చంద్రబాబు ఎప్పుడూ సినిమా ఇండస్ట్రీ అభివృద్ధికి పాటుపడ్డారు. సినిమా పెద్దలకు ఆయన ఎప్పుడూ అందుబాటులో ఉంటూ వచ్చారు. దశాబ్దాలుగా రాజకీయాల్లో కొనసాగుతున్న చంద్రబాబు, ఎప్పుడూ టాలీవుడ్ సంక్షేమం మాత్రమే కోరుకున్నారు. వాళ్ల సమస్యలు తీర్చేందుకు ఎప్పుడూ ముందుకొచ్చారు. పరిశ్రమకు అందుబాటులో ఉండే వ్యక్తిని సినిమాటోగ్రఫీ మంత్రిగా నియమించారు. ఇండస్ట్రీ పెద్దలు ఎప్పుడు తనను కలవాలని అనుకున్నా, వాళ్లకు అపాయింట్‌మెంట్ ఇస్తూనే ఉన్నారు. అంతేకాదు, ఎన్నో సినిమా ఫంక్షన్లకు ఆయన హాజరయ్యారు. రాష్ట్ర విభజన తర్వాత అమరావతిని రాజధానిగా ప్రకటించిన తర్వాత, కోర్ క్యాపిటల్, సీడ్ క్యాపిటల్‌లో టాలీవుడ్‌కు కూడా ఆయన చోటిచ్చారు. హైదరాబాద్‌తో సమానంగా, అమరావతిలో కూడా టాలీవుడ్ అభివృద్ధి చెందాలని బలంగా ఆకాంక్షించారు చంద్రబాబు.

అయితే 2019లో అధికారం కోల్పోయిన తర్వాత చంద్రబాబు ప్రణాళికలన్నీ ఎక్కడికక్కడ ఆగిపోయాయి. అమరావతి అభివృద్ధితోపాటు, టాలీవుడ్ అభివృద్ధి కూడా ఆగిపోయింది. ఇప్పుడు మళ్లీ బాబుకు టైమ్ వచ్చింది. తెలుగుదేశం ప్రభుత్వం కొలువుదీరింది. ఈసారి చంద్రబాబుకు ఐదేళ్లు టైమ్ దొరికింది.

ఈ ఐదేళ్లలో రాష్ట్ర అభివృద్ధితో పాటు, రాష్ట్రంలో టాలీవుడ్ అభివృద్ధికి చేయాల్సిందంతా చేయడానికి బాబు సిద్ధంగా ఉన్నారు. అందుకే మార్కెట్‌కి కొత్త ఊపు వచ్చింది.




## టికెట్ రేట్లు

గత ప్రభుత్వం టికెట్ రేట్ల విషయంలో నిర్మాతలను అనేక ఇబ్బందులకు గురి చేసింది. కొందరు హీరోలు అవమానాలు కూడా ఎదుర్కొన్నారు. ఇప్పుడు టికెట్ రేట్లు కచ్చితంగా పెరుగుతాయి. ప్రజలకు, నిర్మాతలకు ఇబ్బంది కలగని రీతిలో పెంచే అవకాశం ఉంది. తెలంగాణ తరహాలో యూనిఫామ్ పద్ధతిని ఏర్పాటుచెయ్యాలని కొత్త ప్రభుత్వాన్ని కోరనుంది తెలుగు చిత్రసీమ. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో శ్లాబ్ సిస్టమ్ అమల్లో ఉంది. నగరాల్లో, సెమీ-అర్బన్ ప్రాంతాల్లో, మండల కేంద్రాల్లో, పంచాయతీ పరిధిలో ఉన్న థియేటర్లలో ఒక్కో రేటు అమల్లో ఉంది. సామాన్యులకు కూడా అందుబాటులో ఉండాలంటూ గత ముఖ్యమంత్రి టికెట్ రేట్లు బాగా తగ్గించేశారు. ఇది ప్రతికూల ప్రభావాన్ని చూపింది. చాలా థియేటర్లు నడవలేక, మూతపడ్డాయి. మరికొన్ని థియేటర్లు టాలీవుడ్ పెద్దల చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఇంకొంతమంది సీజన్‌కు తగ్గట్టు థియేటర్లు తెరవడం మొదలుపెట్టారు. దీనికితోడు సినిమా హాళ్లపై అధికారుల దాడులు పెరగడంతో, రాష్ట్రంలో థియేట్రికల్ వ్యవస్థ కుదేలైంది. ఇవన్నీ సరిచేయాల్సిన అవసరం ఉంది.

ప్రేక్షకులకు అందుబాటులో ఉండేలా రాష్ట్ర వ్యాప్తంగా యూనిఫామ్ రేట్లు విధించడంతోపాటు... సినిమా రిలీజైన మొదటి వారం లేదా పదిరోజులు టికెట్ రేట్లు పెంచుకునేలా చర్యలు చేపట్టాలి. దీనికితోడు బెనిఫిట్ షోలకు కూడా అనుమతి ఇవ్వాలి. అప్పుడే ఏపీలో మళ్లీ థియేటర్లు కళకళలాడతాయి.

## పెట్టుబడులు

మొన్నటివరకు ఏపీకి చెందిన చాలామంది వ్యాపారవేత్తలు, డబ్బున్నవాళ్లు తెలుగు చిత్రసీమలో డబ్బులు పెట్టలేదు. రాజకీయ, ఇతర కారణాల వల్ల ఇలాంటి వాళ్లంతా పరిశ్రమకు దూరంగా ఉన్నారు. చాలా డబ్బు టాలీవుడ్‌లోకి రాకుండా ఆగిపోయింది. కొంతమంది నిర్మాణంలోకి అడుగుపెట్టినప్పటికీ, అది సరైన ఇన్వెస్టిమెంట్ అనిపించుకోలేదు. తెర వెనక జరిగే ఈ బిజినెస్ మొత్తం ఇప్పుడు మళ్లీ పెరిగే అవకాశం





ఉంది. టీడీపీ రాకతో చాలామంది ఇప్పుడు పరిశ్రమలో పెట్టుబడులకు రెడీ అవుతున్నారు. కేవలం రాష్ట్ర స్థాయి నుంచి మాత్రమే కాకుండా... విదేశాల నుంచి కూడా కొంతమంది సినిమాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే అవకాశం ఉంది. ఇలా పెట్టుబడి పెరిగితే, సినిమాల నిర్మాణం పెరుగుతుంది. టాలీవుడ్‌కు అది ఎంతో మేలు చేకూరుస్తుంది. పెట్టుబడులు పుష్కలంగా ఉన్నప్పుడు ఔత్సాహిక మేకర్స్ మరింతమంది పరిశ్రమలోకి వస్తారు. కొత్త కథలు, కాన్సెప్టులతో సినిమాలొస్తాయి. అది టాలీవుడ్ అభివృద్ధికి ఎంతగానే ఉపయోగపడుతుంది.

### పవన్‌కళ్యాణ్, బాలయ్య సినిమాలకు క్రేజ్

ఇక వ్యక్తిగత స్థాయిలో చూసుకుంటే, ఏపీలో టీడీపీ ప్రభుత్వం రాకతో పవన్‌కల్యాణ్, బాలయ్య సినిమాలకు భారీగా డిమాండ్ పెరగడం ఖాయం. గత ప్రభుత్వంలో వీళ్ల సినిమాలకు ఆంధ్రప్రదేశ్‌లో పెద్దగా ఆదరణ దక్కలేదు. పవన్‌కల్యాణ్ తన రీఎంట్రీ మూవీగా వకీల్ సాబ్ సినిమా చేసినప్పుడు, ఏపీ నుంచి వచ్చిన వసూళ్లను దిల్ రాజు బయటకు చెప్పలేక పోయారు. కానీ ఇప్పుడు సీన్ పూర్తిగా మారిపోయింది. పవన్ సినిమాలకు ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడున్న డిమాండ్‌కు మించి అదనంగా 70శాతం డిమాండ్ పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. పవన్ సినిమాలకు ఏపీలో మరింత ఆదరణ దక్కడం ఖాయం. ప్రస్తుతం ఆయన ఓజీ, ఉస్తాద్ భగత్‌సింగ్, హరిహర వీరమల్లు సినిమాలు చేస్తున్నారు. ఈ సినిమాల్లో ముందుగా ఓజీ థియేటర్లలోకి వచ్చే అవకాశం ఉంది. ఏపీలో ఈ సినిమాకు భారీగా థియేటర్లు దక్కడంతోపాటు, టికెట్ రేట్ల పెంపులో వెసులుబాటు కూడా దక్కే అవకాశం ఉంది. ఇదే జరిగితే వసూళ్లలో పవన్‌కల్యాణ్ సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయం. అటు బాలయ్యకు కూడా ఇదే ఫార్ములా వర్కవుట్ అవుతుంది. బాబి దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు బాలయ్య. ఇంకా పేరు పెట్టని ఈ సినిమా ఈ ఏడాదిలోనే థియేటర్లలోకి వస్తుంది. ఏపీలో ఈ సినిమా కళ్లుచెదిరే వసూళ్లు సాధించే అవకాశం ఉంది.

### నంది అవార్డులు

ఏపీ, తెలంగాణ విడిపోయిన ఈ పదేళ్లలో ఇప్పటివరకు నంది అవార్డులు ఇవ్వలేదు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం నంది అవార్డులు ప్రకటించినా అవి వివాదాల్లో పడ్డాయి. ఆ తర్వాత వాటిని ప్రదానం చేయలేదు. నంది అవార్డులు ఇవ్వాలని ఇప్పుడు చిత్రసీమ కోరుతుంది. గడిచిన ఐదేళ్లుగా ఈ డిమాండ్ మరింత పెరిగింది. గత ప్రభుత్వంలో చిరంజీవి పలువురు పెద్దల్ని కలుపుకొని మరీ నాటి ముఖ్య మంత్రి జగన్‌ను కలిశారు. ఇందులో నంది అవార్డుల్ని కూడా ప్రస్తావించారు. మహేష్‌బాబు, ప్రభాస్ లాంటి హీరోలు కూడా ఈ సమావేశంలో ఉన్నారు. అయితే అవార్డులపై ఎలాంటి స్పష్టమైన విధానం తీసుకోలేదు. అప్పటి ప్రభుత్వంలో టాలీవుడ్ తరపున కీలకంగా వ్యవహరించిన పోసాని, చాలా స్టేట్‌మెంట్స్ ఇచ్చినప్పటికీ ఆచరణకు వచ్చేసరికి ఒక్కటి కూడా అమలు కాలేదు. ఇప్పుడీ పద్ధతి మారబోతోంది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది లోనే నంది అవార్డులపై ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అంతేకాదు, ఏపీలో ఈ అవార్డుల కార్యక్రమాన్ని ప్రభుత్వం తరపున భారీగా నిర్వహించే యోచన కూడా ఉంది. ఎందుకంటే, ఈ చర్య కూడా రాష్ట్రంలో పరిశ్రమ అభివృద్ధికి ఎంతగానో ఉపయోగ పడుతుంది.

### ఏపీలో మరిన్ని షూటింగులు, సినీ కార్యక్రమాలు

జగన్ అధికారంలో ఉన్నప్పుడు ఏపీలో షూటింగ్స్‌ను తప్పనిసరి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో షూటింగ్ చేసిన సినిమాలకే కొన్ని రాయితీలు ఇచ్చే కార్యక్రమం మొదలుపెట్టారు. కానీ అది అనుకున్నంత ఫలితాలు ఇవ్వలేదు.

ఏపీలో షూటింగ్స్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయనుంది చంద్రబాబు ప్రభుత్వం. ప్రస్తుతం షూటింగ్స్‌కు అనువుగా ఉన్న ప్రాంతాల్ని మరింత అభివృద్ధి







చేయడంతోపాటు, కొత్త లొకేషన్లను కూడా గుర్తించి, అభివృద్ధి పనులు చేపట్టాలని టాలీవుడ్ కోరుకుంటోంది. ఈ దిశగా చంద్రబాబు సర్కార్ ఓ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేసే అవకాశం ఉందని అశ్వనీదత్ లాంటి నిర్మాతలు ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. మరోవైపు సినీ ఈవెంట్లు కూడా ఆంధ్రప్రదేశ్‌లో పెరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోబోతోంది. రాష్ట్రంలో సినిమా ఫంక్షన్లు పెరగాలంటే.. మౌలిక వసతులు పెరగాలి. ఆ దిశగా చంద్రబాబు కచ్చితంగా పావులు కదుపుతారనడంలో సందేహం లేదు.

### విశాఖపట్నం హబ్

హైదరాబాద్‌లో టాలీవుడ్ ఎలాగైతే అభివృద్ధి చెందిందో, ఆంధ్రప్రదేశ్‌లో కూడా అలాంటి అభివృద్ధి జరగాలి. అలా జరగాలంటే టాలీవుడ్ కోసం ఓ హబ్ ఏర్పాటుచేయాలి. రాజధానిగా ఎలాగైతే అమరావతిని నిర్ణయించారో, అలాగే టాలీవుడ్ హబ్‌గా ఓ ప్రాంతాన్ని ప్రకటించి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. స్టుడియో నిర్మాణం, పోస్ట్ ప్రొడక్షన్ ఫెసిలిటీస్, రాకపోకలు ఈజీగా సాగేందుకు లాజిస్టిక్ సదుపాయాలు, అన్నింటికీ మించి మానవవనరులు పుష్కలంగా అందుబాటులో ఉండేలా చర్యలు... ఓ ప్రాంతాన్ని గుర్తించిన తర్వాత ఇవన్నీ వాటంతట అవే బిల్డ్ అవుతాయి. అలాంటి హబ్‌గా విశాఖపట్నంను తయారుచేయాలని 2014లో చంద్రబాబు ప్రకటించారు. ఇప్పుడు ఆ దిశగా బాబు సర్కారు మరిన్ని నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. వైజాగ్‌ను టాలీవుడ్‌కు కేరాఫ్‌గా మార్చేందుకు ఈసారి చంద్రబాబు అన్ని చర్యలు తీసుకోబోతున్నారు. ఒరిస్సా, ఛత్తీస్‌గడ్ లాంటి రాష్ట్రాల నుంచి మేకర్స్ వచ్చి వైజాగ్‌లో షూటింగ్స్, పోస్ట్ ప్రొడక్షన్ లాంటి పనులు చేసుకుంటున్నారు. టాలీవుడ్‌ను కూడా వైజాగ్ వైపు మళ్లించాలంటే అర్జెంట్‌గా ఓ ఫిలింసిటీ నిర్మాణం జరగాలి. ఆంధ్రప్రదేశ్‌లో ఫిలింసిటీ నిర్మాణంపై చంద్రబాబు చాన్నాళ్లుగా సముఖంగా ఉన్నారు. పీపీపీ మోడల్‌లో భారీ ఫిలింసిటీని నిర్మించాలనే ఆలోచన చంద్రబాబుకు ఎప్పట్నుంచో ఉంది. ఈ టెర్మ్‌లో దీనిపై కీలక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. విశాఖ కేంద్రంగా ఇవన్నీ జరిగితే, చంద్రబాబు కలలుగన్న వాణిజ్య రాజధాని హోదా విశాఖకు మరింత త్వరగా చేకూరే అవకాశం ఉంది. పనిలోపనిగా టాలీవుడ్‌కు సెకండ్ డెస్టినేషన్‌గా కూడా విశాఖ అవతరించే అవకాశం ఉంది.

ఆంధ్రపదేశ్‌లో తెలుగు సినిమాకి కొత్త కళ తీసుకురావాలంటే వీటిలో కనీసం కొన్నింటిని యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలి. అప్పుడే ఆంధ్రప్రదేశ్‌లో టాలీవుడ్ అభివృద్ధి సాధ్యం. ఈ ఐదేళ్లలో ఏపీలో టాలీవుడ్ మరింత అభివృద్ధి చెందుతుందని అంతా భావిస్తున్నారు.



జలపతి & శ్రీ అట్లూరి

# మళ్లీ నిరూపించిన ప్రభాస్

బాక్సాఫీస్ కింగ్ ప్రభాస్. ఇదేదో టాలీవుడ్‌కు మాత్రమే చెప్పుకునే ట్యాగ్ లైన్ కాదు. ఇండియా మొత్తమ్మీద ఎక్కడైనా ప్రభాస్‌కు అతికినట్టు సరిపోయే ట్యాగ్ లైన్ ఇది. అసలైన పాన్ ఇండియా స్టార్ అంటే ప్రభాస్. కల్కి సినిమాతో బాక్సాఫీస్ వద్ద తన పవరేంటో మరోసారి చూపించాడు మన రెబల్ స్టార్.



ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కల్కి ఊచకోత నడుస్తోంది. ఇండియన్ బాక్సాఫీస్, ఓవర్సీస్ అనే తేడా లేకుండా ప్రపంచవ్యాప్తంగా కల్కి సినిమాకు ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. నార్త్ అమెరికా, నార్త్ ఇండియా, నైజాం... ఇలా ఏరియా ఏదైనా అక్కడ ఆధిపత్యం ప్రభాస్‌దే.

యూఎస్ఏలో ప్రభాస్ ప్రభంజనం గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. అమెరికాలో ఇండియన్ సినిమాలకు సంబంధించి నంబర్ వన్ మూవీ బాహుబలి-2. 22 మిలియన్ డాలర్లకు పైగా వసూళ్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్న ఈ సినిమా ప్రభాస్‌దే. ఇప్పుడు కల్కి సినిమా రెండో స్థానానికి ఎగబాకింది. ఈ సినిమా కూడా ప్రభాస్‌దే. లిస్ట్‌లో నాలుగో స్థానంలో సలార్ ఉంది. ఇందులో కూడా ప్రభాస్ హీరో. ఇలా టాప్-5 ఆల్ టైమ్ హిట్స్‌లో 4 ప్రభాస్‌వే. దీన్నిబట్టి ఓవర్సీస్‌లో ప్రభాస్ సత్తా ఏంటనేది ఈజీగా అర్థమవుతుంది.

ఇక నార్త్ ఇండియాలో కూడా ప్రభాస్ తన సత్తా చాటాడు. కల్కి సినిమా ఈ ఏడాది బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. 2024కు సంబంధించి ఇప్పటివరకు దేశంలో పెద్ద హిట్ ఫైటర్ మాత్రమే. హృతిక్ రోషన్ హీరోగా నటించిన ఆ సినిమాకు దేశవ్యాప్తంగా 215 కోట్ల రూపాయల నెట్ వసూళ్లు వచ్చాయి. ఇప్పుడీ సినిమాను కల్కి అధిగమించింది. తాజా వసూళ్లతో కల్కి సినిమా ఈ ఏడాది బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. కేవలం రిలీజైన 12 రోజుల్లోనే ఈ ఘనత సాధించింది ప్రభాస్ సినిమా. ఈ సినిమా నార్త్ బెల్ట్‌లో కనీసం మరో 2 వారాలు నడుస్తుందనే అంచనాలున్నాయి. అదే కనుక జరిగితే బాహుబలి-2 నార్త్ రికార్డ్‌ను కూడా ఇది తిరగరాయడం ఖాయంగా కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ

సినిమా 250 కోట్ల రూపాయల నెట్ దిశగా దూసుకుపోతోంది. ఇక్కడే మరో రికార్డ్ కూడా నమోదైంది. నార్త్ ఇండియాలో 200 కోట్ల రూపాయలకు పైగా వసూళ్లు సాధించిన దక్షిణాది చిత్రాల్లో 3 సినిమాలు, ప్రభాస్ నటించినవే. *కల్కి*తో పాటు.. *బాహుబలి-1, బాహుబలి-2* సినిమాలు ప్రభాస్ ఖాతాలో ఉన్నాయి.

ఇక నైజాం విషయానికొస్తే, ఇక్కడ కూడా ప్రభాస్ డామినేషన్ స్పష్టంగా కనిపిస్తోంది. నైజాంలో ఆల్ టైమ్ టాప్ మూవీస్‌లో మొదటి స్థానంలో *ఆర్ఆర్ఆర్* నిలిచింది. రెండో స్థానంలో *కల్కి*, మూడో స్థానంలో *సలార్*, నాలుగో స్థానంలో *బాహుబలి-2* నిలిచాయి. అలా 4 సినిమాల్లో 3 ప్రభాస్‌వే. దీన్ని బట్టి నైజాంలో ప్రభాస్ స్టామినా ఏంటో తెలుస్తుంది. అంతేకాదు, ప్రస్తుతం నైజాంలో *కల్కి* సినిమా భారీ వసూళ్లతో దూసుకుపోతోంది. *ఆర్ఆర్ఆర్* సినిమాను క్రాస్ చేసినా ఆశ్చర్యపోనక్కర్లేదు. అదే కనుక జరిగితే నైజాం కింగ్‌గా అవతరిస్తాడు రెబల్ స్టార్.

ఈ క్రమంలో తనపై వచ్చిన ఓ పెద్ద విమర్శకు కూడా చెక్ పెట్టాడు ప్రభాస్. ఈ హీరోకు హిట్టివ్వాలంటే రాజమౌళి రావాలి అనేది ఆ కామెంట్. దీని వెనక చాలా పెద్ద కథ ఉంది. ప్రభాస్‌కు *ఛత్రపతి* రూపంలో పెద్ద హిట్టిచ్చాడు రాజమౌళి. ఆ తర్వాత అతడికి మళ్లీ ఆ స్థాయి హిట్స్ పడలేదు. ఆ తర్వాత ప్రభాస్‌తో *బాహుబలి-1, బాహుబలి-2* తీశాడు జక్కన్న. ఆ సినిమాల తర్వాత మళ్లీ ప్రభాస్‌కు సక్సెస్ రాలేదు. *బాహుబలి-2* తర్వాత ప్రభాస్ చాలా ఇబ్బందిపడ్డాడు. భారీ అంచనాల మధ్య వచ్చిన *సాహో* సినిమా బోల్తా కొట్టింది. ఫ్లాప్ అయినప్పటికీ ఈ సినిమాకు నార్త్‌లో వంద కోట్లు వచ్చాయి. అది వేరే విషయం, సినిమా మాత్రం ఫ్లాప్. ఆ తర్వాత *రాధేశ్యామ్* తీశాడు. అది కూడా ఫ్లాప్ అయింది. దీంతో రాజమౌళి లేకపోతే ప్రభాస్ హిట్ కొట్టలేడనే విమర్శ మరింత బలంగా నాటుకుంది.

ఎట్టకేలకు *కల్కి* సినిమాతో ఆ విమర్శలకు తిరుగులేని సమాధానమిచ్చాడు ప్రభాస్. నాగ్ అశ్విన్



దర్శకత్వంలో తెరకెక్కిన *కల్కి* సినిమాతో లోకల్‌గా, నాన్-లోకల్‌గా వసూళ్ల వర్షం కురిపిస్తున్నాడు. అంత కంటే ముందు *సలార్* సినిమాతో బాక్సాఫీస్ బద్దలు కొట్టాడు. భారీ విజయాన్ని అందుకున్నాడు. అలా హిట్ కొట్టాలన్నా, రికార్డులు సృష్టించాలన్నా తనకు ప్రతిసారి రాజమౌళి అవసరం లేదనే విషయాన్ని *కల్కి*తో బలంగా చెప్పాడు ప్రభాస్. ఏ దర్శకుడితోనైనా రికార్డులు సృష్టించేంత స్టార్ పవర్ తనకు ఉందని చాటి చెప్పాడు. ఇకపై ప్రభాస్ కెరీర్‌ను *బాహుబలి-2*కు ముందు, తర్వాత అని చెప్పుకోవాల్సిన అవసరం లేదు. *సలార్*కు ముందు, *సలార్* తర్వాత అని కూడా చెప్పుకోవాల్సిన పనిలేదు. చివరికి *కల్కి* సినిమాతో కూడా అలాంటి పోలిక అవసరం లేదు. ఎందుకంటే, ప్రభాస్ స్థాయి వేరు. అతడు ఏ సినిమా చేసినా, దానికో బెంచ్ మార్క్ సెట్ చేస్తున్నాడు, సినీచరిత్రలో ఓ మైలురాయిగా మారుస్తున్నాడు.

*బాహుబలి-2* తర్వాత ప్రభాస్ కెరీర్ ట్రాక్ తప్పింది. *సలార్*తో అది మళ్లీ పట్టాలపైకి వచ్చింది. ఇప్పుడు *కల్కి* సినిమాతో పట్టాలపై పరుగులు పెడుతోంది. ఇదే ఊపులో రాబోయే సినిమాలతో కూడా విజయాలు అందుకుంటే, అసలైన పాన్ వరల్డ్ స్టార్‌గా అవతరిస్తాడు ప్రభాస్. ఆ తర్వాత అతడు నిరూపించుకోవాల్సిన అవసరం ఉండదు. ప్రభాస్ సినిమా వస్తుందంటే చాలు ఆటోమేటిగ్గా వసూళ్ల వర్షం కురుస్తుంది. ❁



గోదాదేవి

చిత్రకారులు: కొండపల్లి శేషగిరిరావు